# గురుపాదములాశ్రయింపుమా



చ॥ "శరణు పరాత్పరా! శరణు సర్వ చరాచర విశ్వరూపుడా!
శరణు గురూత్తమా! శరణు శౌరి, విరించి, శివస్వరూపుడా!
శరణు త్రిమూర్త్యాతీత! భవసాగర తారక! దేవదేవ! నీ
చరణము దిక్క"టంచు, మనసా! గురుపాదములాశ్రయింపుమా!

చ॥ నరుడనిచూచినావో గురునాథు కృతార్థత నొందజాలవు నీ
శ్వరుడని నమ్మినావొ అల బ్రహ్మ పదార్థ మెరుంగవచ్చు నీ
సరియగు లక్ష్యమొక్కటియె చాలును సాధనలెల్ల గూర్చు నీ
శ్వరుడని నమ్మి మనసా! గురుపాదములాశ్రయింపుమా!

ఉ॥ కంటను చూడవచ్చు పదకంజములంటి భజింపవచ్చు దా
వెంటను నడిచి వచ్చు నహో! ప్రేమగ పెట్టిన దారగించు నీ
యింటికి వచ్చి పూజగొను నేర్పెడు శంకలునూడ్చివైచు ము
క్కంటిగ తన్నెరుంగ కడగంటను బ్రోచును శ్రీగురుండు ని
న్నంటియె ఉన్నవాడు మనసా! గురుపాదములాశ్రయింపుమా!

# మాతాజీ ఆశీస్సులు

శ్రీ సద్గురు దేవుల దివ్య మంగళ విగ్రహం మనకి కనుమరుగై అప్పుడే 25 సంవత్సరాలు అయిపోయిందా! ఇది నమ్మశక్యమేనా? కాలం ఎవరికోసము ఆగదు. కాని కాల స్వరూపుడైన పరమాత్మ ఒక్కడికే కాలాన్ని తెలుసుకోగలిగిన శక్తీ, ఆపగలిగే శక్తీ కూడా వుంటాయి. అందుకనే శ్రీ సద్గురుదేవులని "కాలజ్ఞాన విదగ్రణిం' అని కీర్తించారు.



'పుట్టినరోజుని పండుగగా చేసుకుంటారే గానీ, కనుమరుగైన రోజుని యీ విధంగా ఎవరైనా పెద్ద ఉత్సవంగా చేసుకుంటారా?' అని అందరిలోనూ సాధారణంగా ఉదయించే ప్రశ్న. అసలు పుట్టడమే లేనివాడికి లేకపోవడమనేది ఎక్కడ?

భక్త జనోద్ధరణకై, అనంతశక్తి ఒక రూపందాల్చి మనముందుకు సత్యగురువుల రూపంలో వస్తుంది. రూపాన్ని ధరించి వచ్చిన మహాత్ములను మానవులు సరిగా గుర్తించక, "వారు వచ్చారు; వెళ్ళారు; తిన్నారు; నవ్వారు" అని అనేక విధాలుగా మాట్లాడతారేగానీ, వారిలోని దివ్యత్వాన్ని గుర్తించేవారు బహుస్వల్పంగా వుంటారు. వారు శరీరధారులై మన మధ్య తిరుగుతున్నంత సేపూ, వారి నిజతత్వాన్ని మనం గుర్తించలేము. అందుకని, వారు సశరీరులై కొన్నాళ్ళు తమ లీలా వైభవాన్ని చాటి, తిరిగి ఆ శరీరాన్ని ఉపసంహరించుకుంటారు. శరీరంతో వారికి పనిలేదు. మనకోసమే వారు ఆ శరీరాన్ని ధరిస్తారు. శరీరం ఉన్నా, లేకపోయినా వారి లీల మారదు. ఆశ్రయించిన భక్తులకు అది అనుభవైక వేద్యము. అందుకనే శ్రీస్వామి ఎప్పుడూ, "గురుదేవుని సగుణరూపంలో దాగి ఉన్న, సుందర నిర్గుణరూపాన్నీ, తత్వాన్నీ తెలుసుకొని, అనుభవించండి" అని చెప్పేవారు.

ఆ విశ్వంభరుడు స్వస్వరూపాన్ని ధరించాడు అంటే ఆకాశం లాగా విశ్వమంతటా వ్యాపించి వున్నవాడు. అండపిండ బ్రహ్మాండ మంతటా నిండి ఉన్న స్వామిని మనం ఏ విధంగా కొలవగలం? మనకు చేతనయినంత వరకూ అన్ని సేవలలోనూ పాల్గొని మన జన్మలను సార్థకం చేసుకుందాం. అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను, అఖండ సాధనా సంపత్తిని ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# శ్రీ 108 దండి నిర్మలానంద గిరి వారి ఆశీఃపూర్వక సందేశము

జ్ఞాన రత్న గర్భ అయినటువంటి మన భరతావనిలో ఎందరో మరి ఎందరో మహానుభావులు అవతరించి, వారు తరించి, ఇతరులను తరింపజేసినారు. అలాంటి కోవకు చెందిన మహనీయులలో ప్రాతః స్మరణీయులు, జ్ఞానులు, మరియు సిద్ధులు అయినటువంటి మన పూజ్య శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్ వారు ఒకరు. వీరు పవిత్రమైన, శివ క్షేత్రమైన కాకాని, పవిత్రమైన వైష్ణవ క్షేత్రమైన మంగళగిరి, క్షేత్రముల మధ్య, శ్రీ కాళీ వనాశ్రమమును స్థాపించి, సమస్త మానవాళిని జనన మరణరూప సంసార సాగరము నుండి తరింపచేసిరి. వారి తదనంతరము, సర్వ సమర్థులైనటువంటి మన పూజ్య శ్రీశ్రీశ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారిని, శ్రీ కాళీవనాశ్రమాధిపతిగా నిర్ణయించినారు. ఇప్పుడు ఆ ఆశ్రమము శ్రీమాతాజీ వారి కనుసన్నలలో మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఎంతో శోభాయమానంగా, ఆధ్యాత్మిక మరియు సేవాకార్యక్రమములు జరుగుచున్నవి.



ఇప్పుడు శ్రీ బాబూజీ పుణ్యారాధన రజతోత్సవములు, సాధు ధర్మ సమ్మేళనము,యతీశ్వర పూజ, మొదలైన అనేక పవిత్రమైన కార్యక్రమాలను శ్రీ మాతాజీ వారు జరుపుతున్నందులకు చాలా ఆనందదాయకముగా నున్నది. భవిష్యత్తులోకూడ ప్రజాహితమైన, బృహత్తరమైన కార్యక్రమాలను జరుగులాగున శ్రీమాతాజీ వారికి అన్ని విధములైన, శక్తి సామర్థ్యములను, సమస్త దేవతలు, సమస్త ఋషులు. మా దివ్యమైన శ్రీ అష్టలక్ష్మీ అమ్మవారు, ముఖ్యముగా శ్రీబాబూజీ మహరాజ్ వారు అనుగ్రహించి ఆశీర్వదించెదరు గాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

మీ

దండి నిర్మలానంద స్వామి

# అసలైన గురు ఆరాధన

- శ్రీ విద్యాస్వరూపానంద స్వామి
శ్రీశుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు, శ్రీకాళహస్తి

గురురేవ పరంబ్రహ్మ గురురేవ పరంతపః
గురురేవ పరంతత్త్వం తం గురుం ప్రణమామ్యహమ్ ॥

గురువే సమస్తానికి నిమిత్తోపాదాన కారణమైన పరబ్రహ్మము. ఆ గురు తత్త్వాన్ని తెలుసుకోవాలంటే పరదా తొలగాలి. మనోవాక్కాయాలనే త్రికరణాలు శుద్ధమైతే, నిర్మలమైతే గురుతత్త్వానికున్న పరదా తొలగినట్లే!



భగవద్గీతలో చెప్పినట్లు వాక్తపస్సు ద్వారా వాక్కు శుద్ధి అవుతుంది. కాయక తపస్సుచేత కాయం శుద్ధమవుతుంది. మానసిక తపస్సు ద్వారా మనస్సు నిర్మలమవుతుంది. అగ్నిలో పుటం పెట్టిన బంగారం తనకున్న మలినాన్ని వదలి శుద్ధ బంగారమైనట్లు త్రివిధ తపస్సులచే త్రివిధ కరణాలు పవిత్రమవుతవి.

అట్టి పవిత్ర త్రికరణాలతో గురువుపై అతి శ్రద్ధతో, గురువు చెప్పినదానిని శ్రవణం చేసి,మననం చేసి నిదిధ్యాసలో మునిగితే గురుతత్త్వం అవగత మవుతుంది. గురువు పరబ్రహ్మగా అనుభూతమవుతుంది. ఉప్పు సముద్రంలో మునిగి సముద్రంలో కరిగి ఏకమైనట్లు ఉపాధి కల్పిత జీవత్వం పరతత్త్వం పరబ్రహ్మలో మమేకమవుతుంది. అసలున్నదొక్కటే! దానికి అడ్డుగా కల్పించుకొన్న సీమిత అహంతను జ్ఞానాగ్నిలో దగ్ధం చేస్తే మిగిలేది గురు పరతత్త్వమే. ఆ పరతత్త్వాన్ని ఆరాధించడమే గురువుయొక్క ఆరాధన. శ్రీబాబుగారు మీకు గురుమహారాజుగా అడుగడుగునా ఉపదేశించినది, ఆచరించి చూపినది అదే. దానిని అనుష్ఠానంలో పెట్టుకొని అందరూ గురు పరబ్రహ్మలవుదురు గాక!

హరిః ఓం తత్సత్

# ఉత్సవం! మహెూత్సవం! గుర్వారాధనా రజతోత్సవం

–ఆచార్య శంకరానందగిరి స్వాములవారు
అఖిలాంధ్ర సాధుపరిషత్ అధ్యక్షులు,
శ్రీపరమాత్మానందాశ్రమము, పెనమలూరు

వచ్చింది, వచ్చింది ఇదిగో! శ్రీశ్రీశ్రీ సద్గురుదేవుల పుణ్యారాధన రజతోత్సవ మహెూత్సవం! ఇది శ్రీ హనుమత్కాళీవర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారు సిద్ధిపొంది 25 సంవత్సరాలయిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమముల సమాహారోత్సవము. శ్రీబాబూజీవారు పాదుకొలిపి వృద్ధి చేసిన 'కాళీ నందనవనము' నకు తోటమాలియైన పూజ్యశ్రీ యోగిని చంద్రకాళీప్రసాద మాతాజీవారు యీ సుసందర్భాన్ని పురస్కరించుకొని గాయత్రీ మహాయాగము, సాధుధర్మ సమ్మేళనము, యతీశ్వరపూజ మొ॥ అనేక భక్తి, జ్ఞాన వర్ధకములైన చక్కటి కార్యసరళిని రూపకల్పన చేసి,



'ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్యవరాన్నిబోధత' అను ఉపనిషద్వాణిని
'లే మేలుకో! తెలివి తెచ్చుకో, గమ్యం వరకూ దూసుకుపో' అంటూ అచ్చమైన తెలుగు భాషలో అర్థమయ్యేటట్లు విశదపరుస్తూ

"Arise, awake, stop not still the goal is reached"

పాశ్చాత్య భాషలో కూడా ఉత్సాహపరుస్తూ ఆధ్యాత్మిక మార్గగాములైన సాధకులను తరింపజేయు ఉపాయములను పన్నినారు.

సామాన్యులకు యిది చాలా విచిత్రంగా అనిపించవచ్చు. ఎవరైనా బంధువులు చనిపోతే బాధపడతారు సహజంగా. ఆత్మీయులు దూరమైనారని గగ్గోలుపెడతారు. వారు తమకు చేసిన సహాయమును, పంచిన ఆత్మీయతను తలచి, దుఃఖపడతారు. వారి తిథిరోజున వారు తమతో లేరని చింతిస్తూ వారిని గురించి వాపోతూ ఉంటారు. మరి మీరు మీకు అత్యంత ఆత్మీయులు, ఆప్తులైన గురుదేవులు దూరమైతే 25సంవత్సరాలు అయిందని, ఆనందంగా, పరమానందంగా, మహెూత్సవాలు

జరుపుకుంటున్నారు. మీకు వారితో అంత అనుబంధం, అనురాగము లేవేమో అని అనుకోవచ్చు. కాని యిక్కడ ఉన్న భేదాన్ని విజ్ఞులైనవారు కొంచెం లోతుగా విచారించి, గమనించాలి.

సామాన్యమానవులు కనుక వారి బంధువులు, చనిపోయినవారు తమని విడిచివెళ్ళిపోయారని వారిని గురించి దుఃఖిస్తూ బాధపడుతూ ఉంటారు. కాని సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపులైన శ్రీ సద్గురుదేవులు సిద్ధి పొంది పరిపూర్ణులై సర్వత్రా వ్యాపించియున్న పరబ్రహ్మమునందు లీనులైనారు. కనుక శిష్యులు తమ లోపల వెలుపల 'వ్యోమవద్వ్యాప్త దేహాయ గురుదేవాయ నమః' అంటూ సబాహ్యాభ్యంతర స్థితుడైన గురుదేవునికి కృతజ్ఞతా పూర్వక మైన అభివాదములు తెలియజేసుకుంటూ ఆ ఆనందంలో ఉత్సవాలు చేసుకుంటూ అందరికీ ఆ జ్ఞాన ప్రకాశాన్ని అందజేసేందుకు ఆ ఆనందాన్ని పంచేందుకు ప్రయత్నిస్తూ ఉంటారు.

అంతేకాక సామాన్య మానవుల జ్ఞాపకములను కాలం పరిణామం చెందుతూ తద్వారా ఆయన శారీరక గాయాలను మాన్పి మాన్పుతుంది. ఒకవేళ ఆ యా వ్యక్తులతో నున్న గాఢతమమైన అనుబంధము వలన వారి జ్ఞాపకములను జీవించి ఉన్నంత కాలమూ స్థిరంగా ఉంచుకొన్ననూ, శరీర పతనానంతరమైననూ యీ శరీరంతో వచ్చిన సంబంధ బాంధవ్యాలు తెగిపోతాయి.

'కర్మానుగో గచ్ఛతి జీవఏకః' తమ తమ కర్మానుసారంగా జీవులు ఎవరిదారినవారు వెళ్ళిపోవలసిందే. ఒకరి వెంట ఒకరు వచ్చిపోయే అవకాశం వుండదు.

మరి గురుశిష్యుల సంబంధం అటువంటిదికాదు. 'శిష్యస్తే౽హం' అన్నవానిని శిష్యునిగా గ్రహించిన గురువు ఆ శిష్యుడు ఉద్ధరింపబడి, తనతో తాదాత్మ్యం చెంది, తన స్వరూపం మారేంతవరకు అతను వెళ్ళినచోటికల్లా వెళ్ళిన లోకాలన్నిటికీ కూడా వెంటనంటి వెళ్ళిఅతని ఊర్ధ్వగామినిగా చేస్తూ ఉంటారు. నిజమైన శిష్యుడు సద్గురువును మరచిపోదామన్నా మరచిపోలేడు. ఎందుకంటే సద్గురువు ద్వారా పొందిన ఉపకారం అంత గొప్పది కనుక. జ్ఞాపకం చేసుకుందామన్నా చేసుకోలేము. ఎందుకంటే ఎప్పుడూ సర్వకాల సర్వావస్థలయందూ గురుస్మరణే కనుక. సహజంగా మరచిపోయిన దానినే కదా మనం జ్ఞాపకం చేసుకునేది. అందువలన గురువులను మరచుట, జ్ఞాపకం

చేసుకొనుట అను రెండు క్రియలు లేక నిరంతరం వారిని ఆత్మ స్వరూపంగా దర్శిస్తూ మౌక్తికోత్సవాలు, రజతోత్సవాలు, వజ్రోత్సవాలు, స్వర్ణోత్సవాలు, శతజయంతోత్సవాలు యిలా యిలా శిష్యపరంపర జరుపుకుంటూ పోతూనే ఉంటుంది. ఎన్ని వసంతాలు జరిగిపోయినా, ప్రతి సంవత్సరం నిత్యనూతనమైన ఉత్సాహంతో శిష్యులు గురు కార్యక్రమంలో నిమగ్నులయ్యే ఉంటారు. అందువల్లనే మాతాజీ చక్కగా శ్రావ్యంగా........

"గురువెంతో మంచివారు గురుతులెన్నో తెలిపినారు
ఎన్నెన్నో తెలిపినారు ఎవ్వరికీ సాటిరారు
మరచినను మరపురారు మహానుభావులేను" అంటూ పాడుతూ ఉంటారు.

ఏ ఆధ్యాత్మిక కార్యక్రమాలైననూ భక్తులను అజ్ఞాన నిద్ర నుండి మేల్కొలిపి, జ్ఞానమార్గంవైపు మళ్ళించి వారి జీవితాలను భగవదర్పణంగా, గుర్వర్పణగా చేసుకొని, చరితార్థతనొందించుకొను శక్తిని ప్రసాదించు ప్రయత్నాలే.

అదే విధంగా యీ దివ్యమైన, భవ్యమైన, పుణ్యప్రదమైన తిథులలో అసత్యము, అనిత్యమైన దేహాన్ని, ప్రపంచాన్ని వదలి సత్యస్వరూపులుగా నిలిచిన గురుదేవుల సాధనా సంపదలను వారి ఔన్నత్యాన్ని వెల్లడి జేయటానికి తద్వారా వారిని మార్గదర్శకంగా తీసుకొని సాధకులు ఉద్ధరింప బడటానికి చేసే మహత్ ప్రయత్నమే యీ మహోత్సవ సంరంభం.

సద్గురువులు శాస్త్ర నిగదితమైనట్లు –
సుందరః సముఖః స్వచ్ఛః సులభో బహుతంత్రవిత్ ।
అసంశయః సంశయ ఛిన్నరపేక్షో గురుర్మతః ॥

సుందర స్వరూపులై ఉంటారు. ఈ సౌందర్యం శరీరమునకు సంబంధించినది కావచ్చు, కాకపోవచ్చు.సద్గురువుల చెంత చేరగానే ఆధ్యాత్మిక సాధకులకు ఇతః పూర్వంలేని ప్రశాంతత, ఆహ్లాదం కలుగుతాయి. అదే వారి ఆత్మ సౌందర్యం.

అంతేకాక శత్రు మిత్రులనే భేదం లేక వారు తమను ఆశ్రయించిన వారి యెడల సముఖులై, ప్రసన్నులై ఉంటారు. ఏ కోపతాములు, ఈర్ష్య, అసూయలు లేని స్వచ్ఛమైన అంతఃకరణ కలిగి ఉంటారు. తనను కోరి వచ్చిన భక్తుల ఆర్థిక, ఆధ్యాత్మిక భేదభావములను చూడక చిన్న పిల్లలవలె అందరికి సులభంగా దరిజేరటానికి

అనుకూలురుగా ఉంటారు. అలాగని పసిపిల్లల వలె ఏమీ తెలియని అమాయకులని తలచరాదు. సర్వ తంత్ర, మంత్ర, యంత్ర కోవిదులై సర్వ లౌకిక, పారలౌకిక విజ్ఞాన విశారదులై ఉంటారు.

తాము ఏ విషయమందును సంశయము లేనివారై యితరుల సంశయములను పోగొట్టగల సామర్థ్యం కూడా కలిగి ఉంటారు. ఇంకా వారిలో ఉంటే విశేషణాలేమిటో ఎవరు సద్గురువులని శాస్త్రం చెప్పినదో పరిశీలిద్దాం......

"నైరపేక్ష మవిత్తేచ్ఛా గురుత్వం స్థితవేదితా ।

ఏవం విధో గురర్జ్ఞేయత్స్వితరః శిష్య దుఃఖదః ॥

ఏ కోరికలు ఆశలూ లేనివారు, ధనాకాంక్ష లేనివారు, అందరికి ఆదర్శంగా గల ప్రవర్తన గలవారు, స్థిరమైన ప్రజ్ఞకలవారు, గర్వం లేనివారు, నిత్య సంతుష్టులు, ఎదురుపడినవారిని నవ్వుతూ ముందుగా పలుకరించేవారు, సత్యపూరితమైన వాక్కుగలవారు మాత్రమే సద్గురువులు. వీరే శిష్యుల ఆర్తిని పోగొట్టి ఉద్ధరించగల సామర్థ్యం గలవారు. తదితరులు శిష్యులకు ముందుగనే ఉన్న ఆధ్యాత్మిక, ఆదిభౌతిక తాపములను పెంచి దుఃఖమును వృద్ధిచేయువారే అవుతారు.

కఠోపనిషత్ వివరించినట్లు.............

శ్రవణాయాపి బహుభిర్యో న లభ్యః

శృణ్వంతోఽపి బహవో యం న విద్యుః

ఆశ్చర్యో వక్తా కుశలోఽస్య లబ్ధాఽఽ

శ్చర్యో జ్ఞాతా కుశలానుశిష్టః॥

సద్గురువులు బోధించు దివ్యతత్వాన్ని వినేవారు రత్నాల షాపులోని జనులవలె చాల తక్కువమంది ఉంటారు. రత్నాల వజ్రాల షాపుకు వచ్చినవారందరూ కూడ వాటిని కొనలేనట్లు, గురుబోధను విన్నప్పటికీ అందరూ అవగాహన చేసుకోలేరు. అనుభూతిని పొందలేరు. శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠులు, శిష్యుల సంసేవలన్నిటినీ ఛిన్నాభిన్నంగా చేయగల శక్తికలిగిన గురువు దొరుకుట, మేధావియై ఊహాపోహ విచక్షణ కలిగి, గురువు చెప్పిన విషయం అర్థం చేసుకుని, ఆచరణలో ఉంచుకొని, ఆనందం పొందగలిగిన శిష్యుడు దొరకటం దుర్లభమే. ఇద్దరి సమ్మేళనము భగవదనుగ్రహం

వలనే సాధ్యం.

తుప్పుపట్టని ఇనుమే అయస్కాంత ఆకర్షణకులోనై, వెంటనే ఆ అయస్కాంతమును చేరి దానితో విడదీయరాని సంబంధాన్ని ఏర్పరచు కుంటుంది. అది జడమైనది కనుక తన తుప్పును తాను వదిలించుకోలేదు. కాని జన్మతః వచ్చిన కొన్ని అవలక్షణాలు గురుతత్త్వాన్ని అవగాహన చేసుకో నీయక అడ్డుపడుతున్నప్పటికీ శిష్యుడు గురు అనుగ్రహంతో, దైవకృపతో తన స్వప్రయత్నంతో వాటిని తొలగించుకుని, జ్ఞానబోధామృతమును గ్రోలి తరించ వచ్చు.

శిష్యునికి ఉండవలసిన లక్షణాలు పెద్దలీవిధంగా వర్ణిస్తున్నారు...

చతుర్భిరార్జ్యైః సహితః శ్రద్ధావాన్ సుస్థిరాశయః।

అలుబ్ధః స్థిరగాత్రశ్చ ప్రేక్ష్యకారి జితేంద్రియః॥

ఆస్తికో దృఢభక్తిశ్చ గురౌ మంత్రే సదైవతే।

ఏవం విధో భవేచ్ఛిష్య ఇతరో దుఃఖకృద్గురోః॥

సుందరతా, సుముఖతా, స్వచ్ఛతా మరియు దంబ దర్పాది మానములు, సద్గురువును శరణాగతి పొందగల ఋజువర్తనమును కలిగి ఉండవలెను. మోక్షము పొందాలనే స్థిరమైన ఆశయము కలిగి, అత్యంత శ్రద్ధ, విశ్వాసము, తన ఆశయమును నెరవేర్చుకొనుటకు  కలిగి ఉండవలెను. లోభికానివాడు. సాధనకు అనుకూలమైన శారీరక దార్ఢ్యము కలిగిన వాడు, యిష్టంగా అత్యుత్సాహముతో గురుకార్యము నెరవేర్చు స్వభావము కలిగినవాడు, బాహ్య అంతరేంద్రియములు తన అదుపులో వుంచుకున్నవాడు, తన అనుభవవంతో లేకపోయినా, శాస్త్ర గురువాక్యములను అంగీకరించు ఆస్తికత్వము, గురువు నందు వారి ద్వారా ఉపదేశింపబడిన మంత్రమునందు, ఆ మంత్రాధిష్ఠాన దైవమునందు దృఢమైన, సుస్థిరమైన, అచంచలమైన భక్తి, అనగా యిష్టము, కలవాడే సచ్ఛిష్యుడు.

ఇటువంటి సల్లక్షణములు కలవాడు గురువును ఆశ్రయించి, గురువుకు కీర్తి ప్రతిష్ఠలు కలిగించి తాము ఉద్ధరింపబడతారు. శిష్య లక్షణాలు పూర్తిగా కలిగిన జన్మయే మోక్షప్రాప్తికి అర్హత కలిగిన జన్మని మహాత్ములు వెల్లడించారు. ఈ సల్లక్షణాలు లేని శిష్యుడు 'తా చెడ్డ కోతి వనమెల్ల చెరచింది' అన్నట్లు, 'చీడపురుగు చేరి చెట్టుచెరుచునన్నట్లు'

ఆధ్యాత్మిక మార్గాన్ని కలుషితం చేసి, గురువుల పేరుప్రఖ్యాతులను చెడగొట్టి తాను భ్రష్టుడౌతాడు.

కొద్దో గొప్పో సుకృతం చేసుకుని పుణ్యాత్ములైనవారికి దైవభక్తి కలుగుతుంది కాని, గొప్పదైన పుణ్యముంటేగాని, గురువు, గురుసేవ లభించదు. ఎందుకంటే దైవభక్తితో మన అహంకారాన్ని, వ్యక్తి పరమైన యిష్టానిష్టాలను ఉంచుకోవచ్చు. గురుసేవ యందు మాత్రము అహంకార మమకారములు, ఈషణత్రయంలేని శుద్ధ సాత్విక శ్రద్ధ కలిగితేనే ఫలితం లభిస్తుంది. అట్టివారికే నిజమైన ఆధ్యాత్మిక పురోగతి సాధ్యమవుతుంది.

పరమపదసోపాన పదంలో చిన్నచిన్న పాములతోపాటు, పెద్దపాములు కూడా ఉన్నట్లు, చిన్నా పెద్దా నిచ్చెనలు కూడా ఉంటాయి. నిచ్చెనలు ఎక్కి త్వర త్వరగా ప్రయాణం సాగించవచ్చు, లేకపోవచ్చు కాని పాములవంటి అవరోధాలు పొంచి ఉంటాయి. గురు దైవముల యందు గల అవ్యభిచారమైన భక్తి విశ్వాసములతో వాటినన్నిటినీ తొలగించుకుని, సాధకుడు గమ్యం చేరవచ్చు.

పూజ్యశ్రీ యోగిని చంద్రకాళీప్రసాద మాతాజీ వారిచే ఏర్పాటు చేయబడిన రజతోత్సవ ఆధ్యాత్మిక గుర్వారాధన కార్యక్రమములో అతి ఉత్సాహంగా పాల్గొనే వారందరకూ గురు దైవములు నిండు అనుగ్రహము కలిగి భౌతిక, ఆధ్యాత్మిక అవరోధాలన్ని తొలగించుకుని, ఆత్మానందాన్ని పొందగల శక్తి యుక్తులను సమకూరవలెనని ఆకాంక్షిస్తూ.......

మనసు పాదరసంలా పరుగెత్తే స్వభావం కలది. పాదరసంక్రిందపడితే వేగంగా దొర్లిపోతుంది. దానిని ఒకచోట చేర్చాలంటే ఒక గుంటతీసి, దాని లోనికి చేర్చి, తులసీరసం వేస్తే అది ఘనీభవిస్తుంది. అలాగే పాదరసం లాంటి యీ మనసుని బుజ్జగించి, నెమ్మది, నెమ్మదిగా అంతర్ముఖం చేయ గలిగితే ఆత్మానందం లభిస్తుంది.

– కాళీబాబు

# యోగి యోగిం మెచ్చు

- శ్రీబ్రహ్మానంద తీర్థ స్వామి

శ్రీసత్యానందాశ్రమ వరిష్ఠ పీఠాధీశ్వరులు, ఇనమడుగు

(శ్రీ బ్రహ్మానందతీర్థ స్వామివారు ఆశ్రమానికి విచ్చేసి ఉన్నారు. ఆశ్రమంపై వారి అభిప్రాయాన్ని వారి మాటల్లో........ ఎడిటర్)

ఆధ్యాత్మిక ప్రచారంలో ఇదియొక చారిత్రాత్మక కార్యము. కనుమరుగు అవుతున్న ధార్మిక జీవనము సమాజములో వైదిక అనుష్ఠానమును ప్రజల నిత్య జీవన స్రవంతిలో ప్రకాశము జేయుటకు పరమాత్మ తన్ను తాను పుట్టించు కుంటున్నానని గీతలో ప్రతిజ్ఞ జేసినాడు గదా!

ఆత్మీయ జిజ్ఞాసువులారా!



సనాతన ధర్మము,సనాతనము, శాశ్వతము. నీతి అక్కడక్కడ కాలానుగుణముగ మార్పులు చెందుచుండును కాని ధర్మము మారదు. ధర్మము సార్వకాలికము, సార్వజనీనము. సద్గురువును సేవించని సాధకులు, ప్రజల భాషణములు, ప్రామాణికములు కావు. పరమాత్మ అనుగ్రహము పొందవలయునినిన గురుసాన్నిధ్యము, సద్గురు సేవ, శ్రవణము ముఖ్యము. దీనినే "శ్రద్ధ"యని పిలతురు. "శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్" అని దివ్యసూక్తి.

శ్రీహనుమత్ కాళీ వర ప్రసాద్ బాబూజీ వారు విశిష్టమైన శక్తి (సిద్ధి) గల మహాపురుషుడు. శ్రీవారు అతిగూఢ వర్తనులు. జనులకు వేదితులు కాకుండా యెంతో కాలము సంచరించినారు. "దేవతార్చన సంపుటి" వెంట తీసికొనెడివారు. సదనుష్ఠానము, ఏకాంతవాసము,నియమపాలనము, మితభాషణము వారి ప్రత్యేకత. శ్రీబాబూజీ సశరీరులై యుండినపుడు కూడ వారి దివ్యావిభూతిని గూర్చి విని ఆనందించెడివాడను. ఒక్కమాట! నేను సద్గురు భగవాన్ శ్రీ సత్యానంద మహరాజ్ వారి అంతేవాసినిగా సద్గురు విభూతిని అనుభవించుచున్నాను." ఆత్మజ్ఞానియే యదార్థమైన కర్మయోగి" అని పెద్దల నానుడి, శాస్త్ర వాక్యమున్నూ.

ఆర్య మహాశయులారా!

ప్రస్తుత పీఠాధి పతులు శ్రీశ్రీశ్రీ యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారిని తెలంగాణాలో గోదావరీ తీర ఆశ్రమ కార్యక్రమములో దర్శించుట జరిగినది. కొన్ని మాటలు అడిగితిని. అదియు, శ్రీభగవద్గీతామృత తరంగిణి గ్రంథ ప్రచారములో. పిమ్మట కారంచేడు సమాజములో సభావేదికపై. పిమ్మట భీమవరంలో మహత్కార్య సభలలో, యింకను తుని మహానగరములో వారిని కలసితిని. మరియు శ్రీకాళీ గార్డెన్సులో సప్తాహముగ  శ్రీమద్భాగవత ప్రసంగములు జరిగినవి. ఆ కాలములో శ్రీమాతాజీవారితో, అచ్చటి సుశిక్షిత భక్తులతో,  ఇతర భక్తులతో మాటలా డితిని. సమాధి హాలు (బృందావనం), గోరక్షణ, వృద్ధాశ్రమము – మొత్తము ఆ ఆదర్శ గ్రామమును దర్శించితిని, ఆనందించితిని. విశేషమేమన, నాలుగు తరములవారు– ముత్తాత, తండ్రి, మనుమలు అందరూ గురుభక్తి పరాయణులు. అచట "అసూయ" అను రోగము కనపడదు., వినపడదు. ఆహా! ఏమి దివ్యస్థితి!! అట్టిది ఆ గ్రామం! ఎవరి గృహములు, ఎవరి జీవన విధానము వారిదే. సాధనయే వారి పరమావధి.

నవవిధ భక్తులు అచట దర్శనమిచ్చును. అచట దేవాలయములు, వివిధ రంగుల పూల మాలలు కట్టువారు పది పదిహేనుమంది– ఆహా! ఎవరూ ఎవరితో మాటలాడరు. సత్సంగమునకు పరుగులు తీస్తారు. హాలులో నిశ్శబ్దం! భక్తులు పలు వాద్యములతో, మాతాజీ భజన సంకీర్తనలతో కంఠము కలిపి తన్మయతతో పాడుతారు. అది ఎన్నాళ్ళ అభ్యాసమో! శక్తి విజృంభణమే!!

ఇంతటి సంస్థను జూడలేదు, వినలేదు.  ఈ నాలుగు మాటలు నా అనుభూతిని వ్రాసే భాగ్యమును శ్రీ కాళీ ప్రసాద్ బాబూజీవారు ప్రసాదించినారు. ఈ సంస్థనుండి " సమర్థ సద్గురు" అను మాస పత్రిక ప్రచురింపబడుతూ ఉంది. ఇంకను విద్యాలయము, వైద్యాలయము కలవు. పారిశుద్ధ్యము, నీటి సరఫరా, విద్యుత్తు అన్నీ సంస్థ వారి కృషియే. గుంటూరు శ్రీ రామనామ క్షేత్రములో మహాసభ దివ్యం. మాతాజీ వారి పర్యవేక్షణలో పూజలు, యజ్ఞములు, వివాహములు, అర్చనలు లక్షలాది భక్తులకు మహా ప్రసాదము!! ఎంతని వ్రాయనూ, మాటలకందని  అనుభూతి! సనాతన ధర్మానికి జై జై!

ఓం శాంతిః శాంతిః శాంతిః

# కలియుగంలో ద్వాపరయుగం
# బృందావనంలో గోపికాబృందం రంజిల్లుతున్న రజతోత్సవం!

– శ్రీ మాతా ప్రతిభానందగిరి
శ్రీభూమానందాశ్రమాధిపతులు, గండిక్షేత్రం

మానవజన్మకు మహద్భాగ్యం సద్గురు లభించటము, లభించిన సద్గురు వద్ద జ్ఞాన బోధ పొంది జన్మరాహిత్య స్థితి అందుకోవటము. బాధలు పోగొట్టే బోధ గురువులకు ఎన్ని విధాల ఉత్సవాలు జరుపుకొన్నా తనివి తీరవు.

మౌక్తి కోత్సవము అని 12 సం॥రాలకు రజతోత్సవమని 25 సం॥రాలకు స్వర్ణోత్సవమని 50 సం॥లకు జరుపుకొనుట శిష్యుల యొక్క భక్తుల యొక్క ఆనందం వెదజల్లటమే. శ్రీకాళీ వనాశ్రమము స్థాపించిన శ్రీ కాళీవర ప్రసాద బాబూజీ వారు ఒక విశిష్ఠ తత్వ స్వరూపులు. జ్ఞానబోధ చేయుటలో భక్తుల పాలిట కల్పతరువు అని చెప్పుకొనుటలో అతిశయోక్తి లేదు. శ్రీ కాళీవనాశ్రమం ఆశ్రయించిన వారంతా ఆనాడు ద్వాపరయుగంలో బృందావనంలో గోపికలు పొందిన మధురత్వమే పొందుచున్నారు. ఈ మధ్య శ్రీకృష్ణ జన్మాష్టమి స్వర్ణోత్సవాలకు నంబూరు వెళ్లినప్పుడు నేను పొందిన అనుభూతి పైన వ్రాసిన శీర్షిక పేరే. కలియుగంలో ద్వాపరయుగంలాగా బృందావనంలో గోపికాబృందంలో లాగా తీర్చిదిద్దిన అఖండతత్త్వ బోధా తత్పరులు శ్రీ బాబూజీ వారు.



భగవంతుడు అవసరాన్ని బట్టి దశావతారులుగా, 24 అవతారాలుగా అవతరించి, మరొక అవకాశము శ్రీ సద్గురువులుగా అవతరించి, ఎందరినో తరింపజేశారు.

ఒకడు బావిలో మునిగిపోతున్నాడు అది చూచి దయావంతుడగు సమర్థుడైన బాటసారి ఒకడు వానిని బైట వేసే కోసం గభాలుమంటూ బావిలోనికి దుమికినాడు. పై పైకి చూసేందుకు ఇవ్వురు ఒకే వొస్తరుగా బావిలో మునుగుతూ తేల్తున్నారనుకుంటాం. కాని ఆ ఇద్దరి పరిస్థితులు కంటికి మంటికి వున్నంత వ్యత్యాసం.

ఒకడు మునిగిపోయేవాడు. మరొక్కడు మునిగిపోయేవాణ్ణి బయటకు వేసేవాడు. "తీర్ణాస్స్వయం భీమభవార్ణవం – అన్యానపితారయంత" అని శ్రీశంకరుల వారునుడివినది అట్టి వారినుద్దేశించే సామాన్య మానవులకు అవతారపురుషులకు ఇంత వ్యత్యాసం వుంది.

అలాంటి అవతార ఘట్టాలలో శ్రీ బాబూజీ వారు ఒక అవతారమే. కొందరు ఎక్కడ జన్మించారో కూడా తెలియకుండా ముముక్షువులను తరింపజేస్తారు. అలాగే శ్రీ బాబూజీ శ్రీ షిర్డీ బాబా వారివలె జననం ఎక్కడో తెలియదు కానీ తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాలలో భక్తులను జ్ఞానగంగలో ముంచి తరింపజేశారు. బైటగంగకు హద్దులున్నాయేమోగాని, జ్ఞాన గంగకు హద్దులు లేవు.

జిల్లాల నుండి రాష్ట్రాలకు, రాష్ట్రాల నుండి దేశదేశాలకు చివరికి ప్రపంచమంతా వ్యాపిస్తుంది. వ్యాపకం చేయుటకు ఒక నిమిత్తం వారే ఏర్పరచి కనుమరుగు అవుతారు. ఆ విధంగా శ్రీ మాతృమూర్తి మన పూజ్య శ్రీమాతా చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారిని సృష్టించి ఆ బాధ్యత అప్పగించి వ్యాపకం చేస్తూనే వున్నారు. శ్రీ బాబూజీ వారి ఆరాధాన చేస్తూనే వున్నారు. 25 సం॥లుగా అందరికీ అందిస్తూ ఆరాధన చేస్తూనే వున్నారు. 25 సం॥రాల తత్త్వాన్ని ఒకే మహోత్సవం రజతోత్సవంగా చెప్పుకొని అందరిని ఒక సత్వగుణ ప్రధానంగా చేస్తున్నారు. రజతం అంటే వెండి, వెండి తెలుపు వర్ణం కదా!

తెలుపు సత్వగుణానికి ప్రతీకం కాబట్టి జ్ఞానబోధ లోపల నిలవాలంటే సత్వగుణం ప్రధానంగా వుండాలి. సింహం పాలు పట్టాలంటే బంగారు పాత్రే కావాలట లేనిచో చిల్లు పడిపోతుందట. కావున సత్వగుణంప్రధానంగా లేనిచో జ్ఞాన బోధ నిలబడదు. అహంకారమనే చిల్లు పడి కారిపోతుంది. అంటే నిరుపయోగమవుతుంది.

శ్రీ కాళీవనాశ్రమంలో బృందావనం గోపికలు సత్వగుణ ప్రధానులే. ఆ సత్వగుణం అందరికి అక్కడక్కడ వున్న భక్తులందరికి అందించే దానికి ఈ రజతోత్సవారాధన కార్యక్రమం మన అమ్మ అందరికి అవకాశమిచ్చారు. ఆరాధనలో రాధ వుంది. మొదటి ఆ చివరిన మధ్యలో రాధ, రాధ హృదయం నా పాదం అన్నాడు శ్రీకృష్ణుడు. జీవుడు దేవుడు వేరు కాదు, ప్రపంచం తట్టు చూస్తే జీవుడు, పరమాత్మ తట్టు చూస్తే దేవుడు. రాధ దృష్టి సర్వకాల సర్వావస్థలు దైవదృష్టే. అందుకే రాధాకృష్ణులు

ఒక్కటే. ద్వితీయం అద్వితీయం అనేవారు సద్గురు దేవులు. ద్వితీయంగా కనిపించినా ఒక్కటే అని అర్థం.

అలాగే గురుశిష్య సంబంధం కూడా. ఆరాధన భావం కూడా అదే. ఆరాధాన చేయగా చేయగా ఆరాధ్య దైవమూ "నీవే" అనే తత్వంలో వుండు స్థితి శ్రీ సద్గురు ఆరాధన. శ్రీ కాళీవనాశ్రమంలో వుండే బృందావనం, బృందావనవాసులు అట్టి ఆరాధ్యదేవతలు.

రజతోత్సవమనే వృక్షంలో సత్వమనే ఫలాలు ఆరగించుటకు సిద్ధమై జ్ఞానమృతం గ్రోలి జీవన్ముక్త స్థితిని పొంది తరింతురు గాక ! అట్టి శక్తిని, భక్తిని, వైరాగ్య స్థితిని ఆ సద్గురు దేవులు అనుగ్రహింతురు గాక!

ఓం తత్సత్

నిర్మలమైన, నిశ్చలమైన గురుభక్తి మిమ్మల్ని తరింపజేస్తుంది. గురుకృపచే తరించినవారి గాథలు మనకెన్నో ఉన్నాయి. ఉదాహరణకు పద్మపాదులవారు, తోటకాచార్యులవారు, స్వామి వివేకానంద మొదలగువారు.

ఆవలి ఒడ్డున నుండి తన గురువైన శంకరాచార్యులవారు పిలవగానే, "సనందుడు" గురునామం మిగుల భక్తితో స్మరిస్తూ నీటిపై నడుస్తూ వచ్చాడు. ఆ అద్భుత భక్తిని గాంచిన గంగాదేవి పులకితయై ఆ శిష్యుడు పాదములు మోపిన ప్రతిచోట తామరపువ్వులు మొలిపించింది. ఆనాటి నుండి ఆయన "పద్మపాదుడు" అని పిలువబడ్డాడు.

గురుకృపచే మందబుద్ధియైన తోటకాచార్యులవారికి గురువుగారి బట్టలు ఉతుకుతుండగా సమస్త విద్యలూ తళుక్కున స్ఫురించాయి. వెంటనే గురువుని స్తుతిస్తూ తోటకావృత్తాలలో గానం చేసినందున ఆయనకి తోటకాచార్యులని పేరు వచ్చింది.

# మానవ జన్మ సార్థకత

-మాతా త్యాగీశానందపురి,

శ్రీరామకృష్ణ భక్తసమాజము, బాపట్ల

జీవత్వం, పశుత్వం, రాక్షసత్వం, మానవత్వం, దైవత్వం, బ్రహ్మత్వం అనేవి ఆరు అవస్థలు.'ప్రాణానాం ధరాణా జ్జీవః అనుచందము ప్రాణధారణమే జీవత్వం. త్రిగుణములలో కేవలం తమోగుణం పశుత్వం. కేవల రజోగుణం రాక్షసత్వం. కేవల సత్వగుణం దైవత్వం. త్రిగుణముల సమ్మేళనం మానవత్వం. త్రిగుణాతీతం బ్రహ్మత్వం.



వ్యష్టి మానవత్వం, సమిష్టి జీవత్వంలోని ఏకత్వాన్ని అనుభవించి ఆనందించటవే బ్రహ్మత్వం. మానవుడు యీ సాధన చేసినచో మోక్ష సామ్రాజ్య అధిపతి కాగలడు. జన్మరాహిత్యం పొందగలడు. ప్రపంచానికి సర్వధర్మమూర్తిగా ప్రకాశించగలడు. ప్రతిబింబమైన జీవుడు, దానవత్వాన్ని వదలి, మానవత్వాన్ని పొంది, సగుణ సాకార సాధనలతో దైవత్వాన్ని కరతలామలకం చేసుకుని, బింబమైన, నిత్యమైన, అద్వితీయమైన బ్రహ్మస్వరూపమగుటయే మానవ జన్మ గమ్యము. మానవ జన్మ పురోగమనానికి అనగా బ్రహ్మజ్ఞాన సముపార్జనకు కారణం కావాలి. కాని, తిరోగమనానికి అనగా మరల పశు, రాక్షస జన్మలకు కారణం కాకూడదు.

84లక్షల జీవులని మన భారతీయ ఋషివర్యుల ప్రబోధం. అందులో మరల చతుర్విధ జీవరాసులని విభజన చేశారు. అవియే ఉద్భిజ్జ, అండజ, స్వేదజ, జరాయుజములు. చివరిది మనిషి జన్మ. భూమిని చీల్చుకుని పుట్టేది ఉద్భిజములు, గుడ్డు నుంచి వచ్చేవి అండజములు, చమట నుండి వచ్చేవి స్వేదజములు, మావి నుండి పుట్టేవి జరాయుజములు. ఈ జంతువులలో 'జంతూనాం నరజన్మ దుర్లభం'. అని శ్రీశంకరవాణి. అతి దుర్లభమైన మానవ జన్మ రావాలి. ఈ మానవత్వమే బ్రహ్మత్వాన్ని సిద్ధింపజేస్తుంది. ఎప్పుడు?

పశుత్వం నుండి మానవత్వం జనించాలి. దయా దాక్షిణ్యాది గుణములతో వర్ధిల్లాలి. తమో రజో గుణముల నుండి దూరం కావాలి. సత్వ గుణంతో నిండిపోవాలి. భగవంతుని విశ్వసించాలి. ఆ దివ్యమూర్తిని దర్శించాలనే తపన ఉద్భవించాలి. ఆ తపనయే ముముక్షత్వమని మహాత్ముల సందేశం. అందుచేతనే బహూనాం జన్మనామంతే నృణాం మోక్షేచ్ఛాజాయంతే" అనేక జన్మల తరువాత మానవుడికి మోక్షం పొందాలనే కాంక్ష కలుగుతుందని పైంగతోపనిషద్వాక్యం. ముముక్షత్వానికి ముందు వివేకం, అనగా నిత్యానిత్య విచక్షణా జ్ఞానం రావాలి. "బహూనాం జన్మనామంతే వివేకీ జాయతే పుమాన్" – అనేక జన్మల తరువాత పురుషుడు వివేకిగా పుడతాడని శాస్త్ర వచనం. అప్పుడైనా వెంటనే ముక్తి లభ్యమా? "ముక్త్యైర్నో శతకోటి జన్మసుకృతైః పుణై ర్వినా లభ్యతే" – నూరుకోట్ల జన్మల యందు చేయబడిన సుకృత లభ్యమగు పుణ్యము లేనిచో ముక్తి అలభ్యమని వివేక చూడామణి గ్రంధములో శ్రీజగద్గురు ఆదిశంకరుల పవిత్రవాణి. అనేక జన్మలలో అనేకపుణ్యకార్యక్రమములు కావించినప్పుడు "బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్మాం ప్రపద్యన్తే" – బహుజన్మల చివరకు జ్ఞాని నన్ను పొందగలడని శ్రీమద్భగవద్గీతలో స్థితప్రజ్ఞుడైన శ్రీకృష్ణపరమాత్మ అనుగ్రహభాషణం. అనగా అనేక అచర జన్మల నుండి చర జన్మలకు రావాలని అర్థం.

ప్రపంచమే మానవుడికి ముక్తిని బోధిస్తుంది. ఆ ప్రబోధాన్ని మానవుడు అందుకోలేడు. లత ఒక వృక్షాన్ని పట్టుకుని అల్లుకున్నట్లు మానవుడు కూడా భగంతుని అల్లుకుపోవాలి. పర్వతం నిశ్చలంగా ఉన్నట్లు ధ్యానంలో నిశ్చలంగా ఉండాలి. వృక్షం పైకి పెరుగుతున్నట్లు జ్ఞానంలో పైకి ఎదగాలి. నిష్కామ కర్మను పశువు నుండి నేర్చుకోవాలి. నది తన గమ్యాన్ని సాగరం చేరుటకు ప్రయత్నం చేసినట్లు మానవుడు తన గమ్యమైన బ్రహ్మానందోదధి వైపు పరుగులు తీయాలి. ఆకాశంలో ఎత్తుగా ఎగురుతున్న పక్షివలె అత్యున్నత ఆధ్యాత్మిక ఆనంద మగ్నుడై, విశాలాధ్యాత్మిక అనుభవ గగన విహారం చేయాలి.

ప్రచండ సాధన చేసి సూర్యునివలె ప్రకాశించాలి. అనుభవంలో శీతల కిరణుడైన సుధాకరునివలె వెలుగును అందించాలి. వీటన్నిటిని సాధించాలంటే సద్గురువును ఆశ్రయించాలి. ఈ సద్గురు సమాశ్రయత్వం అందరికీ లభిస్తుందా?

లభించదు అంటుంది వివేక చూడామణి.

"దుర్లభం త్రైమేవతత్ దైవానుగ్రహ హేతుకమ్ మనుష్యత్వం ముముక్షత్వం మహాపురుష సంశ్రయః" – మనుష్యత్వము, ముముక్షత్వము, మహాపురుష సంశ్రయము మూడునూ భగవదనుగ్రహం లేకపోతే దుర్లభమని శ్లోక తాత్పర్యం.

మానవునికి ప్రధానమైనది మనసు. "మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" – మానవుని మనస్సే బంధ మోక్షాలకు కారణమని ఉపనిషత్ ప్రబోధ. ఈ మనసే మానవుని అధమునిగ, ఉత్తమునిగ మార్చగలదు. ఉత్తమోత్తమునిగా మార్పు చెందాలనుకుంటేనే ఉత్తమ గురువు లభిస్తాడు. ప్రత్యక్షంగా గురువరేణ్యుని సన్నిధిలో నివసించాలి. పరోక్షంగా గురువు వద్ద భక్తి శ్రద్ధలతో వినయవిధేయతలతో వేదాధ్యయనం, వేదాంత శ్రవణం గావించాలి. శ్రవణం చేసిన వేదాంతాన్ని గురువు బోధించినట్లు సాధన చేయాలి. గురువు అనుగ్రహంతో ఆయా సాధనలలో ఆరితేరి అపరోక్షానుభూతిలో నిలిచి, గురువుకు ఆనందం కలిగించాలి.

ఆత్మానందానుభూతి ప్రత్యక్ష పరోక్షానుభూతులతో అసాధ్యం. కాన సద్గురువు సాధకుడికి ముఖ్యాతిముఖ్యమని చెప్పక తప్పదు.

పశుపక్ష్యాది జన్మలకు ముక్తి లేదు. అవి శ్రవణం చేయలేవు. సాధన చేయలేవు. చెడుపనులు చేయలేవు. అందువలన అన్నిజన్మలలో ముఖ్యమైన శ్రేష్ఠమైన, ఉత్తమమైన, మనోవికాసానికి కేంద్రమైన ముక్తికి కారణమైన మానవ జన్మను సార్థకత పరచుకుని మహాత్ములు కావాలి. లోకానికి శాంతి సంధాత కావాలి. అదే జన్మ సార్థకత!!

గురుభక్తి ఎలా ఉండాలో చెప్పవలసి వచ్చిన ప్రతిసారీ శ్రీబాబూజీ సీతారామాంజనేయ సంవాదంలో చెప్పిన పద్యం "గురుపదాంభోజముల్ గొలువక గల్గునే ప్రవిమల వైరాగ్య భాగ్య మహిమ!" అని చదువుతూ ఉంటారు.

కొంతమంది శిష్యులు 'బాబుగారూ! అంతా మీదయేనండీ! చిత్తం చిత్తం' అంటూనే లోపల స్వంత ఆలోచనలు మానరు. ఇది లౌక్యం. లౌక్యపు జిత్తులకు గురువు అందడు.

– శ్రీ కాళీబాబు

# శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడు సమర్థ సద్గురు
# బాబూజీ మహరాజ్

– శ్రీ సంపూర్ణానందగిరి స్వామి
శ్రీజగద్గురు సత్సంగ క్షేత్రం, హైదరాబాదు

మానవ మాత్రులచే పొందగలిగినవి నాలుగు పురుషార్థములు. ధర్మము, అర్ధము, కామము, మోక్షము. ఈ పురుషార్థములు సంపాదింటానికి ఉపాయములు రెండు. శాస్త్రము, గురువు. వీటి ద్వారా సంపాదించవచ్చు. 'శాశసనాదితి శాస్త్రం'. ఏది చేయదగినది, ఏది చేయరానిది శాసించునదే శాస్త్రము.

తస్మాచ్ఛాస్త్రం ప్రమాణంతే కార్యాకార్య వ్యవస్థితౌ
జ్ఞాత్వాశాస్త్ర విధానోక్తం కర్మకర్తుమిహార్హసి ।

కార్యాకార్యముల నిర్ధారణ చేయుటయందు శాస్త్రమే ప్రమాణము. సద్గురువు ద్వారా శాస్త్రవిషయము బాగా తెలుసుకుని, ఈ ప్రపంచమునందు కర్మలు చేయటానికి మానవులు అర్హులై ఉన్నారు. అని గీతాచార్యుడు 16వ అధ్యాయం 24వ శ్లోకంలో చెప్పియున్నారు.



శాస్త్రము అనగా వేదము. వేదము అనగా జ్ఞానము. కర్మాచరణము కొరకు యీ వేదజ్ఞానము అత్యంత ఆవశ్యకము. ధర్మార్థ కామములు సాధించటకు వేదపూర్వకాండ జ్ఞానము అవసరము. నాల్గవ పురుషార్థమైన మోక్ష సంబంధమైన జ్ఞానము సంపాదించటానికి వేద ఉత్తరకాండ జ్ఞానం అవసరం.

వేదము కాండద్వయాత్మకము. పూర్వకాండ, ఉత్తరకాండ అని రెండు రకములు. మానవులు బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస నాలుగు ఆశ్రమములు. ఎవరు ఏ ఆశ్రమములో ఉంటారో, ఆ ఆశ్రమ ధర్మాలను ఏ విధంగా ఆచరించాలో ఆ క్రమాన్ని బోధించేదే వేదం.

బ్రహ్మచర్యాశ్రమంలో ఉన్నప్పుడు, వేదాధ్యయనం, సంధ్యావందనం, గాయత్రీ మంత్రజపం, గురుసేవ మొ॥గు చేయదగినవి.

గృహస్థాశ్రమము స్వీకరించిన తరువాత దైవపూజ, జప, ధ్యానములు చేయాలి. దీనినే 'దైవయజ్ఞం' అంటారు. భగవద్గీత, విష్ణు, శివ, దేవి మొదలగు స్తోత్రములలో ఏదో ఒకటైనా పారాయణ చేయాలి. దీనినే 'ఋషి యజ్ఞము' అంటారు. తల్లిదండ్రులకు బాగా సేవచేస్తూ, సకాలంలో వారికి ఆహారం అందిస్తూ, వారి మాటలను తిరస్కరింపక ఆచరిస్తూ ఉండాలి. దీనిని 'పితృ యజ్ఞం' అంటారు. గృహానికి వచ్చిన అతిథులకు తగు భోజనాది వసతులను ఏర్పాటు చేయాలి. దీనిని 'అతిథి యజ్ఞం' అంటారు. పశు పక్ష్యాదులకు తగు ఆహారాదులను యివ్వాలి. దీనినే 'భూత యజ్ఞం' అంటారు.

ఈ విధంగా నిత్యకర్మలను చేస్తూ , నైమిత్తిక కర్మలైన సూర్య చంద్ర గ్రహణముల యందు స్నానము, జపము, గోదావరి, కృష్ణ పుష్కరములయందు స్నానము, దానాదులు, జాత, మృత్యు శౌచాది కర్మలు, శ్రీరామ, కృష్ణ, దేవి జయన్తులు, నవరాత్రాది విశేష పూజలు, హెూమాదులు చేస్తుండాలి. వీటినే నైమిత్తిక కర్మలు అంటారు.

పొరపాటున జీవహింస జరిగినా, యితరులను నిందించినా, కొట్టినా లేక యితరములు ప్రమాదవశాత్ జరిగినప్పుడు, జప, ఉపాసనాదులను ఆచరించినట్లైతే ఆ పాపము పోతుంది. మరల పాపకర్మలు చేయకూడదు. వీటినే 'ప్రాదుశ్చిత్త కర్మలు' అంటారు.

ఆహార విహారములు నియమబద్ధంగా ఉండాలి. మరియు జప, ధ్యాన, భజనాదులు చేయాలి. వీటినే ఉపాసన కర్మలు అంటారు.

వానప్రస్థాశ్రమము –

50, 60 సంవత్సరాలు వచ్చిన తరువాత పుత్రపుత్రికలకు గృహ బాధ్యతలు అప్పగించి, సదా దైవచింతనతో, ఆధ్యాత్మిక విచారణాదులచే జీవితం గడుపవలెను.

సన్న్యాసాశ్రమము –

ఇంతకు ముందు తెలుసుకున్న మూడు ఆశ్రమాల అనంతరం సన్న్యాస ఆశ్రమమం స్వీకరించవచ్చు. బ్రహ్మచర్యాశ్రమ అనంతరం సన్న్యాసాశ్రమం స్వీకరించవచ్చును. సంపూర్ణమైన వైరాగ్యం కలిగిన బ్రహ్మజ్ఞానమును పొందవలెనని తీవ్రేచ్ఛ ఏ సమయంలో కలిగినా అలాంటివారు ఏ ఆశ్రమంలో ఉన్నా, సన్న్యాసాశ్రమమును గ్రహించవలెను. వైరాగ్యము, బ్రహ్మజ్ఞానేచ్ఛ లేని వాడు, సన్న్యాసాశ్రమమును స్వీకరించిన మరల పతితుడగును.

సన్న్యాసమును తీసుకొన్నవారు వేదములలో ఉత్తరకాండలో ప్రతిపాదించిన ఈశావాశ్యాది దశోపనిషత్తులను, భగవద్గీతను, బ్రహ్మ సూత్రములను, ఆత్మజ్ఞాన సంబంధ ప్రకరణ గ్రంథములను శ్రవణ మనన నిదిధ్యాసలను చేస్తూ, తినదగినవే తింటూ, త్రాగదగినవే త్రాగుతూ, ఆదర్శవంతుడై, ధనేషణ, దారేషణ, పుత్రేషణలకు దూరుడై, ప్రారబ్ధవశాత్, దొరికిన దానితో తృప్తుడై సదా స్వస్వరూపనిష్ఠతో ఉండవలెను.

సన్న్యాసమనేది తన్ను తాను ఉద్ధరించుకోవటానికి. ఇది మరచి యితరులను ఉద్ధరించటానికే సన్న్యాసము తీసుకుంటున్నామనటం అహంకార పూరితమైన అజ్ఞానమే కాని, జ్ఞానము కాదు. ఈ విధంగా వేదములు, నాలుగు ఆశ్రమ ధర్మములు మానవుడికి చెప్పాయి. వేదము చెప్పిన కర్మకాండ జ్ఞానకాండ విషయాలను బాగా పరిశోధించి, తెలుసుకుని, వాటిని ఆచరించిన వారే ఆచార్యులు అనబడుదురు. ఇటువంటి వారినే ఆచార్యదేవో భవ అని వేదం చెప్పినది. వీరినే గురువులు అందురు.

సదాచారః కుశలధీః సర్వశాస్త్రార్థ పారగః।
నిత్య నైమిత్తికానాం చ కార్యాణాం కారకో గురుః॥

వేదము చెప్పిన అనగా విహిత కర్మలనే చేస్తూ, తీక్ష్ణ సహిత కుశల బుద్ధి కలిగి, శిష్యుని హృదయానికి హత్తుకుపోయే విధంగా చెప్పేవాడు, శృతి, స్మృతి, పురాణ యితిహాసాదులను, సమస్త శాస్త్రములను తెలుసుకున్నవాడు, నిత్యనైమిత్తిక ప్రాయశ్చిత్తాది కర్మలను తెలుసుకున్నవాడు, ప్రమాదవశాత్తు వేదనిషిద్ధ కర్మ ఆచరించిన పక్షమందు ప్రాయశ్చిత్తాదుల ద్వారా ఆ పాపం పోగొట్టుకున్నవాడు యీ విధంగా శిష్యులచేత ఆచరింపచేయువాడు గురువు అనబడును.

న బుద్ధిభేదం జనయేత్ అజ్ఞానానాం కర్మసఙ్గినామ్
జోషయేత్సర్వ కర్మాణి విద్వాన్యుక్త సమాచరన్॥

(భగవద్గీత)

పండితులు కర్మఫలాసక్తితో చేస్తున్న జనులను గురించి కర్మలను బాగా చేయమని వారికి మెల్లమెల్లగా జప ధ్యాన విచారణాదుల యందు ప్రవేశింపజేసి నిష్కామ పరాయణులుగ, ఆత్మజ్ఞానులుగ చేసే కుశలబుద్ధికలవారే గురువులు. శిష్యుని బుద్ధిననుసరించి ఉపదేశ భూమికలను గావింపవలెను.

నాల్గవ పురుషార్థమైన మోక్షమును పొందటమే మానవమాత్రుని ముఖ్య

కర్తవ్యము. నాలుగు ఆశ్రమాలలో ఏ ఆశ్రమంవారైనా స్త్రీలుగాని, పురుషులు గాని, బ్రాహ్మణులుగాని, బ్రాహ్మణేతరలుగాని మోక్షమును పొందటానికి అర్హులే. ఇందులో సందేహమే లేదు. సద్గురువును ఆశ్రయించాలి. ఆత్మజ్ఞానాన్ని పొందాలి. జ్ఞానంవల్లే మోక్షం సిద్ధిస్తుందని ముండకోపనిషత్ చెబుతున్నది.

తద్విజ్ఞానార్థం సగురుమేవాభి గచ్ఛేత్
సమిత్పాణిః శ్రోత్రియమ్ బ్రహ్మనిష్ఠమ్ ॥

ఆత్మజ్ఞానాపేక్ష కలిగిన వాడు సాధన చతుష్టయ సంపత్తిని సాధించినవాడు వేదమును తెలుసుకుని, ఆధారభూతమైన బ్రహ్మనందే నిష్ఠ కలిగిన గురువును ఆశ్రయించి, ఆ సద్గురువు ద్వారా ఆత్మానాత్మ విచారణ సహిత తత్సమస్యాది మహావాక్య విచారణ తెలుసుకుని 'అహం బ్రహ్మాఽస్మి', 'బ్రహ్మైవాహఽమస్మి' అనే అనుభూతిని పొంది, భగవద్గీతలో 2వ అధ్యాయంలో, 55వ శ్లోకం నుండి 72వ శ్లోకం వరకు చెప్పిన స్థితప్రజ్ఞ లక్షణాలు తెలుసుకుని ఆచరణలో పెట్టుకోవలెను. వీరిని జీవన్ముక్తులు అంటారు.

దేవతలందరితోను, మానవులందరితోను, పశుపక్ష్యాది క్రిమి కీటకాదులైన సమస్త జంతువుల యందును ఉన్న చైతన్యము ఒక్కటేనని, అదే తనలో ఉన్నదని భావించి, అందరియందును సమ బుద్ధినుంచాలి. సదా ఆ భావనతో ఉండాలి. ఇదే ఆత్మజ్ఞానము.

ఈ విధమైన స్థితప్రజ్ఞులు ఆత్మజ్ఞానులు, శ్రోత్రియబ్రహ్మనిష్ఠులే, సర్వాధిష్ఠాన చైతన్య సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాదబాబూజీ మహరాజ్‌వారు. ఇటువంటి సిద్ధ పురుషుడు స్థాపించినదే శ్రీకాళీవనాశ్రమం. ఆశ్రమమం స్థాపించి జనులందరకు భక్తి జ్ఞానములను తెలిపిన సుధీరులు వీరు. వీరియొక్క రజతోత్సవ పుణ్యారాధన పురస్కరించుకుని (20-11-2013 నుండి 1-12-2013 వరకు) ఈ వ్యాసరూప పుష్పమును వారికి సమర్పిస్తున్నాను.

శ్రీకాళీవనాశ్రమ పీఠాధిపతులైన పూజ్యశ్రీ యోగిని శ్రీచంద్రకాళీ ప్రసాదమాతాజీవారు శ్రీసద్గురు అడుగుజాడలలో నడుచుకుని, నిరహంకారులై, బ్రహ్మనిష్ఠగలవారై, భక్తులకు భక్తి జ్ఞానములను బోధిస్తున్నారు. మాతాజీగారి ఆధ్వర్యంలో యీ రజతోత్సవం జరగటం సంతోషదాయకం!!

# ఆచార్యోపాసనము

-శ్రీఅభేదానంద స్వామి,
శ్రీరామానందాశ్రమము, భల్లూకగిరి

ఓం శ్రీగురుభ్యోనమః హరిః ఓం తత్సత్ ఋషిభ్యోనమః

శ్లో॥ శ్రీగురుం పరమాత్మనం బ్రహ్మావిష్ణుశివాత్మకం।
పరబ్రహ్మ స్వరూపం తం నమామి హృదయేశ్వరం॥

గురుపాద సంసేవనం, గురుపద సంచారం, గురుతత్వ అవలోకనం న గురో రధికం. ఇది సిద్ధాంతం. ఏకాంతవాసము, ఏకాగ్రదృష్టి, ఏకేశ్వరోపాసన (ఈశ - గురురీశః) నరుడు గురునిచేరి, నాలుగు సేవలు చేసెనేని నిజము చెప్పునయ్య. చెప్పగానే మాయ చప్పుడు చల్లారు.



గురువు ఒక మాట చెబితే (శిష్యునికి) ఎందుకు చెప్పారో తెలుసు కోవటం అనవసరం. వెంటనే ఆచరించటమే శిష్యుని కర్తవ్యము. కాని అలా చేయక తిప్పలు కొని తెచ్చుకుంటాడు. 'అన్నీ తెలిసిన తిప్పలు నావి, తెలియని తిప్పలు నీవి' అనేవారు శ్రీబాబు.

గురువనే చాకలి శిష్యుడనే బట్టను, జ్ఞానమనే బండమీద వేసి, ఉతుకుతాడు. అజ్ఞానమనే కల్మషమంతా హరించుకుపోతుంది. శివశాసనము కన్న గురుశాసనము గొప్పది. గురువునకు సమీపానువర్తియై గురువాక్కును తు.చ తప్పకుండా పాటించటమే (ఆచరించుట) ఆచార్యోపాసన. ఆర్యులు, ఆచార్యులు అనునవి గురుఅనే పదమునకు ఉపవాచకములు (నామాంతకములు). ఏకర్షి అను నగ్నిని ఉపాసించువారు శిరోవ్రతులు. అనగా గురువాక్యమును తలదాల్చి నడుచువారు మాత్రమే బ్రహ్మవిద్యను ఉపదేశింప బడుటకు అర్హులు.

The term ARUN in our sacred books does not refer to any race and any caste. but it refers to highly civilized and cultured mankind. (Man flock)

An Aryan is one who strictly adheres to DHARMA and rightousness. Manusmruthi stated that childern born of parents imbued with self control and acesterity are Aryans.

The function of Vedantha Philosophy is to induce man to become Aryas in all respects.

ఈ ఆర్య శబ్దము బహుశక్తివంతము, శ్రేష్ఠవంతము. ఆర్యులు లేక ఆచార్యులు బహుధా మాననీయులు, పూజ్యనీయులు. ఉపాధ్యాయాన్ దశాచార్యః పదిమంది వుపాధ్యాయులకంటే ఒక ఆచార్యుడు గొప్పవాడు. లౌకిక విద్యలు తెలుపువాడు వుపాధ్యాయుడు. ఆత్మ విద్య, ఉన్నత విద్య. దాని అర్థాన్ని తెలుపువాడు ఆచార్యుడు. 'సదాచారసంపన్నతలో నిండి వెలుగొందు ఆర్ష సంస్కృతిగల ఆర్యావర్తము బహుపుణ్య తపో విభాజితము, విలసితము' కూడాను.

ఆచార్యవాన్ పురుషోవేదనేతరః ఆదర్శపూర్ణ మూర్తి ఆచార్యుడు. సదాచార్యుడే ఆర్యుడు. భరతఋషి. తాను ఆచరించి, యితరులను ఆచరింప జేయువాడే ఆచార్యుడు. ఆచార్యుడులేని అంగము, శీలములేని అంతరంగము రాణించవు. శీలములేని విద్య, పరిమళము లేని పుష్పము వంటిది. ఆచరాణత్మక మైన వేదాంత స్వరూపమే ఆర్యుడు, ఆచార్యుడు. ఆచార్యుడు మానవజాతికి అలంకారము. ఆరవ ప్రాణము. అమృత జీవన ప్రవాహము. ఆచార్యుని జీవన విధానము. అట్టి ఆచార్యునికి ఆత్మ నివేదము చేయుటయే ఆచార్యోపాసన. శ్రీమత్భగవద్గీత 13వ అధ్యాయము, క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగము. అందులో జ్ఞానికి ఉండవలసిన లక్షణాలు చెప్పబడ్డాయి.

అమానుష్యమదాంభిత్వం మహింసా క్షాంతిర్జ్జావం
ఆచార్యోపాసనమ్ శౌచమ్ స్థైర్యమాత్మ వినిగ్రహః ॥

మొదలగు 20 లక్షణాలతో వివరించారు. 6వ గుణం ఆచార్యోపాసము. లౌకిక విద్యలకే గురువు అవసరమైనప్పుడు, బ్రహ్మవిద్యాభ్యాసమునకు గురువు అత్యంత ఆవశ్యకము. ఆచార్యసేవ అని చెప్పడం లేదు. ఆచార్యోపాసన అని చెప్పినాడు. దైవాన్ని ఉపాసించినట్లే ఆచార్యుని ఉపాసించవలెను. ఆచార్యునకు ఉప – అనగా సమీపంలో ఆసినుడై అంటే కూర్చుని బ్రహ్మవిద్యా శ్రవణం చేయవలెను.

ధ్యానమూలం గురోర్మూర్తి మంత్రమూలం గురోర్వాక్యం

గురువులు శిష్యుల చిత్తాపహారులు గాని, విత్తాపహారులు కారాదు. గురువులలో వాత్సల్యము, హితముకోరే యోచన ఉండాలి. శిష్యులలో వినయము, సేవా నిరతి ఉండాలి. ఆకతాయితనము, అశ్రద్ధ అసలు ఉండరాదు. వారు కుర్చీపై వయ్యారంగా పడుకుని,

వార్తాపత్రిక చదివినట్లు చదివే చదువుకాదు. యిది వేదాంత విద్య. ఈ వేదాంత విద్య 'తద్విజ్ఞానార్థం సగురమేవాభిగచ్ఛేత్' అని ఉపనిషత్ చెప్పింది.

బ్రహ్మావిద్యను తెలుసుకొనుటకు గురువునే శరణు పొందాలి. అనాత్మ చింతనలతో అల్లాడిపోతున్న జీవుని ప్రబుద్ధుణ్ణి చేసేందుకు గురువు అలారం టైమ్ పీస్ లాంటివాడు. గురుశిష్యుల సంబంధం సనాతనంగా వస్తున్న సుసంప్రదాయమే.

త్రిమతాచార్యులు – శ్రీశంకర భగవత్పాదాచార్యులు, శ్రీ రామానుజా చార్యులు, శ్రీ మధ్వాచార్యులు. వీరుగాక శ్రీ సురేశ్వరాచార్యులు, పద్మపాదా చార్యులు, తోటకాచార్యులు మొదలగువారనేకులు.

నేటి తరమువారు శ్రీరమణమహర్షి, మళయాళమహర్షి, దయానంద సరస్వతి, శ్రీ సాయినాధులు, శివానంద సరస్వతి, అరవింద ఘోష్, స్వామి సమర్థ, రామకృష్ణ పరమహంస, వివేకానంద స్వామి, శ్రీ హనుమత్కాళీ వరప్రసాదబాబు మొదలగు వారంతా పరమాచార్యులు. వీరి తత్త్వాన్ని , చరిత్రలను వంటబట్టుకోవటం కూడా ఆచార్యోపాసన అవుతుంది.

సీ॥ గురుపదాంభోజముల్ గొలువక కల్గునే
ప్రవిమల వైరాగ్య భాగ్యమహిమ
గురుపాద తీర్థంబు గ్రోలక గల్గునే
జ్ఞానవిజ్ఞాన యోగానుభవము
గురు సుప్రసాదంబు గొనకున్న గల్గునే
ప్రతిలేని చిత్తోపరతి సుఖంబు
గురుతత్వమాత్మకనుగొనకున్న గల్గునే
నిరతిశయంబైన పరమపదము
అట్లుగావున విద్యార్థియైన యోగి
వినయ భయభక్తులెదలోన బెనగొనఁగ
ఆల చతుర్విధ శుశ్రూషలాచరించుగొనుచు
ననిశంబు గురువుల గొలుచుననఘ

(సీతారామాంజనేయ సంవాదం)

గురుశుశ్రూషయా విద్యా సద్గురు సమాశ్రయము వలననే ముక్తి.

# *WHY FEAR? I AM HERE!*

– పరాశర ప్రసాద్

'గురు' అనే శబ్దములోనే ఉంది ఆకర్షణ. ఆయన దర్శనం కోసం, స్పర్శకోసం, బోధ కోసం నిరీక్షించేవాళ్ళం. అది పొందినప్పుడు కలిగే ఆనందానికి అవధులు వుంటాయా? సద్గురుదేవులు అనేక పర్యాయాలు హెచ్చరించారు "మీరంతా నా దర్శనాన్ని పొందుతున్నారు. నమస్కారం చేసుకుంటున్నారు. బోధా శ్రవణం చేస్తున్నారు. తృప్తిగా ఉంటోందా? మరి నన్ను ఒక్కరోజు చూడకపోతే ఉండలేక పోతున్నారు. మరి గోపికలు అలాగే ఉన్నారా? ఇది నిజమైన భక్తి అనిపించుకుంటుందా? ఇంకపైకి ఎప్పుడు ఎదుగుతారు? సగుణభక్తికి అలవాటు పడిపోతున్నారు" అనేవారు.

సద్గురుదేవులు లక్ష్యార్థం ప్రసాదించిన తరువాత ప్రతిరోజు "ధ్యానం ఎలా జరిగింది?" అని ప్రశ్నించేవారు. ధ్యానంలో ఏవో రంగురంగుల కాంతిని దర్శించామని చెబితే, "మనసు యింకా నిలబడలేదన్నమాట" అనేవారు. ఇంకొక రోజున తెల్లని కాంతిని దర్శించానని చెబితే, "కాంతిని దర్శించాను అన్నావు కదా! నీకు కాంతి భిన్నంగా ఉందనేగా! అంటే మనసు నిలబడలేదన్న మాట" అన్నారు.

ఇలా ప్రతిరోజూ కలిగిన అనుభవాలను సద్గురు దేవులకు విన్నవించు కుంటూ రోజులు గడుస్తున్నాయి. ఒకరోజు ధ్యానంలో స్వామి రూప దర్శనం అయిన విషయం చెప్పగానే ఆయన సమాధానం చెబుతూ "నీ గురుమూర్తిని యీ ఉపాధి వరకే పరిమితం చేస్తావా? సగుణ దర్శనం పొందటానికి ధ్యానం చేయాలా? రోజూ పొందుతూనే వున్నావు కదా! ఆయన నిర్గుణ సౌందర్యాన్ని దర్శించాలి. నిర్గుణ సౌందర్యమంటే ఆయన సర్వవ్యాపకత్వాన్ని, ఆయన సర్వ శక్తిమంతత్వాన్ని, ఆయన సర్వజ్ఞత్వాన్ని దర్శించాలి. ఆయన సర్వవ్యాపకత్వాన్ని ఎలా నిరూపణ చేస్తావు?" అని ప్రశ్నించారు.

ఇంకా మాట్లాడుతూ "ఎవరైనా నా గురించి అడిగితే ఏమని చెబుతావు? నేను మహాత్ముణ్ణి అనో, లేక శ్రీ రామకృష్ణ పరమహంస అవతారమనో, లేక వీరభోగ వసంతరాయలనో చెబుతావా? లేక భగవంతుడని చెబుతావా? నేను ఎవరో చెప్పేముందు, నీవెవరవో తెలుసుకో. 'నేనెవరు?' అన్న ప్రశ్న వేసుకుని నిన్ను ప్రకాశింపజేస్తూ , నీ యింద్రియాలు, దేహము సక్రమంగా నిర్వహించే విధంగా చేసేదెవరో గుర్తించు. అనుక్షణం నీతోనే ఉంటూ, నీ శ్వాసకు, నీ క్రియలకు కారణమెవరో

గుర్తించు, అదే అసలు 'నేను'. మీరంతా భావించే 'నేను' అనే మూలభావన నీలో వుంటే, ఆత్మవస్తువైన 'నేను' పైన ఆద్యారోపణ చెంది, తానుగా ప్రవర్తించే, అహంకారమనే మనసు దాన్ని గుర్తించాలి.

**'WHY FEAR? I AM HERE! '** అన్న దాంట్లో **'I '** అనేది 'నేను' కదా. అది ఎవరు? అదే నీ గురుశక్తి. ఆ గురుశక్తి నీకు ఆధారమై నిర్భయుడవై ఉండమని చెబుతోంది" అన్నారు.

అనుదినము సత్సంగాలు జరుగుతూ ఉండేవి. ప్రతిరోజూ గుంటూరు నుంచి వచ్చి, రాత్రివరకు ఆశ్రమంలో ఉండి, సత్సంగాలలో పాల్గొని వెళ్ళటం జరిగేది. సద్గురుదేవులు ఒకనాటి సత్సంగ కార్యక్రమంలో "సగుణం గొప్పదా? నిర్గుణం గొప్పదా?" అని ప్రశ్నించారు. "సగుణంలో ఉన్న ఆనందాన్ని నేనూ కాదనను. కాని మీరంతా సగుణానికే పరిమితం అయితే, సాధన కుంటు పడుతుంది. సగుణం అవసరమే. గురుబోధా శ్రవణం సగుణం. మరి బోధా శ్రవణానికే మీరంతా పరిమితమైతే ప్రయోజనమేమిటి? శ్రవణం చేసిన బోధను మననం, విచారణ చేసినప్పుడే అది నిదిధ్యాసకు వచ్చి, వాసనా రహితం అవుతుంది."

అ రోజు సత్సంగ కార్యక్రమం రాత్రి 12గం॥ల వరకు కొనసాగింది. సత్సంగం ముగిసిన తరువాత క్రిందకు వచ్చి, షూ్యా వేసుకొనే ప్రయత్నంలో ఉండగా, సద్గురు దేవులు బిల్డింగ్ పైనుంచి బిగ్గరగా "ఎవరు?" అని అడిగారు. వెంటనే సమాధానం చెబుతూ 'నేను బాబూ!' అన్నాను. "టైమ్ ఎంతైంది?" అని ప్రశ్నించారు. '12గం॥లు అయింది' అని సమాధానం చెప్పిన వెంటనే, "మీరు యీ సమయంలో వెళ్ళగలరా? ఫరవాలేదులే. మీకు తోడుగా ఎవరో ఒకరు ఉంటారులే. వెళ్ళిరండి" అని చెప్పారు.

అప్పుడు షూ్యా వేసుకోవటానికి ప్రయత్నం చేసేసరికి, ఆ షూ్యాలో నుంచి ఒక పాము బయటకు వెళ్ళిపోయింది. నేను కంగారు పడటం చూసి, "ఏమిటి?" అని బాబు ప్రశ్నించారు. 'షూ్యాలో నుంచి పాము వచ్చింది బాబు' అని చెప్పేసరికి, "భయంలేదు లే, వెళ్ళిరండి" అని "మీకు ఇంకొక ప్రమాదం పొంచి ఉంది. జాగ్రత్త సుమా!" అన్నారు. నాకు భయం వేసింది. ఆ రాత్రి ఆశ్రమంలోనే ఉండి పోవాలనుకున్నాను. కాని బాబు మాట్లాడుతూ "మీ మామగారు వచ్చి మూడు రోజులు అయింది. ఈ మూడు రోజుల నుంచి మీరు ఆయన్ను కలసుకోలేదు. మీరు వెళ్ళేసరికి ఆయన నిద్రావస్థలో వుంటున్నారు. మీరు యిక్కడికి బయలు దేరేముందు ఆయన నిద్ర లేవటంలేదు. ఆయన

మీ మీద కారాలుమిరియాలు నూరుతున్నారు. ఈ రోజైనా మీరు కలుసుకోండి" అన్నారు. ఇంకా హెచ్చరిస్తూ "మీరు వెళ్ళేటప్పుడు పెద్ద లారీ ఎక్కకండి. చిన్న లారీ వస్తే ఎక్కండి. మీరు క్షేమంగా చేరతారు" అన్నారు.

నేను ఎలాగో రోడ్డుపైకి చేరేసరికి, పెద్ద లారీ వచ్చి ఆగింది. సద్గురు దేవులు చేసిన హెచ్చరిక స్ఫురణకు వచ్చింది. ఆ లారీ ఎక్కలేదు. దాని వెనుక చిన్న లారీ వచ్చింది. గురుదేవులు ఆదేశానుసారం ఆ లారీ ఎక్కాను. తీరా హేమలతా టెక్స్‌టైల్స్ దగ్గరకి చేరేసరికి ముందు వెళ్ళిన పెద్దలారీ పక్కన గోతులో పడి ఉంది. నేను ఆ లారీలో ప్రయాణం చేసి ఉంటే....! ఊహించలేక పోయాను. పోనీ వెళ్ళవద్దని నివారించవచ్చు. కానీ అలా వెళ్ళకుండా ఆగినంత మాత్రాన యింకోరోజున ప్రమాదం తప్పదుకదా! ఈ జరిగిన సంఘటనలు మా మధ్య చర్చకు సదవకాశం కలిగించాయి.

ఆ రోజు సత్సంగ సమావేశం ముగిసిన తరువాత బాబు నన్ను, డా॥ కృష్ణార్జునరావుని ఉండమని హెచ్చరించి, మిగిలినవారందరూ నిష్క్రమించిన తరువాత "ఏమిటి చర్చిస్తున్నారు? జరిగిన సంఘటనల గురించా?" అన్నారు.

తిరిగి శ్రీబాబు మాట్లాడుతూ "మీ చిన్నతనంలో ఏదైనా నీటిగండం గురించి తప్పించుకున్నట్లు జ్ఞాపకం ఉందా?" అన్నారు. నేను సమాధానం చెబుతూ 'నాకు గుర్తున్నంతవరకు అలా జరిగినట్లు లేదు' అన్నాను. "నీకు ఒక పెద్ద నీటి గండం వుంది. భయపడకు. గోదావరి స్నానానికి వెళ్దాం. అప్పుడు ఆ గండం తొలగి పోతుంది. ఈ విషయం ఎవరికీ చెప్పకు. తెలిసినా ప్రమాదం ఏమీలేదు. మనతో వచ్చిన వారందరినీ తీసుకువెళ్ళటం, తీసుకురావటం నీ సమస్య" అన్నారు.

కొద్దిరోజుల్లోనే భీమవరం డా॥రంగరాజుగారియింట్లో సత్సంగం జరిగింది. భక్తులందరినీ నంబూరు నుంచి భీమవరం సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో, నన్ను, డాక్టరుగారిని తీసుకురమ్మనమని ఆదేశించారు. సత్సంగ సమావేశం అయిన వెంటనే మేము శివ యింటికి చేరుకున్నాము. కొంతమంది తిరిగి ఆశ్రమానికి చేరుకున్నారు. నాతో వచ్చినవాళ్ళకి గోదావరి స్నానాల సంగతి చెప్పకుండా "మీరు నాతో వచ్చారు కాబట్టి, మిమ్మల్ని తీసుకువెళ్ళే బాధ్యత నాపై ఉంది" అనే హెచ్చరికతో మరి కొంతమందికి ఆ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కలిగింది. సద్గురుదేవులు పరోక్షంగా సంపత్‌గారికి ఎంత హెచ్చరిక చేసినా ఆయన వెళ్ళిపోయారు.  ఉదయం అందరూ శివ యింటి దగ్గరనుండి కారుల్లో గోదావరి స్నానానికి కపిలేశ్వరపురం వెళ్ళాము. నేను, డాక్టరుగారు

స్నానాల కోసం స్విమ్మింగ్ డ్రెసెస్స్ కొన్నాము. బాబు మమ్మల్ని చూసి, "మీ యిద్దరికీ యీత వచ్చా? గజ యీతగాళ్ళల్లాగ డ్రస్ వేసుకొన్నారు?" అన్నారు. అంతవరకు మేము ఏ నదిలోనూ స్నానం చేయలేదు.

బాబు నా చెయ్యి పట్టుకుని, నెమ్మదిగా 'భయం లేదు. భయం లేదు' అని నదిలోపలికి తీసుకువెళ్ళారు. కొంత దూరం వెళ్ళేసరికి, అంతా నీళ్ళలో మునుగుతున్నారు. ముందుగా బాబు నీటిపైన శేషశయనుడై పవ్వళించి ఉండగా అభిషేకం, నమస్కారాలు చేస్తున్నారు. ఆ తరువాత అంతా సద్గురుదేవుని దివ్య చరణారవిందాలకు నమస్కరించారు. ఇంతలో నన్ను చూసి, "ఏమిటి మీ జుట్టు సరిగా తడవలేదు? ఇక్కడికి వచ్చింది యిందుకోసమేనా?" అని ప్రక్కవాళ్ళకి ఏదో సంకేతాన్ని అందించారు. అంతే! వాళ్ళు నా కాళ్ళు పట్టుకుని, నీళ్ళలో తలక్రిందులుగా ముంచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారిలో శ్రీ భాస్కర్ రాజు, రామచంద్రరాజు, చలపతిగారు, చంద్రం ఉన్నారు. భాస్కర్‌రాజుగారు 'యింకచాలు' అని నన్ను పైకి లేవనెత్తారు.

సద్గురుదేవులు వాళ్ళని ప్రోత్సహిస్తూ "ఇందాక ఆయన్ని నీళ్ళలో ముంచినందుకు ఏమీ అనలేదుగాని, యీ సారి ముంచండి చూద్దాం. ఆయన మిమ్మల్ని ఏం చేస్తాడో" అన్నారు. అలా రెండు మూడుసార్లు నీళ్ళలో ముంచారు. అలా నీటిగండం పోయింది.

హనుమాయమ్మగారు దూరంగా నిల్చున్నారు. ఆమెను బాబు రమ్మని హెచ్చరించి, "వీరందరికీ బోధ చేయండి" అన్నారు. ఆమె సమాధానం చెబుతూ, 'నేను రాను. వస్తే నన్ను కూడా అలాగే ముంచేస్తారు' అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ "చూస్తారేమిరా? ఈయనను నీళ్ళలో ముంచి, ఆవిడను వదిలేస్తారా? అది న్యాయమేనా? ఆవిడను ఎత్తుకుని తీసుకురండి" అన్నారు. ఇంతలో ఆవిడ వచ్చి బోధ చేశారు.

> గురువుగారు "నోరుమూసుకోరా!" అనగానే అదే ఆజ్ఞగా భావించి, జీవితమంతా మౌనంగానే ఆనందం పొందుతూ గడిపారు సదాశివ బ్రహ్మేంద్రులవారు. గురుతత్త్వాన్ని అర్థం చేసుకోవాలంటే అలాగ ఉండాలి.
>
> – శ్రీబాబు

# ఎవరు బాబు?

- శ్రీరామస్వామి సంపత్

శ్రీబాబూజీవారి అపార కృపానుగ్రహాలను పొందిన నేను,కీర్తి శేషులు శ్రీవంకాయలపాటి చిరంజీవిగారు ఎన్నో సార్లు శ్రీ సద్గురుదేవులను దర్శించి వారు ఇచ్చిన స్వతంత్రతతో వారిపై ప్రశ్నల వర్షాన్ని కురిపించేవారము. వాటిలో కొన్ని సారహీనమైన చొప్పదంటు ప్రశ్నలుకూడా ఉండేవి. మేము వేసే ప్రశ్నలన్నిటికీ వారు ఓపికగా సమాధానాలు ఇచ్చేవారు. తండ్రి తన సమక్షంలో బిడ్డ ఎలా ప్రవర్తించినా తప్పు పట్టనట్లుగా, శ్రీ గురుదేవులు మా లోపాలను తప్పుపట్టేవారు కాదు. పైగా "ఇంకా ప్రశ్నలు అడగండి. అడిగి మీ సందేహాలను తీర్చుకోండి. నన్ను కాకపోతే మీరు ఇంకెవరిని అడుగుతారు?" అనేవారు.

వారు ఇచ్చిన స్వతంత్రతతో ఒకసారి మేము ఇలా అడిగాము "మీరు ఎవరు బాబు?" అని. (ఇది 25 సంవత్సరాల క్రిందట జరిగిన సంఘటన) మా ప్రశ్న వింటూనే పగలబడి నవ్వారు. నవ్వును ఆపుకుంటూ,"ఓహో! మీరు నేనెవరో తెలుసుకోవాలని అనుకుంటున్నారన్నమాట. అయితే ముందుగా మీరెవరో తెలుసుకోండి. అప్పుడు నేనెవరో మీకు అర్థం అవుతుంది. అయితే ఒకటి మాత్రం నిజం. బాబు ఎవరో మీరు తెలుసుకుంటే మీకు మరుజన్మ ఉండదు." అన్నారు. తమ సంభాషణను అంతటితో ముగించి మౌనం వహించారు. మేము వారివద్ద శలవు తీసుకుని వచ్చేశాము.

తిరిగి వచ్చిన తరువాత బాబు చెప్పిన విషయం పైన చాలా సార్లు చర్చించాము. ఇంకా ఇతర భక్తులతోకూడా చర్చించాము. కాని మాకు సమాధానం దొరకలేదు. ఇలా రోజులు, వారాలు గడిచాయి. దీనికి సమాధానం ఈయగల సమర్థులు గురుదేవులు ఒక్కరే అనే నిర్ణయానికి వచ్చాము. కాని ఈ విషయాన్ని వారితో తిరిగి ప్రస్తావించటానికి ధైర్యం చాలలేదు.

ఆ సమయంలో శ్రీబాబు అమెరికా వెళ్ళి అక్కడ కొంతకాలంఉన్నారు. అప్పుడు మేము తరచు ఫోన్ చేసేవారము. అప్పుడు వారు మాకు మధుర స్వరంతో తమ బోధామృతాన్ని అందించేవారు. మేము ఫోన్ చేసిప్పుడల్లా వారు మా యోగ క్షేమాలు తెలుసుకొన్న తరువాత వేసే మొదటి ప్రశ్న - "మీరు ఆశ్రమానికి వెళ్ళారా?" అని. మేము

"వెళ్ళామ"ని చెప్తే ఎంతో సంతోషించేవారు. అలాకాక ఆశ్రమానికి వెళ్ళి ఉండకపోతే "నేను అక్కడ ఉన్నా లేకపోయనా మీరు ఆశ్రమానికి వెళ్ళండి" అని చెప్పేవారు.

శ్రీబాబు అమెరికానుంచి తిరిగి ఆశ్రమానికి వచ్చిన తరువాత మాకు వారితో ప్రత్యేకంగా మాట్లాడే అవకాశం లభించింది. అప్పుడు నేను వారిని ఇలా అడిగాను," ఆశ్రమంలో మీరు లేకపోయినా మమ్మల్ని ఆశ్రమానికి వెళ్ళమని ఎందుకు చెప్పారు?"అని. వారు అర్ధవంతంగా నవ్వుతూ "మీరు నేనెవరో తెలుసుకోవాలని ఉందని నన్ను కొన్ని నెలల క్రిందట ప్రశ్నించారు. గుర్తుందా? మీరు కేవలం ప్రశ్నలు వేయటం ద్వారా నన్ను తెలుసుకోవటం సాధ్యమయ్యేది కాదు. దానిని మీరు అనుభవంలోకి తెచ్చుకోవాలి. నేను ఉన్నా లేకపోయినా మీరు ఆశ్రమానికి వెళ్ళకపోతే అది మీకు అనుభవంలోకి రాదు. అందుకే నేను మిమ్మల్ని మాటి మాటికీ ఆశ్రమానికి వెళ్ళమని హెచ్చరించాను"అన్నారు. "సరే! నాకు అర్జంటు పనులు ఉన్నాయి" అని చెప్పి తమ సంభాషణ మగించారు.

శ్రీబాబు ప్రస్తుతం తానెవరో చెప్పేందుకు సుముఖంగా లేరని నేనూ,చిరంజీవీ అనుకున్నాము.ఈ సారి మేము ఈ విషయం గురించి ఎవ్వరితో చర్చించకుండా మేము వ్యక్తిగత అనుభవాలను పరస్పరం చర్చించుకుందామనుకున్నాం. కాని నాకు వుద్యోగరీత్యా విశాఖపట్టణం ట్రాన్స్‌ఫరు అవటం వల్ల దీనిమీద చర్చ జరగలేదు.

దురదృష్టవసాత్తు శ్రీగురుదేవులు శరీరత్యాగం చేయటం జరిగింది. భక్తులు వారి సుందర రూపాన్ని ప్రత్యక్షంగా చూసే అవకాశాన్ని కోల్పోయారు. సర్వ వ్యాపకులైన శ్రీబాబు భక్తుల ఆవేదన చూసి జాలిపడి శ్రీమాతాజీవారిని ఆశ్రమ బాధ్యతలు చేపట్టేటట్లు చేశారు. శ్రీ మాతాజీ ఆశ్రమాన్ని నడిపిస్తున్న తీరు చూసి భక్తులందరూ ఆశ్చర్య చకితులయ్యారు. పెద నింఢ్రకొలను భక్తులు "శ్రీబాబే ఈ రూపంలో వచ్చార"ని భావించారు. శ్రీమాతాజీవారు దేవీ నవరాత్రోత్సవాలలోను, శ్రీ సద్గురు ఆరాధనోత్సవాలలోను, తదితర సత్సంగ సమావేశాలలోను చేసిన ప్రసంగాలు శ్రీబాబు చేసినట్లుగానే ఉండి భక్తులను ఆకట్టుకొన్నాయి.

ఒకసారి నవరాత్రి ఉత్సవాలలో శ్రీమాతాజీ చేసిన బోధామృతాన్ని వినటం తటస్థించింది. వారు శ్రీ గురుదేవులకు భక్తుల పట్ల కల అవ్యాజ అనురాగాలను గురించి చెపుతుంటే, నా మెదడులో ఏదో మెరిసినట్లు అయింది. అవ్యాజ కరుణామూర్తి శ్రీబాబు,

శ్రీమాతాజీవారి బోధామృతం ద్వారా స్వయంగా ప్రకటితమవుతున్నారని నా మనస్సుకు తట్టింది. నా ఆనందానికి అవధులు లేవు. ఆ ఆనందాన్ని ఎవరితో పంచుకోవాలా? అని అనుకుంటుండగా, శ్రీమాతాజీ నా మనోభావాలను గమనించిచారన్నట్లుగా, ఆ మర్నాడు నన్ను ప్రసంగం చేయమన్నారు. నేను సద్గురుదేవుల నామాన్ని తీసుకుని "బాబు"(BABU) ఇలా ప్రసంగించాను:

మొదటి అక్షరం 'B' అంటే Benevolence. 'గురుదేవుడు' దయా స్వరూపుడు. వారి పాదాలను ఎవరు ఆశ్రయిస్తారో వారిని కారుణ్యంతో కటాక్షిస్తారు. దానికి వారినుండి ఏ ప్రతిఫలమూ కోరరు. కాని ఒక్కటి మాత్రం కోరతారు." భగవంతుడి పై విశ్వాసాన్ని పెంచుకో" అంటారు. ఆయన ఎప్పుడూ ఇవ్వటమే గాని తీసుకోవటం లేదు. తమను ఆశ్రయించిన భక్తుల ఐహిక సమస్యలకు పరిష్కారాన్ని సూచించి, వారిలో భక్తి విశ్వాసాలను ఇనుమడింప చేసి, వారిని పరమ పదంవేపు నడిపిస్తారు. "నా పై నీకు విశ్వాసం పెరిగినకొలదీ నువ్వు సత్యమార్గంలో ముందడుగు వేస్తున్నావన్నమాట" అనేవారు. అది వారి అవ్యాజప్రేమ ( Benevolence).

రెండవ అక్షరం 'A' - Affinity - శ్రీ బాబూజీ తన ప్రేమానురాగాలను ప్రతి భక్తునిపై వర్షింపజేస్తారు. దేహధారిగా ఉన్నప్పుడు వారు ప్రతి భక్తుని, వారి కుటుంబ సభ్యులను పేరు పెట్టి పిలిచి వారి యోగక్షేమాలను చూసేవారు. అదేవిధంగా తన భక్తుడుకూడా తోటివారి పట్ల ప్రేమానురాగాలతో ఉండేటట్లు చేశారు. వారు భక్తులపైచూపే ప్రేమసాటి బంధువులుకూడా చూపించరు.శ్రీ గురుదేవులు భక్తులకు ఇచ్చిన గొప్పవరం "ప్రేమదృష్టి".

-మూడవ అక్షరం 'B' -Beauty - బైబిల్ చెబుతోంది - A thing of beauty is a joy for ever.-బాబూజీకి సంబంధించి నదంతా అందంగా ఉంటుంది. వారి ధీర గాంభీర్య విగ్రహం అందరినీ ముగ్ధులను చేస్తాయి. "సుందర విగ్రహాయ నమః" అని శ్రీబాబు సహస్ర నామాలలో ఉంది. కాళీవనాశ్రమ ప్రాంగణమంతా ఎంతో సుందరంగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. అంతేకాదు ఆశ్రమంలో జరిగే కార్యక్రమాలు - ప్రార్థన, ధ్యానం, సద్గురునామ జపం, సంకీర్తన, సత్సంగ సమావేశాలలో జరిగే ఆధ్యాత్మిక ప్రసంగాలు అన్నీ సుందరంగా, ఒక క్రమబద్ధంగా ఉండి భక్తుల నిర్మల హృదయాలను చాటుతాయి. ఆశ్రమంలో మాలలు కట్టి శ్రీగురుదేవులకు, శ్రీబాబూజీకి వేసే విధానం

అత్యంత సుందరంగా ఉంటుంది. బృందావనంలో చేసే పూల అలంకరణ ఎంతో సుందరంగా ఉండి భక్తులను అలరిస్తుంది. అది ఇది అననేల? అందానికి నిర్వచనం అద్వితీయమైన ఆత్మవస్తువే. దానిని పొందే స్థానం శ్రీకాళీవనాశ్రమం.

ఇక చివరిది – 'U'-Universalism. బాబూజీవారిది సర్వమత సమానత్వం. అది ఆశ్రమంలో చేసే సర్వజనీయమైన ప్రార్థన. ఈ ప్రార్థన అందరి సంక్షేమాన్ని కోరుతుంది. అన్ని జీవరాసుల సుఖ సంతోషాలను కోరుతుంది. ఈ ప్రార్థన ఉదయం 5గం.లనుండి 6గం.ల వరకు, తిరిగి సాయంత్రం 6గం.ల నుండి 7గం.వరకు జరిగే ఈ ప్రార్థనలో తప్పక పాల్గొనాలని శ్రీగురుదేవుల ఆదేశం. ప్రార్థన మనలోని కల్మషాలను తుడిచివేసి ఆధ్యాత్మిక పథంలో నడిపిస్తుందని శ్రీబాబు ఉద్బోధన చేశారు. ఈ ప్రార్థనను అందరూచేసి ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహించవచ్చు. ఇది విశ్వమత సంస్థాపకులైన శ్రీబాబూజీ మహరాజ్ వారిచే ఆమోదింపబడినది.

అందువలన BABU అంటే Benevolence(దయ); Affinity(ప్రేమ); Beauty (అందం); Universalism (సర్వమతసారం). మనం చేసే ఈ ప్రార్థనను అర్ధభావనలతో చేస్తే శ్రీ గురు పరమాత్ములైన సద్గురుదేవులు మనని తప్పక జనన మరణ వలయాన్నించి రక్షిస్తారు.

*చమురుచేత తడిసిన కాగితం మీద వ్రాయులేము. అలాగే దుర్గుణాలు, విషయ భోగాలు అనే నూనెలో నాని, పాడైన మనసు, పారమార్థిక సాధనలకు పనికిరాదు. కాని నూనె కాగితం మీద సుద్దను అద్దితే, మళ్ళా దాని మీద వ్రాయువచ్చు; అలాగే మనసు మీద వైరాగ్యమనే సుద్దను అద్దితే, సాంసారికుని మనసు మళ్ళా సాధనలకు పనికి వస్తుంది.*

– శ్రీరామకృష్ణులు

# సమర్థ సద్గురు

-సుశీల ప్రసాద

సత్యవస్తువైన పరబ్రహ్మను గురించి తైత్తిరీయ ఉపనిషత్ ఈ విధంగా ఉద్ఘోషిస్తున్నది

" రసో వైసఃరసగ్ హ్యేవాయం లబ్ధ్వా ఉ ఉ నన్దీ భవతి ।
కో హ్యేన్యాత్ కః ప్రాణాత్యయరేష ఆకాశ ఆనన్దో నస్యాత్
ఏవ హ్యేవా నన్దయాతి ॥"

"ఆ పరబ్రహ్మము రసస్వరూపమైన తృప్తి హేతువు. రసస్వరూపమైన పరబ్రహ్మమును పొంది, జీవుడు ఆనందించగలడు. హృదయాకాశము నందు, ఈ ఆనందస్వరూపుడైన పరమాత్మ లేక పోయినట్లయితే ఎవడు చలించగలడు" ఎవడు జీవించ గలడు? అతడే ఎల్లవారికి ఆనందాన్ని యిస్తున్నాడు.

ఈ ఉపనిషద్వాక్యాలే వేదస్వరూపులైన శ్రీసద్గురు దేవులు శ్రీ బాబు శ్రీకాళీవనాశ్రమములో 22-04-1985 రాత్రి వాకింగ్ సమయంలో గీతంగా 'త్రికాలములయందు ప్రకాశించును, హరించు అజ్ఞాన అంధకారమును, ఆనంద వారిధి అతడోలలాడును, అందరిని ఆనందమున ముంచితేల్చును' అని తన నిజతత్త్వాన్ని బోధించారు,

పరమానంద రసరూపుడైన పరబ్రహ్మమును పొంది ఆనందిచటం జీవుని నిజధర్మం కాగా, అజ్ఞానవశుడై స్వధర్మాన్ని విడిచి, దుష్కర్మ రతుడై దుఃఖసాగరంలో మునిగి పోతున్నాడు. ఇలాగ ధర్మానికి హాని సంభవించి నపుడు, ధర్మ సంరక్షణార్ధం ప్రతి యుగంలోను పరమాత్మ అవతరిస్తున్నాడు.

త్రేతాయుగంలో మాయామానుష రూపంలో దశరధరామునిగా జనించి, సామాన్య మానవునివలెనే చరించి, ధర్మాన్నాచరించి, ధర్మరక్షణ గావించి,లోకానికంతకూ ఆదర్శపురుషుడైనాడు. ద్వాపర యుగంలో లీలామానుష విగ్రహుడై వాసుదేవునిగా మధురలో పుట్టి, వ్రేపల్లెలో వెలసి, బృందావనంలో బ్రహ్మానందకారకుడై విహరించి, దుష్ట శిక్షణ శిష్ట రక్షణ ధ్యేయంగా ఎన్నెన్నో మహత్కార్యాలను నెరవేర్చి, మానవుడు మాధవుడు కాగల సత్యమార్గాన్ని ప్రబోధించి గీతాచార్యుడై, జగద్గురువైనాడు.

అలనాటి శ్రీరాముని శరణాగతజన పరిపాలన తత్పరతను, ధర్మక్షేత్రం అయిన కురుక్షేత్రంలో విరాట్స్వరూపాన్ని ప్రదర్శించిన జగద్గురు తత్వాన్ని కలబోసుకుని ఏకరూపమై పరమాత్మ ఈ కలియుగంలో సమర్థ సద్గురు మూర్తి అయిన 'శ్రీ బాబు' గా అవతరించారు.

నిరాకార నిర్గుణ బ్రహ్మము జగదోద్ధారణ కారణంగా, నామ రూప గుణ సహితమై ప్రకాశిత మవుతుంది. అట్టి ఆత్మ తత్త్వం ' శ్రీ హనుమత్కాళీ ప్రసాద బాబు' నామంతో, బ్రహ్మ విచారణ, సాధుసజ్జన గోష్ఠి సహజ గుణాలుగా జగదేక మోహన సుందర రూపం ధరించి, ఆబాల గోపాలాన్ని ఆకర్షిస్తూ, మారుని తోసిరాజని వాని ఆటకట్టించి కామదాసులను రామదాసులుగా మార్చగల అమోఘశక్తి వంతమై జగత్తులో విరాజిల్లింది. ఎవరు ఈ బాబు ?

సీ. తెరతీసి, యాడించి తెరదించు నీజగ
ద్రమ్య నాటక సూత్రధారి యెవడు?
రచయిత తానె, నిర్మాత, దర్శకుడనై
యన్ని పాత్రలు దానై, యాడు నెవడు?
ఆడించువాడునై, యాడెడువాడునై
ఆడకుండెడి మాయలాడి యెవడు ?
తన్నేనమ్మి శరణ్యమన్న యాత్రికుల మా
యను హరించెడి అమాయకుడెవండు ?

ఆ.వె. 'శరణుపొందు, నిడువు సర్వ ధర్మమ్ముల
నిన్ను నేను విడువ' నన్న దెవడు ?
అట్టి ప్రాణ విభుని నస్మదాచార్యుని
చరణ యుగళి నెరగి సన్ను తింతు.॥ (శ్రీవిజయేశ్వరానంద)

అని సర్వ సమర్పణ చేసుకున్న వారి హృదయ సామ్రాజ్యాలకు చక్రవర్తిగా పట్టం కట్టుకున్న గురు పరమాత్మ 'హృదయబాబు!'

ఒకే ధవళకాంతినించి సప్తవర్ణాలేర్పడినట్లు బ్రహ్మానందరస పూర్ణులైన అవతార మూర్తులు అవసరాన్నిబట్టి నవరసాలు ప్రదర్శిస్తారు. విజ్ఞులు తమ జ్ఞాన నేత్రంతో దర్శించి తమ అనుభవానందాన్ని రసికాగ్రేసరులు అయిన వారి

కందిస్తుంటారు. శ్రీ మహాభాగవతంలో పోతనామాత్యుడు మధురానగరంలో మల్లులతో పోరాడే శ్రీ కృష్ణస్వామి నవరసాలను ఏవిధంగా ప్రదర్శించాడో వర్ణిస్తూ 'యోగిజనులకెల్ల బరమ తత్త్వమగుచు భాసిల్లువాని' గాను, శ్రీ కృష్ణ కర్ణామృతంలో లీలాశుకులు అట్టి నవరస నాయకుడైన బాల గోపాలుని 'యోగిభిర్ధ్యేయ మూర్తి' గాను అభివర్ణించి సత్యవస్తు నిర్దేశం చేశారు.

నాటి బృందావన వాసిని వారలాగ స్తుతించినపుడు, అదే పరమాత్మ స్వరూపమైన నేటి బృందావనవాసి సమయానుకూలంగా నవరసాలను ఏవిధంగా పోషించారో కవిగారి దృష్టికి గోచరించేట్లు ప్రసాదించి కవి దర్శిత దివ్య సుందర మూర్తిని అక్షర రూపంలో తన స్ఫూర్తితోనే భక్త జన సందోహానికి అందించారు. అది ఈ విధంగా ఉంది:

సీ. ఉపనిషత్కాంతా మృదూక్తులాకర్ణించి
కనుగీటు లాడు శృంగార రసము
శుష్క వేదాంత వస్తు ప్రదర్శన కుతూ
హలమ సహోదరులపై హాస్యరసము
ప్రబల భక్తి జ్ఞాన వైరాగ్యముల్గల్గి
వరలు సాధకులపైఁ గరుణరసము
ఈషణ త్రయము పేరింటి బంధమ్ముల
పరపరం గోయ భీభత్స రసము
కామాది రిపులపైఁ గనలి సర్వేంద్రియ
విజయముంబొందుచో వీర రసము
ఆపదలంజిక్కి నల్లాడుభక్తులన్
గనుగొనుచో భయానకరసమ్ము
పైనించి క్రిందికిం బడత్రోయు నహమును
రక్కసిం గూల్చుచో రౌద్ర రసము
సహకారివై యొకే సమయాన పెక్కు తా
వుల గోచరించనద్భుత రసమ్ము
లెక్క సేయక లెక్కలేని నిందల మోపు

జనసమూహమ్ముపై శాంత రసము
తే॥గీ॥ జూపితివి గుప్త మూర్తివిశుభ కరుండ
వందు మూడవ దాని నా యందు జూపు
మనుచు వేడుచునుంటి నిన్నాశ్రయించి
సత్యమోహన కాళీ ప్రసాదు బాబు !

(పరిమి సుబ్రహ్మణ్య భాగవతార్)

కవి వాక్కులతో తనను 'గుప్తమూర్తి' గా అభివర్ణించు కోవటంలో శ్రీబాబు వెల్లడించిన తెలిసిన సత్యం ఇది. దేశకాల పాత్రల ననుసరించి తన దివ్య తత్త్వాన్ని బహిరంగ పరుస్తారేగాని, తదితరులకు అది గుప్తంగానే ఉంటుంది. ఎవరికి ఏ సమయానికి ఏదిఅందించాలో సర్వజ్ఞులైన వారికే ఎరుక. యోగులు పరమ హంసలు జ్ఞానులు. వారా పరమానంద రహస్య గురు తత్త్వమును తమ తమ సాధనా విధానముల ద్వారా తెలిసి, అనుభవించి ఆ పరమ తత్త్వం తామై ప్రకాశిస్తారు. ఇతరులకు అది గోప్య వస్తువే.

కనుక శ్రీ బాబు దివ్య చరణార విందములయందు అచంచలమైన భక్తిని ప్రగాఢ విశ్వాసమును పెంపొందించుకుంటే అనుగ్రహ స్వరూపులైన స్వామి లక్ష్య సాధనా మార్గంలో ముందుకు సాగే శక్తిని బలాన్ని ప్రసాదించి తన నిజ తత్త్వాన్ని అనుభవంగా తెలుసుకోగల స్వస్వరూప జ్ఞానాన్ని ప్రసాదిస్తారు, అట్టి సాయుజ్య ముక్తి నిధానమైన గురు పరమేశ్వరులు భక్తోద్ధారకులైన శ్రీ బాబు.

భగవంతుడికోసం భక్తుడు ఎందుచేత సమస్తాన్ని త్యజిస్తాడు? ప్రకాశ వంతమైన దీపాన్ని చూశాక మిడుత వెనక్కి తిరగటానికి యిష్టపడదు; చీమ చక్కెరరాసిలో ప్రాణాలు విడుస్తుందేగాని, వెనక్కి తిరిగి పోదు. భగవద్భక్తుడూ యిలాగే తన ప్రాణాలను సైతం బ్రహ్మ ప్రాప్తికోసం ధారపోస్తాడే గాని, అన్యాన్ని లక్ష్య పెట్టడు.

– శ్రీరామకృష్ణ పరమహంస

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

యస్యాన్తం నాదిమధ్యం న హి కరచరణం నామగోత్రం న సూత్రం
నో జాతిర్నైవ వర్ణో న భవతి పురుషో నో నపుంసో న చస్త్రీ
నాకారం నోవికారం నహిజని మరణం నాస్తి పుణ్యం న పాపం
నో తత్త్వం తత్త్వమేకం సహజ సమరసం సద్గురుం తన్నమామి।

(శ్రీగురుగీత - శ్లో. 324)

సద్గురుమూర్తి స్వానుభవ సాక్షాత్కార సిద్ధిని బడసిన శిష్యుడు అఖండానందముతో సర్వ ప్రకృతికి విలక్షణమైన శ్రీగురుదేవుని స్తుతించుటయే యీ శ్లోక వివరణ. గురుపరబ్రహ్మమునకు ఆదిమధ్యాంతాలు లేవు. అనగా పరబ్రహ్మము త్రికాలాతీతమైనది. శాశ్వతమైనది. గురుపరబ్రహ్మమునకు కర చరణములు, నామరూపములు, గోత్రసూత్రములు లేవు. భాషకు, పాండిత్యమునకు, వర్ణనకు అందేది కాదు. తత్త్వము కేవలం అనుభూతి. అది మాటలకు అందేది కాదు. పరబ్రహ్మము పురుషుడును, స్త్రీ, నపుంసకము కానిది అని వచించుట అది కేవలము సచ్చిదానందము అన్నమాట. పరతత్త్వమునకు ఆకార వికారములు, జనన మరణములు, పుణ్య పాపములు లేవు. అది ద్వంద్వాతీతమైనది. సత్య స్వరూపము, అద్వితీయము, సహజసమరస స్వరూపము. పరబ్రహ్మ తత్త్వము కేవలము సద్గురు రూపము. సద్గురుదేవుల అనుగ్రహ భాషణమాత్రమే ఈ తత్త్వాన్ని తెలియజేయ గలుగుతుంది అనటానికి యింతకన్న నిదర్శనమేమున్నది? పరబ్రహ్మ తత్త్వానందానుభూతి కేవలం సద్గురు మూర్తి అనుగ్రహం చేతనే సాధ్యపడుతుందనటానికి యీ శ్లోకమే మనకి ఆధారము. దీనిని వచించినది కేవలము సర్వజ్ఞుడైన పరమేశ్వరుడే! గురుతత్త్వము మాటలతో వచింప శక్తిలేదని వచించినది పరమేశ్వరుడే సుమా!



# యోగి వేమన

- శ్రీ బులుసు వెంకటరమణయ్య

తామసంపుఁ బనులు తగవెందులకునైన
తామసంబు నుడుగఁ దగు సుజనులు
తామసంబు నెంచు ధరలోన మూర్ఖుండు
విశ్వదాభిరామ! వినురవేమ!

తాత్పర్యము –

తొందరపాటు పనులెప్పుడూ చేయరాదు. ఉత్తముడు తామసమును విడువవలెను. మూర్ఖుడే దానిని మెచ్చుకొనును.



తుమ్మచెట్టు ముండ్లు తోడనేపుట్టును
విత్తులోననుండి వెడలునట్లు
మూర్ఖునకు బుద్ధి ముందుగా పుట్టును
విశ్వదాభిరామ! వినురవేమ!

తాత్పర్యము –

చెట్టుపుట్టినప్పుడే తుమ్మచెట్టుకు ముండ్లు పుట్టును. అవి విత్తనము నుండియే ప్రారంభమగును. ఆ రీతినే మూర్ఖునకు చెడ్డబుద్ధి పుట్టుకతోనే పుట్టును.

దాన మరసి చేయు దాత దగ్గఱఁజేరి
వక్ర బాషణములు పలుకు మొఱకు
చందన తరునందు సర్పమునట్లు యా
విశ్వదాభిరామ! వినురవేమ!

తాత్పర్యము –

మూర్ఖుడు దానము చేయు దాతనాశ్రయించి. యిచ్చకములు పలుకుచుండును. వాడు చందన వృక్షముపై సర్పమున్నట్లు ఉండును. ఇతరులను దాత దగ్గరకు చేరనీయడు.

# శ్రీబాబూజీ ఉవాచ

– పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్‌తో ఎవరైనా భక్తులు తమకి అశాంతిగా వుందని తెలియజేసిన వెంటనే "అశాంతి ఎక్కడ నుంచి వచ్చింది? అది బయటనుంచి వచ్చిందా? లేక నీలోపల నుంచి వచ్చిందా? అసలు అశాంతి కలుగటానికి కారణం ఏమిటి?" అని ప్రశ్నించి దానిని వెంటనే ఉప శమింప చేసేవారు.



అటువంటి సాధకులకు బోధచేస్తూ "అశాంతికి ప్రధాన హేతువు మనస్సు. అది వికలం అయినదంటే నీ సాధనకి ప్రతిబంధకము అవుతుంది సుమా! అని హెచ్చరిస్తూ నీ మనస్సు జిత్తులమారి నక్క. అది అతి సులభంగా బాహ్య ప్రపంచం వైపునకు మళ్ళి ప్రాపంచిక విషయాదులకు చలిస్తుంది. గాంధీ మహాత్ముడు చెప్పినట్లుగా 'చెడు చూడకు, చెడు మాట్లాడకు, చెడు వినకు' అన్నవి ప్రతిసాధకుడు గుర్తించాలి.

శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "భగవంతుడు నీకు రెండు చెవులు ఎందుకు ఇచ్చాడు? చెప్పుడు మాటలను వినటానికి కాదు. ఇరుపక్షాల వాదనలు విని అప్పుడే ఒక నిర్ణయానికి రావాలని తెలుసుకోవాలి.

సాధకులు ప్రాపంచిక విషయాలకు అవకాశం ఇవ్వకూడదు. అలా ఇస్తే చిత్తము వాటిని రికార్డు చేసి నీ ధ్యాన సమయంలో అవి నీముందు నిలబడి నీ సాధనకు అంతరాయం కలిగిస్తాయి."

శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "కొండేలు చెప్పేవారు. వినేవారు ఆ పాపాన్ని మూటగట్టుకొని మరుజన్మలో గజ్జికుక్కగానో, కుంటి నక్కగానో, కొండచిలువగానో లేక నల్లిగానో జన్మిస్తారు. ఇది మాత్రం సత్యము. సాధకులు గురుదేవుని వద్ద ఎన్నడు మనస్సు దాయరాదు. దీనికి భిన్నంగా ప్రవర్తించిన యెడల అటువంటి సాధకులకు ధ్యానంలో మనస్సు నిలవదు. జీవితాన్ని ప్రపంచంతో ముడిపెట్టుకున్నంత వరకు ఎంత తీవ్రంగా సాధన చేసినా అది ఫలించదు సరికదా నీ మనస్సు తీవ్ర ఆందోళన చెందుతుంది. అప్పుడే నీ మనస్సులో అశాంతి ఏర్పడుతుంది.

ఒక నావ నదీతీరాన లంగరు వేసిన తరువాత ఎంత ప్రయత్నించినా అది కదలదు కదా ఆ నావని కదపటానికి తెడ్లను ఉపయోగించినా, తెరచాప ఎత్తినా ఆ నావ కదలదు. ఆఖరికి నీటి అలలుగాని పెద్ద గాలి గాని ఆ నావను కదల్చలేదు. ఆ నావని కదల్చాలంటే నదీతీరాన లంగరు వేసిన ముడిని విప్పాలి. అప్పుడు ఏ సహాయము లేకుండా ఆ నావ నీటిలో చక్కగా ప్రయాణము చేస్తుంది.

అలాగే మీరుకూడ గురులక్ష్యార్థాన్ని ఎంతో తీవ్ర ఆవేదనతో తీసుకుని మీ మనస్సుని పెద్ద బంగళా కట్టాలని కోర్కెతోనో, కుమారుని వివాహానికి ఎక్కువ కట్నం తీసుకుని, కుమార్తె వివాహం చేయాలనే సంకల్పంతోనో లేక కొడుకు ఎవరినో ప్రేమించి ప్రేమ వివాహం చేసుకున్నాడనే దిగులుతోనో, వ్యాపారంలో ఎక్కువ లాభాలు రాలేదనే ఆవేదనతోనో, తుఫాను కారణంగా పంటలకు భారీ నష్టం కలిగిందనే దిగులుతోనో వున్న వ్యక్తికి శాంతి ఎక్కడనుంచి వస్తుంది? ధ్యానంలో మనస్సు ఎలా నిలబడుతుంది? గురు లక్ష్యార్థాన్ని ఎలా సాధించగలుగుతారు? కాబట్టి మీ మనస్సుని అంతర్ముఖము చేయాలి.

మనస్సులో బాహ్య దృష్టి ఉన్నంతవరకు ప్రాపంచిక సమస్యలు మీకు అశాంతిని తీసుకువస్తాయి. నీ అశాంతికి కారణం నీ మనస్సు కాబట్టి నీ మనస్సుని గురులక్ష్యార్థముపై నిలిపినపుడే నీకు శాంతి చేకూరుతుంది. ఆ స్థితిలో ఉన్న సాధకుడు శ్రవణం చేసిన గురుబోధను మననం చేసుకొని తన జీవితపరమార్థం ఏమిటో గ్రహించి గురులక్ష్యార్థాన్ని సాధించి శాంతించిన మనస్సుతో జన్మరాహిత్యాన్ని పొందడం శ్రేయస్కరమా? లేక గురులక్ష్యార్థాన్ని మరచి అశాంతి చెందిన మనస్సుతో మృతిచెంది జనన మరణ విష వలయంలో చిక్కుకోవడం శ్రేయస్కరమా? మీరే ఆలోచించండి.

> పంచదారలో ఉన్న చీమ లాగినా బయటకి రాదు. చావనైనా చస్తుంది కాని, ఆ మధుర పదార్థాన్ని విడచి రాదు. అట్లాగే నిజమైన భక్తుడు ఎన్ని యాతి బాధలు వచ్చినా చలించక భగవన్నామ స్మరణ మరువడు.
>
> – శ్రీకాళీ ప్రసాదబాబు

# శ్రీ మాతాజీ అభిభాషణ

-జపమాలా ప్రసాద

"నారాయణ సమారంభామ్ శంకరాచార్య మధ్యమామ్ ।
అస్మదాచార్య పర్యంతామ్ వందే గురు పరంపరామ్ ॥

సర్వ వ్యాపకమైనది నారాయణ తత్త్వం. అటువంటి దివ్యతత్త్వం అనేక దేశ కాలాలయందు, అనేక నామ రూపాదులను ధరించి మహాత్ముల రూపంలో అవతరిస్తున్నది. ఆ దివ్యమైన నారాయణ తత్త్వం అస్మద్గురు రూపంలో ప్రకాశిస్తున్నది. శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులు, బ్రహ్మర్షులు అయిన పూజ్యపాద విద్యానందగిరి స్వాములవారు అట్టి మూర్తీభవించిన నారాయణ తత్త్వం, అటువంటి దివ్యమైన గురుపరం పరకు నమస్కరిస్తూ......




మహాత్ములకి రాకడ పోకడలనేవి లేవు. భక్త జనోద్ధరణార్థం ఒక రూపాన్ని ధరించి వచ్చి, తమ లోకహిత కార్యక్రమము పూర్తి అయిన తరువాత, తిరిగి వారి స్వస్వరూప స్థితిలో తమ రూపాన్ని లయం చేసుకుంటారు. ఇప్పుడు మన స్వామి ఎక్కడికో వెళ్ళిపోయారని ఏడవడం అవివేకం. బ్రహ్మజ్ఞానికి లేదు వినాశము, ఆర్త హృదయానికి ఇప్పుడూ ఎప్పుడూ కూడా వారు సమాధానము ఇస్తారు.

శ్రీ స్వామివారిని నేను రెండు మూడుసార్లు మాత్రమే దర్శించుకోవడ మయినది. సంపెంగ పువ్వు వున్న చోటు, దాచుకున్నా దాగదు. అదే విధంగా, స్వామి వారి దివ్య సౌరభాన్ని ఆస్వాదించడానికి ఒక్కసారి చాలదా ? వారి ముఖతః భగవత్తత్త్వం మినహా వేరొకటిరాదు.

అటువంటి దివ్య జ్ఞాన సంపన్నులను గురించి, మరియు బ్రహ్మీభూత మహర్షి శ్రీశ్రీశ్రీ మళయాళ స్వామివారి గురించి, వారి గురు సాంప్రదాయం గురించి, పరమహంస పరివ్రాజకాచార్య పూజ్యపాద శ్రీశ్రీశ్రీ దండి నిర్మలానంద స్వామి వారి ముఖతః అనేక పర్యాయములు వినడం జరిగింది. కావున, స్వామి వారు మాకు ఎప్పుడూ సుపరిచితులే, గురుతత్త్వమనేది ఎప్పుడూ ఒక్కటే. అది రూప నామాదులకి కట్టుబడేది

కాదు. అది మనో వాక్కులకి అందేది కూడా కాదు. ఏ గురుపరంపర కైనా మూలం నారాయణుడే కనుక, శ్రీ స్వామివారు మనవారే, అటువంటి **"గురుపాదమే మన నిజమైన పెన్నిధి**."

"గురుపాద సన్నిధి – నిజమైన పెన్నిధి
గురి తప్పని నిజ దృష్టికి గురుతే తానన్నది
ఇది మరచిపోకు మన్నది " –గురుపాదం.

ప్రపంచంలోని విషయాదులు ఎంత అనుభవించినా, ఇంకా కావాలి, ఇంకా కావాలి అని ఆవేదన పడేటట్లు చేస్తాయి. అవి ఇచ్చే సుఖం తాత్కాలికము కనుక, అవి మానవుడికి తృప్తి నీయలేవు. కానీ, భగవద్విషయం అలాకాదు. అది పరిపూర్ణమైన వస్తువు కనుక, దానిని ఒక్కసారి పొందితే, యిక పరిపూర్ణమైన తృప్తే మిగులుతుంది. అటువంటి సంపూర్ణ ఆనందాన్ని పొందినవారినే ' పూర్ణకాములు, అవాప్తకాములు' అంటారు. శ్రీ స్వామి వారు అటువంటి పూర్ణకాములు. అట్టి గురుపాద సన్నిధి మన నిజమైన పెన్నిధి. గురితప్పని నిజదృష్టికి గురుతు తానే అని తెలుపుతుంది గురుపాద సన్నిధి.

ఆనాడు కౌరవ పాండవులకి ద్రోణాచార్యుడు విలువిద్యను నేర్పిస్తూ, ఒక పక్షి కంటిని కొట్టమని పరీక్ష పెడితే, అర్జునుడు తప్ప మిగతా వారందరూ, 'మీకు ఏమి కన్పిస్తున్నది ?' అని అడిగితే. చెట్టు, ఆకులు, పిందెలు, రెమ్మలు, పక్షిరెక్కలు, తోక– అని అనేకంగా జవాబులిచ్చారు. ఒక్క అర్జునుడు మాత్రం "గురుదేవా! మీరు చెప్పిన పక్షి కన్ను తప్పనాకు వేరేదీ కనబడటంలేదు" అని చెప్పి, బాణాన్ని సంధించి, లక్ష్యాన్ని గురి చూసికొడతాడు. అటువంటి చిత్తేకాగ్రత కలిగివున్న సాధకుడికి అసాధ్యమైనది ఏదీ ఉండదు.

అట్టి నిజదృష్టికి గురుతు ఏదీ అంటే "తానే" అని గురుదేవులు మన హృదయం మీద ముద్ర వేస్తున్నారు. ఆనాడు గీతాచార్యుడు. 'అర్జునా! నేను నీ హృదయంలోనే వున్నాను' అని చెప్పాడు. అస్మద్గురుదేవులు శ్రీశ్రీశ్రీ బాబూజీ మహరాజ్ వారు కూడా, 'నేను మీ హృదయ బాబుని' అని చెప్పుకున్నారు. గురుదేవులు (భగ'ంతుడు) ఒక్కరే మన సొంత ఆస్థి. వారి వద్ద ఉన్న బ్రహ్మాజ్ఞానం మన సొత్తు.

# సన్నిధిలో సంభాషణ

– పరాశర పసాద్

3.7.85

"బ్రహ్మవిద్య అనే ధనాన్ని మనస్సు అనే ఇనప్పెట్టెలో భద్రంగా దాచుకోవాలి. చావు పుట్టుక లేని దానిని సాధించటమే మానవ జన్మ సార్థకత. భగవత్తత్వాన్ని చెప్పుకున్నంత మాత్రాన, విన్నంత మాత్రం చేత చాలదు. మీరు విన్న తత్వాన్ని జాగ్రత్తగా భద్రపరుచుకుని సాధించ గలగాలి. మానవుడు తన ఆమూల్యమైన జీవితాన్ని, ఆయుర్దాయాన్ని, శరీరాన్ని అనిత్యమైన ఆనందానికి ధారపోసి, ఖర్చుచేసి, చివరకి బూడిదను మూట కట్టుకుంటున్నాడు. ఇహంలో అన్నీ కష్టాలే. ఏ కొంచెమైనా ఆనందపడితే అది ఆశాశ్వతమైంది" అన్నారు శ్రీబాబు.



శ్రీబాబు భక్తులనుద్దేశించి ఇంకా మాట్లాడుతూ "ముందుగా మన ఇంద్రియాలన్నింటినీ మన స్వాధీనంలో వుంచుకోవాలి. మానవుడు సత్త్వ రజ స్తమో గుణాలు, ఈషణత్రయాలు ప్రకోపించటం ద్వారా విషయవాంఛల చేత సంకల్పములకు కోరికలకూ దాసుడై అవి సాధించలేనప్పుడు క్రోధము, ఆవేశము కలుగుతాయి. సాధించగలిగితే సంతోషమే.

వీటన్నిటిని కారణము మాయ. భగవంతునికి మానవునికి మధ్య ఏమి ఉంది? భగవంతుని పూజిస్తే ఏమి వస్తుంది? మహాత్ముని స్పర్శ వలన ఏమి వస్తుంది? అనే ప్రశ్నలు సామాన్య మానవునికి కలగటానికి కారణము మాయ. మహాత్ములని పవిత్ర దృష్టితో చూసినవారికి వారి దివ్యచరణార విందముల స్పర్శ మాయని జయించగలిగే శక్తిని ఇస్తుంది. మహాత్ములు పురుషులలోనూ, స్త్రీలలోనూ ఉన్నారు. వారికి చావు, పుట్టుకలు లేవు. సుఖదుఃఖాలు లేవు. కాని మానవుడికి మృత్యువు అంటే భయం. మృత్యువుని జయించాలంటే ఆత్మవస్తువుని తెలుసుకోవాలి.

మానవుడు ఎలా మాట్లాడ గలుగుతున్నాడు? ఎలా చూడ గలుగుతున్నాడు? వీటన్నిటికి సాక్షిగా ఒక శక్తి ఉంది. అదే ఆత్మశక్తి. రేడియోలో బ్యాటరీ శక్తిలేకపోతే పాడలేదు. అలాగే మానవ దేహమునుండి చైతన్యము తప్పుకుంటే అది ప్రేతే.

రేడియోలోని battery శక్తి గురించి ఎలా ఇంజనీరు మాత్రమే తెలియజేయ గలుగుతాడో, అలా ఈ మానవ దేహమును ప్రకాశింపజేసే ఆత్మశక్తిని గురించి మహాత్ములు మాత్రమే చెప్పగలుగుతారు. చైతన్యము తప్పుకున్న తరువాత ఆ ప్రేతని భార్యాపిల్లలు ఎవరైనా ప్రేమించగలుగుతారా? పెద్దమ్మాయికి తండ్రంటే ఎంతో ప్రేమ, కాని ఆయన ప్రక్కన ఇప్పుడు కూర్చోమంటే భయం అంటుంది. ఎంతో కట్నం ఇచ్చి పెళ్ళి చేసిన చిన్నమ్మాయిని తోడుగా ఉండమంటే 'నాన్న బ్రతికుండగా ఒళ్ళోకూర్చున్నాను గాని ఇప్పుడు కూర్చోవాలంటే భయము. పైగా దుర్గంధము కూడా అంటుంది.

మానవుడు జీవభ్రాంతి, దేహభ్రాంతిచేత శరీరాన్నే చూస్తాడు. కాని జ్ఞాని మాత్రం సర్వత్రా ఆత్మనే దరిస్తాడు. జ్ఞానికి స్త్రీ, పురుషుడు అనే భేదము ఉండదు. పరమాత్ముడొక్కడే పురుషుడు. ఎవరైతే పరమాత్మను తెలుసుకుని తదాకారాన్ని పొందుతారో వారే పురుషులు. మనస్సుకి లోబడినవాడు, మాయాశక్తి ఆవరించినవాడు స్త్రీగా పరిగణించబడుతాడు.

ఘటములో ఆకాశాన్ని ఎవరు ప్రవేశపెట్టారు? అలాగే మానవ శరీరము మాతృగర్భంలో ఏర్పడగానే ఆత్మవస్తువుచే ప్రకాశింపబడుతుంది. నాలుగు మాసముల వరకు మాతృగర్భంలో గర్భనరకాన్ని అనుభవిస్తూ పూర్వజన్మస్మృతి కలిగి ఉంటాడు. అప్పడు పరమాత్ముని 'తండ్రీ! నీ ధ్యానాన్ని మరిచిపోను. నాకు ఈగర్భనరకమునుండి విముక్తిని ప్రసాదించు' అని ప్రార్థిస్తాడు. ఏడు మాసముల వరకు మనస్సు నిర్మలమై వుంటుంది. 9వ మాసము నుండి మనస్సు సంకల్పించటం ప్రారంభిస్తుంది. మాతృగర్భము నుండి ఇవతల పడగానే మాయ ఆవరిస్తుంది. ఇదీ మానవ జీవితం!

కాని జ్ఞాని ఎప్పుడూ పరమాత్ముని ఒడిలో బిడ్డయై సమాధిస్థితిలో హాయిని, ఆనందాన్ని పొందుతాడు. మానవుడు జన్మించి కన్నుతెరవగానే ప్రకృతి ఆకర్షణకి లోనౌతాడు. కాని జ్ఞాని కన్ను తెరచి చూస్తే సమస్త జగత్తునూ ఆత్మగానే సందర్శిస్తాడు. సామాన్య మానవుడు ఒక సౌందర్యవతి అయిన స్త్రీని చూస్తే ఆ సౌందర్యానికి ముగ్ధుడై అతని దృష్టి వెనక కామ, క్రోధాది గుణాలు చెలరేగుతాయి. అదే సౌందర్యవతి అయిన స్త్రీని దర్శించినా జ్ఞాని 'అమ్మా! జగన్మాతా! ఏమి నీ సౌందర్యము!' అని నమస్కరిస్తాడు. జ్ఞాని దృష్టి తెల్లనిదీ, స్వచ్ఛమైనదీ. శంకరభగవత్పాదుల వారు సెలవిచ్చినట్లు "జంతూనామ్ నరజన్మ దుర్లభమ్" అన్నది సత్యము. ఎన్నోజన్మల పుణ్యం రాశీ భూతమై లభించిన మానవజన్మని వృథా చేసుకోకండి నాయనలారా!" అని శ్రీబాబు భక్తులకు ఉద్బోధించారు.

# యోగవాశిష్ఠము

-సుషుమ్న ప్రసాద

ఆ ప్రశ్నలకు ముందుగా మంత్రి గారు సమాధాన మిచ్చారు.

"ఓనల్ల  రాక్షసీ! నే చెప్పే సమాధానాలు శ్రద్ధగా విను.

1. – మనసు, జ్ఞానేంద్రియముల కతీతమై, ఆకాశముకన్న సూక్ష్మమైన, అనంతము, అద్వైతమైన బ్రహ్మాముపై, కేంద్రీకరింపబడ్డ నీప్రశ్నలు ఆ పరబ్రహ్మా అణువులలో పరమాణువు. అది శుద్ధచైతన్యము. అపారమైన జ్ఞానమే ఆపరబ్రహ్మా.



2, – పరబ్రహ్మాము లేక పరమాత్మ సర్వవ్యాపకుడు, సూక్ష్మాతి సూక్ష్మము. ఆపరమాత్మ నిరాలంబుడు. బ్రహ్మామునకు లోపల, బయట, అంటూ లేదు. కనుక బ్రహ్మామునే, ఆకాశమని చెప్పవచ్చు. బ్రహ్మాను సాధారణంగా ఆకాశంతో పోలుస్తారు కాని, అది సమంజసమైన పోలిక కాదు. బ్రహ్మాను బ్రహ్మాతో తప్ప మరి దేనితో పోల్చలేము. ఆకాశము స్థాణువు. కాని పరబ్రహ్మాము శుద్ధ చైతన్యము. ఆకాశము మాయా జనితము.

3. – బ్రహ్మా స్వయంప్రకాశకుడు దేశము, కాలము, కారణముల కతీతమైన పరబ్రహ్మాకు విశ్రాంతి ప్రదేశమంటూ లేదు. బ్రహ్మాము సర్వవ్యాపకము. అవిభాజ్యము, అనంతము. కాని ఆ బ్రహ్మాము అన్ని జీవులలో, అంతరాత్మగా, శుద్ధ సత్తుగా నెలకొని యున్నది.

4. – బ్రహ్మామచలము. ఎందుకంటే బయట చరించటానికి ఖాళీ లేదు. పర బ్రహ్మా పరి పూర్ణము. శరీరము అనేక వస్తువులతో, అనుబంధము వలన కదులుతున్నట్లు గోచరిస్తుంది.

5. – బ్రహ్మాము శుద్ధసత్ లేక నిత్యమైన ఉనికి ఉన్నది బ్రహ్మా మొక్కటే. కనుక బ్రహ్మాము తప్ప, తద్భిన్నమైన దేది లేదు. చర్మ చక్షువులకది గోచరించదు కనుక ప్రాపంచిక వ్యక్తులు పరబ్రహ్మాకు ఉనికే లేదంటారు. ఒక దానిని చూసి, యిది

బ్రహ్మమని చెప్పలేము, అందుచేత ఉనికి లేదంటున్నాము.

6. - పరబ్రహ్మశుద్ధ చైతన్యము, స్వయంప్రకాశము. ఆయనజ్యోతికే జ్యోతి. బ్రహ్మము రాతిగా, భూమిగా, ఖనిజంగా, కదలికలేని, అనుభూతి లేక వస్తువులుగా గోచరిస్తుంది. బ్రహ్మమునకు రెండు వైఖరులున్నవి. చైతన్యము, పదార్ధము, పదార్ధమునకు కదలిక లేదు. ఆత్మ శుద్ధ చైతన్యము.

7. - అతి సూక్ష్మంగా ,స్వయం ఉనికి, మచ్చరహితమైన చిదాకాశముపై, అనేకానేక విశ్వములు చిత్రీకరింప బడ్డవి.

8,9,10. - వైవిధ్యముగల, అనేక విశ్వాలన్నీ బ్రహ్మము నుండే ఉద్భవించాయి. అవి బ్రహ్మములోనే ఉనికి కలిగి, సముద్రములోని బుడగల్లాగ, క్రమేపి బ్రహ్మము లోనే లయమవుతాయి. అవి బ్రహ్మము తప్ప, తదితరమేమి కాదు. బ్రహ్మమే, ఆ రూపాల్లో గోచరిస్తుంది.

మంత్రిగారిచ్చిన తెలివైన సమాధానాలతో, కర్కటి తృప్తి చెందింది. అప్పుడు రాజుగారిని తన ప్రశ్నలకు సమాధానములును చెప్పమన్నది. కర్కటి రాజుగారి జ్ఞానపు లోతును పరిశీలంచాలి అనుకొన్నది.

అప్పుడు రాజుగారు ప్రత్యుత్తర మిచ్చాడు. ఉన్నది బ్రహ్మమొక్కటే అంతులేని వైవిధ్యముగల యీ విశ్వాలకు ఉనికి లేదు.ఈ ప్రపంచమంతా సంకల్ప జనితమైనది. సంకల్పాలు పూర్తిగానశిస్తే, ప్రపంచము లయ మవుతుంది. ఈ జగత్తు సంకల్పముల నుండే ఉద్భవించింది. అజ్ఞానము ప్రాపంచిక బంధాలకు మూల కారణము. తద్వారానే, పునరుత్పత్తి, తత్సంబంధమైన చెడు పరిణమిస్తుంది.

*ఒకడి నడుముకు పాము చుట్టుకుంది. కాటువేసేలోగా దాని తల పట్టుకున్నాడు. ఎంత సేపు అలా పట్టుకోవాలి? అది చచ్చేవరకూ పట్టుకో వలసిందే. అలాగే మనసు అమనస్కస్థితిని పొందేవరకూ యోగ సాధన చేయవలసినదే!*

*లాలయితే చిత్త బాలకం. బాలకుని లాలించినట్లు నెమ్మదినెమ్మదిగా మనసును వశం చేసుకోవాలి!*

# శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు

నవంబర్ 13

2 శని నరకచతుర్దశి, మాస శివరాత్రి, సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ

3 ఆది దీపావళి, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, రాత్రి 8గం.లకు టపాసులు కాల్చుట

6 బుధ నుండి 14 గురు వరకు ప్రతిరోజూ ఉదయం శ్రీరామలింగేశ్వర స్వామికి పంచామృతాలు, నవరసాలతో అభిషేకాలు, లక్షబిల్వార్చన.

7 గురు నాగుల చవితి

14 గురు క్షీరాబ్ధి ద్వాదశి, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన

17 ఆది గురుపూర్ణిమ శ్రీసద్గురుపాదపూజ, సత్సంగ సమావేశం, భక్తసమారాధన. రాత్రి 7గం.లకు జ్వాలాతోరణం, శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి నగరోత్సవం.

**నవంబర్ 20 బుధవారం నుండి 1 వ తేది డిశంబర్ వరకు శ్రీ గురుదేవుల పంచవింశతి(25వ) రజతోత్సవ మహాపుణ్యారాధన మహోత్సవాలు పంచ యజ్ఞ విధులతో జరుపబడును.**

**ది. 20.11.13 ఉదయం శ్రీమాతాజీవారిచే ఏకాదశాహ్నిక దీక్షా స్వీకారము; రాత్రి శ్రీ సద్గురుదేవుల పుణ్యారాధన.**

**నిత్య కార్యక్రమాలు**

**1.ఉదయం 3గం.30నిలకు మేలుకొలుపు, సుప్రభాతం; 4గం. నుండి 5గం. వరకు ప్రార్థన, మహామంగళ హారతి; 5గం. నుండి 6గం. వరకు సంకీర్తనతో పాదుకా ప్రదక్షిణ; బ్రహ్మ శ్రీ కొండూరి రామ బ్రహ్మంగారిచే వేదపఠనము; ఆలయ దర్శనము, తీర్థ ప్రసాదములు;**

**2. మధ్యాహ్నం 2.30ని॥లకు - శత సహస్ర నామార్చన శ్రీ సద్గురు పాదపూజ; మహామంత్రపుష్పము, దర్బారు, భక్త సమారాధన.**

**3. శ్రీ గురు పరమాత్మ యాగము.**

**4. అఖండ హరినామ సంకీర్తన.**

**5. శ్రీగురుగీతా ప్రవచనం - జపమాలా ప్రసాద**

**6. ది.21.11.13 నుండి 23.11.13 వరకు బృందావనానికి, ఆలయాలకు**

**కుంభాభిషేకములు.**

**7. ది.24.11.13 నుండి 27.11.13 వరకు సాధు ధర్మ సమ్మేళనము. 27న యతీశ్వరపూజ, సాధుమహాత్ములకు సన్మానము.**

**8. 27.11.13 శ్రీగురుదశమి - శ్రీ గురుదేవుల పుణ్యారాధన;28.11.13 తె.జా 3గం.లకు శ్రీగురుదేవులకు బృందావనంలో నమక, చమక సహిత మహాభిషేకం.**

**9. 28.11.13 నుండి 30.11.13 వరకు సత్సంగ సమావేశాలు - శ్రీ మాతాజీ వారిఅనుగ్రహ భాషణము, భక్తులచే ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయి.శ్రీ సద్గురుదేవుల దర్శనం(వీడియో); శ్రీబాబూజీ వాడిన వస్తువుల ప్రదర్శన (మ్యూజియం)**

విశేష కార్యక్రమాలు

28.11.13 సామూహిక సద్గురు పూజలు, దీపోత్సవం; 29.11.13 డోలోత్సవం (ఊంజల సేవ); 30.11.13 తెప్పోత్సవం

ది.1.12.13 మహామంగళహారతి; దీక్షా విరమణ; స్వామివారి నగరోత్సవం

సాక్షాత్కారం కావాలంటే, సాధన చేసి తీరాలి. ఒకరోజు నేను భావసమాధి స్థితిలో ఉండగా హలధర పుష్కరం (శ్రీరామకృష్ణుల జన్మస్థలమైన కామర్పుకూర్‌లో వారి యింటికి ఎదురుగా ఉన్న పెద్ద చెఱువు) ఒక పల్లెటూరు వ్యక్తి నీటిమీద నాచును తొలగించి, నీటిని పుడికిటిపట్టి మళ్ళా మళ్ళా పరీక్షించటం నా కళ్ళ బడింది.

నాచును తొలగించనిదే భగవంతునిలో నిర్మల భక్తి, ఆయన సాక్షాత్కారము కలుగదని తెలుపటానికే అన్నట్లుగా జగజ్జనని ఆ దృశ్యాన్ని చూపించింది. ధ్యానం, నామస్మరణం, సంకీర్తనం, ప్రార్థన, దాన ధర్మ యజ్ఞయాగాచరణం మొదలైన సత్కార్యాలు భగవత్ప్రాప్తిని కలిగిస్తాయి.

- శ్రీరామకృష్ణ పరమహంస

# గురుకృపా హి కేవలమ్

- రమణ ప్రసాద్

మేడమెట్లు ఎక్కుతుండగా మోహన్ లెనిన్ అనే భక్తుడు " అప్పుడు బాబుగా దర్శనమిచ్చిన నువ్వు ఇప్పుడు అమ్మగా అలరిస్తున్నావా" అని మనసులో అనుకొటమే తడవుగా " అప్పటి ఏక వస్త్రానికీ, ఇప్పటి చీరకు తేడా ఉందా ఏమిటి?" అని చిరునవ్వు నవ్వారట శ్రీ మాతాజీ. శ్రీమాతాజీ వారి సర్వజ్ఞతకు మోహన్ లెనిన్ బ్రహ్మానందం పొందాడు.

కుట్టి (ఎన్.వి.బాల సుబ్రహ్మణ్యం) అనే భక్తుడు " శ్రీమాతాజీ కనుకశ్రీ బాబూజీ వారి స్వరూపమే అయితే, ఆమె తనంతట తానే నాకు దర్శనం ఇచ్చి పలుకరించాలి" అని నిర్ణయించి రోడ్డుమీద నడుస్తూ పోతున్నాడు. ఒక ఇంటి గేటి దగ్గర నిలబడి కారెక్కబోతున్న శ్రీ మాతాజీ కుట్టిని చూసి "నీ కోసమే చూస్తూ నిలబడ్డానయ్యా!ఏమిటి ఆలోచిస్తున్నావు?" అని అడిగేసరికి కుట్టికి దివ్యమైన ఆనందం కలిగి అమ్మకు అక్కడికక్కడే పాదాభివందనం చేశాడు.

నింద్రకొలను నివాసి అయిన బండారు హనుమంతు అనే భక్తునికి మూత్రపిండంలో నెప్పి వచ్చింది. డాక్టర్లు " ఆపరేషన్ చేయాలి" అన్నారు. ఆపరేషన్‌కు కావలసిన ద్రవ్యాన్ని సమకూర్చుకోవటానికి ప్రయాస పడుతున్నాడు. అలా ఆలోచిస్తూ, తుండు కట్టుకొని స్నానానికి వెళ్ళబోతూ శ్రీమాతాజీ వారి కారు ఆగటం చూసి తుండు కట్టుకునే వరండాలోకి వచ్చాడు. శ్రీమాతాజీ అతనిని కుశల ప్రశ్నలు వేశారు. హనుమంతు సమాధానంగా తాను ఆపరేషన్ చేయించుకోవటానికి చేస్తున్న ఏర్పాట్లను గురించి చెప్పాడు. హనుమంతు మధ్య తరగతి కుటుంబీకుడు. మాయ, మర్మం తెలియనివాడు.

" ఆపరేషన్ సంగతి తరవాత చూద్దువుగాని ముందు స్నానం చెయ్యి. తుండుగుడ్డతో ఎంతసేపు అలా నిలబడుతావు? అని పిడికిలితో హాస్యానికి పొడిచినట్లు నవ్వుతూ హనుమంతు డొక్కలో ఒక్కపోటు పొడిచారు శ్రీమాతాజీ. ఆ రోజు సాయంత్రమే అమ్మ అక్కడనుంచి ఆశ్రమానికి బయలుదేరి వెళ్ళిపోయారు.

మర్నాడు మూత్రపిండాల ఆపరేషన్‌కోసం డాక్టర్ దగ్గరకు వెళ్ళాడు

హనుమంతు. మళ్ళీ పరీక్షలు చేయించుకొని రమ్మని చెప్పాడు డాక్టరు. ఆయన చెప్పిన పరీక్షలు చేయించుకొని డాక్టరు దగ్గరకు వెళ్ళాడు హనుమంతు. ఆ ఎక్స్‌రేలను, స్కానింగ్ రిపోర్టులను చూసి డాక్టరు విస్తుపోయాడు. అంతకుముందు రిపోర్టులతో పోల్చి చూశాడు. అంతకుముందు ఉన్న రిపోర్టుల ప్రకారం ఆపరేషను తప్పనిసరే కాక ఏమాత్రం ఆలస్యం చేసినా ప్రమాదకరం. కాని ఆ రోజు చేసిన పరీక్షల రిపోర్టు ప్రకారం చూస్తే, అసలు వ్యాధే లేదు. ఆపరేషన్ అవసరం లేకపోయేసరికి, మందులు వాడవలసిన అవసరంలేదు అని తేల్చారు డాక్టరు. ఈ మార్పు ఎలా సంభవం?

"అంతా అమ్మ దయ" అని స్పష్టంగా చెపుతాడు హనుమంతు.

*సోఽహం - దాసోఽహం - దాసదాసోఽహం*

*రాత్రిపూట ప్రయాణం చేస్తున్న బాటసారి ఒక ఇంటి అరుగు మీద పడుకుని నిద్రపోయాడు. అతడు అద్వైతి. ఆ యింటి యజమాని వైష్ణవుడు. తెల్లవారి లేచిచూస్తే అద్వైతికి ఆ యింటి గోడమీద నామాలు కనిపించాయి.*

*అతడు వెంటనే జేబులో నుంచి పెన్సిల్ తీసి ఆ నామాల ప్రక్కన సోఽహం అని రాశాడు. అది చూసిన వైష్ణవుడు తక్కువ తిన్నాడా! ఆ సోఽహం ముందు 'దా' చేర్చి, దాసోఽహం చేశాడు.*

*బాటసారికి పట్టుదల పెరిగింది. బాగా ఆలోచించి దాసోఽహం ముందు 'స' చేర్చి సదాసోఽహం చేశాడు.*

*ఇంటి యజమాని మళ్ళీ 'దా' చేర్చి. దాన్ని దాసదాసోఽహం చేశాడు. బాటసారి మళ్ళా 'స' చేర్చాడు. అప్పుడు సదాసదాసోఽహం అయింది. మొత్తానికి యిద్దరి పట్టుదలతో గోడ కరాబు అయింది.*

# పరిప్రశ్నేన సేవయా

– పరాశర ప్రసాద్

"ప్రత్యక్షో గురురూపేణ వర్తతే భక్తి సిద్ధయే' అని చెప్పుకోవటం వరకేనా? అవ్యక్తంగా ఉండి ప్రేమించేవాడు భగవానుడు. అనుక్షణం ఆయనతోనే ఉండి ఆయన సంరక్షణలోనే పెరుగుతూ, ఆయన అనుగ్రహంతో సంచరిస్తూ ఆయన్ని ఎలా మరచి పోతున్నారు?" అన్నారు సద్గురుదేవులు.



ఇంకా మాట్లాడుతూ "అవ్యక్తంగా ఉన్న భగవానుడు సద్గురుమూర్తిగా అవతరించి, వచ్చి, ప్రేమించి, బోధిస్తే ఆనందిస్తున్నావు గాని, ఆయనే యీయన అని మీరు గుర్తించ గలుతున్నారా? అలా గుర్తించటమే జ్ఞానం. మానవుడు వివేకం లేక, సంస్కారహీనతచేత మనస్సుకి ఆవరించిన వాసనలచేత, గుణహీనుడై ప్రవర్తిస్తాడు.

ఒక తక్కెడలో సరుకు, మరొక ప్రక్కన తూకపురాళ్ళు వేశామనకో! ఏది బరువైతే ఆ ప్రక్కకు మొగ్గు చూపుతుంది కదా! అలాగే మనో మాలిన్యం బలవంతమైతే వివేకం దాని ముందు తేలిపోతుంది. ఆ క్షణంలో ఆ వ్యక్తి వివేకశూన్యుడై ప్రవర్తిస్తాడు. వివేకశూన్యుడైన మానవుడు మదపుటేనుగు లాగ ఎంత దేహదారుఢ్యం కలిగి ఉన్నా ఏం లాభం? బుద్ధిహీనుడై ప్రవర్తిస్తాడు. మూడు లోకాలు జయించి, ముల్లోకాలకు అధిపతి అయ్యాడు. కాని ఏం లాభం? మూడు గుణాలను జయించలేకపోయాడు హిరణ్యకశిపుడు. ఎంత బలగం ఉన్నా, వివేక శూన్యుడయ్యాడు.

నారాయణుడు సర్వవ్యాపకుడు అని తన కుమారుడు ప్రహ్లాదుడు ఎంత చెప్పినా, తనలో ప్రకాశించేది ఆయనే అన్న విషయం గ్రహించక స్తంభంలో ఉన్నాడా? అని ప్రశ్నిస్తాడు. అదే వివేకం లేకపోవటం అంటే. ఎంత నచ్చచెప్పినా నమ్మడు. విశ్వాసం సన్నగిల్లిన మానవుడి ప్రవర్తన అలాగే ఉంటుంది. అందువలన 'ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా' అన్న విషయం గుర్తించిన సాధకుడే విశ్వాసంతో సద్గురుమూర్తిని ఆశ్రయించి, కృతార్థుడైన వాని జన్మ సార్థకమవుతుంది. ఇది మాత్రం అక్షరాలా నిజం." అన్నారు శ్రీబాబు.

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

"అయితే నాలుగు రోజులాగి రమ్మన్నాడుగనక మన ప్రయాణం ఆపు కుందాము. ఎలాగో కాలం వెళ్ళ దీస్తే మనం మధురకి చేరి స్థిరపడవచ్చు" అన్నాడు భార్యా పిల్లలతో పున్నయ్య."అయ్యా! పట్టుబడితే బంగారం పండుతుంది అన్నాడు గదయ్యా! తను నిజమే చెప్తానన్నాడు గదా! పోనీ మన పొలాన్ని సాగు చేసుకొని పంట పండించుకొంటే -అని నారయ్య ఆగాడు తండ్రి మెహం వంక చూస్తూ. ఆకళ్లు తీవ్రంగా ఉన్నాయి."అయితే ఇబ్బందులు పడుతూ ఇక్కడే ఉండిపోదామనా నీ ఉద్దేశం." అన్నాడు గట్టిగా పున్నయ్య.



"ఏమోనయ్యా! ఆకిట్టయ్య మాటే వేదం అని నాక్కూడా అనిపిస్తోంది." అని నారయ్య తలొంచుకొని చెప్తుంటే మబ్బులు మూసుకొచ్చి జోరున వర్షం మొదలైంది. అది కుంభవృష్టి అయి ప్రయాణానికి ఆటంకం కలిగింది.

"నేలకి సిరి కలిగేలా బంగారమంటి వాన పడింది.అందరు పొలం పనులకు నడుం కడుతున్నారు. మన అదృష్టం పరీక్షించుకుందాం. ఇరుగు పొరుగులు సాయం చేస్తామంటున్నారు, నేను నా శక్తి వంచన లేకుండా శ్రమపడతానయ్యా!" అని నారయ్య తండ్రిని ప్రాధేయపడ్డాడు. పిల్లాడిమాట కొట్టిపారేయ లేక పోయాడు పున్నయ్య.

నందబాలుడు రమ్మన్నాడని వెడదామనుకుంటుంటేనే అనుకోకుండా పది రోజులు గడిచి పోయాయి.అప్పుడే ఇంకో చిత్రం జరిగింది. "నేను ఆవుల కొట్టానికి వెడితే ఆశ్చర్యంగా ఎండి పోయాయనుకున్న ఆవుల చనుకట్ల వెంట పాలబొట్లు కారుతున్నాయి నాకళ్ళను నేను నమ్మలేకపోయాను" అంది వసుమతి తండ్రితో. మన కర్రి గోవు అదిప్పుడు చూలింత! మనం గమనించలేదు! అన్నాడు నారయ్య పున్నయ్య కళ్ళు వెడల్పయినాయి. మేనమామ చెంచయ్య కబుర్లు పంపుతున్నాడు పున్నయ్యని రమ్మని. సకాలంలో వర్షాలు కురిసి పైర్లు ఎదిగి వస్తున్నాయి. గోవులు పాలిస్తున్నాయి. ఇప్పుడెలా వెళ్ళటం? కాదంటే మామకి కోపం వస్తుందేమో?

జంకుతూనే బృందావనానికి బయలు దేరాడు కొడుకుతో పున్నయ్య మధ్యాహ్నం అయిందప్పుడు. పిల్లలంతా చెట్ల నీడలోచేరి మూటలు విప్పి అన్నాలు తింటున్నారు,పూల రేకుల మధ్యలో బొడ్డులాగా ఉన్నాడు వాళ్ళ మధ్యలో నందకుమారుడు.అందరికీ తను పెడుతున్నాడు అందరూ పెడుతుంటే తను తింటున్నాడు. పున్నయ్య కళ్ళ ప్పగించి చూస్తూ నిలబడిపోయాడు.ఎంత అందంగా ఆనందంగా ఉందా దృశ్యం?

"ఏమయ్యా! మధురానగరానికి ఎప్పుడు ప్రయాణం? అక్కడి రాజభోగాలు నగర విహారాలు గుర్తొస్తున్నాయా? ఇక్కడికి వచ్చినప్పటి నుంచీ నీకు లోటు లేకుండా నోటికి ముద్ద అందుతూనే ఉంది కదా! అది ఎవరి దయ? మీ మధురానగర ప్రభువు అనుగ్రహమా? లేక ....." కిష్టయ్య మాటలు వింటూసిగ్గు పడి పోయాడు పున్నయ్య.

నీ దశబాగుపడింది గనకే నువ్వు మధురనుంచి తిరిగి వచ్చావు.అది నువ్వు నమ్మితే" లేదంటే కాదంటే నిక్షేపంగా నువ్వు మధురానగరానికి తరలి పోవచ్చు. సరే కానీ ఇదిగో! దా! యీచేతి ముద్ద అందుకో! పున్నయ్య కళ్ళు తెరిపించిన ఆమాటలతో ఆ తెరచిన కళ్ళ నిండా ఆనందాశ్రువులు నిండి పొంగి పొర్లుతూంటే చేతులు జోడించి "నీ దయ లేక పోతే మాకు ఎవరి దయ ఉండి ఏమి లాభం? నీ దయ సంపూర్ణంగా ఉన్న మాకిప్పుడు ఇతరులతో ఏం పని?" అంటూ కిట్టయ్య అందించిన ముద్దను దోసిలిపట్టి అందుకొని కళ్ళకద్దుకుని నోట్లో వుంచుకున్నాడు.

తనను నమ్ము కున్న వాడికి ఏలోటు రానివ్వడయ్యా దేముడు ఆ విశ్వాసం ఉండాలి మరి" అన్నాడు కిష్టయ్య మందహాసం చేస్తూ .

"అంతటి దయ మాపై చూపిస్తున్న ఆ దేముడు నువ్వేగదయ్యా!" అని పున్నయ్య. మరో ముద్ద కోసం కిట్టయ్య వేపు చేతిని చాస్తూ అనే వేళ పున్నయ్య చేతిలో ముద్దని పెట్టక పోయేసరికి చివుక్కుమన్న మనస్సు చిన్నబుచ్చుకునేంతలో వాని నోట్లోనే పెట్టాడు తన ప్రేమామృతాన్నంతనూ ముద్దగా చేసి కిట్టయ్య!.

నమ్మిన వారి సొమ్ముగదా!

(గత సంచిక తరువాయి)

# సర్వము నీ దయ

- సుశీలా ప్రసాద

శ్రీవర్ధనుడు అడవిలోనుంచి రాజబాట మీదుగా పరుగులెత్తేసరికి సంధ్యా కాలము ముగిసి రాత్రి కావచ్చింది. వాని మనస్సులో నిరాశ అంధకారం అలముకున్నట్లు చుట్టూ చీకటి కమ్ముకుంది. బాట ప్రక్కన పచ్చిక మీద తెలివి తప్పి పడి పోయాడు అతడు. కొంతసేపటికి తేరుకుని చుట్టూ కలయచూశాడు. రాజ మార్గానికి కొంచెం దూరంలో చీకటిని తొలగిస్తూ వెలుగు కనబడ సాగింది.

శ్రీవర్ధనుడు ఆత్రంగా లేచి నిలబడి పరికించి చూడగా అది ఒక రత్నాల పల్లకీని పరివేష్టించి నడుస్తున్న వారి చేతులలోని కాగడాల వెలుగు, వారి వెనక ఆయుధపాణులైన భటులు బారులుతీరి నడుస్తున్నారు. శ్రీవర్ధనుడు వారు ధరించిన రాజ చిహ్నాలను గమనించి ఆ పల్లకీలో తన సామంతరాజు అయిన రాజసేనుడు వున్నాడని గ్రహించాడు. ఆనాడు తనకు కలిగిన క్లేశాలలో వివేక శూన్యమైన మనస్సుతో చక్రవర్తి ఆ బృందాన్ని చూస్తూ వారంతా తన విరోధులతో కలిసి తన పతనానికి పన్నాగాలు పన్నుతున్నారేమో అని సందేహించాడు.

వెంటనే కోపంతో మండిపడుతూ ఎలుగెత్తి బిగ్గరగా " ఓ సామంతరాజా! నా శత్రువులతో మైత్రికి వెడుతున్నావా? నీ చక్రవర్తికి ప్రపంచమంతా ఎదురు తిరిగినట్లు అనిపిస్తున్నది. ఓ వృద్ధజంబుకమా! నువ్వు రాజద్రోహివై ఆ మహా వ్యధను రెట్టింపు చేస్తున్నావా?" అంటూ అనేక విధాల నిందించ సాగాడు. ఆ రాజభటులు దగ్గరికి రాగానే ఒకడు ముందుకి వచ్చి "ప్రభువు నెదిరించి మాట్లాడుతున్నావా? జాగ్రత్త! " అని కత్తి తీసి ఝులిపించాడు.

అప్పుడే పల్లకీ రాజు ముందుకి వచ్చింది. దీపాల కాంతులలో గత దినం తనతో ఎంతో గౌరవంగా మాట్లాడిన సామంత ప్రభువు యిప్పుడు కిరీట హీనుడై తనను చాలా కఠినంగా అంటరాని వానిని చూసినట్లుగా చూడటం అగపడింది. ఆ పిమ్మట ఆ సామంతుడు, " ఓ మనిషీ! నీ మాటలు చాలా వెగటుగా ఉన్నాయి, నా వలనగానీ, నా ప్రజలవలనగానీ, నీకు ఏవిధంగా నైనా అపకారం జరిగితే నువ్వు రేపు వుదయం నా న్యాయ సభకి వస్తే నీకష్ట సుఖాలను విచారించగలను. మనోక్లేశం వలన కాబోలు నువ్విలాగ ఉన్మత్తుని వలె వాగుతున్నావు" అని పలికిన రాజసేనుని కరుణాపూరిత వాక్యాలకు శ్రీవర్ధనుడికి అగ్నికి ఆజ్యం పోసినట్లయింది.

-సశేషం

# భగవానుడు మనకెంత దూరం?

– వశిష్ఠ

(శ్రీ సద్గురుదేవుల సత్సంగ ప్రసాదము)

భగవానుడు తప్పక మనకు మారుపలుకగల రీతిలో, మనయందు భక్త్యావేశము ఉండటం అవసరం. గట్టి కంకర రాయిని మనం నీటిలో వుంచితే అది ఎప్పటికీ గట్టిగానే ఉంటుంది. నీటిలో కరుగదు. నీటిని పీల్చుకోదు. అలాగే కఠిన శిలా సదృశమైన మానవుడు సంసారం మధ్యలో ఉన్నా, సంసారం అతనికి అంటుకోదు. అతను సంసారంలో లీనం అవడు. దృఢభక్తి పూరితుడై, చలించకుండా అలాగే ఉండిపోతాడు. అలా కాకుండా ఆ నీటిలో వేసింది యిసుక పెళ్ళ అయితే కనుక అది మెత్తపడి త్వరగా నీటిలో కలిసిపోతుంది. చలించే భక్తుడు మరల సంసార గుండంలో మునిగి పోతాడు.



కోడిని నీటిలో పడవేస్తే అది చచ్చిపోతుంది. హంస అలాకాక హాయిగా నీటిలో యీదుతుంది. ఐహిక విషయాలనే సంసార సుడిలో మునిగి పోతాడు మానవుడు. రామకృష్ణ పరమహంస వంటి మహాత్ములు సంసారంలో ఉన్నా లేనట్లే ఉంటారు. అటువంటి మహాత్ములు ఎల్లరిపైనా కరుణావర్షాన్ని కురిపిస్తూ వుంటారు. అయితే, కొందరు తమ హృదయ కవాటములను మూసి ఉంచుకుని, ఐహిక విషయ చిత్తులై సద్గురువులకు అందులో చోటు యివ్వరు. అయినా ఆయన తమ కష్టాలు తొలగించలేదని, పైపెచ్చు నింద వేస్తారు కూడా. దోషం తనదై ఉండగా, గురువును నిందించటం అన్యాయం కదా! నీ గది తలుపులు, కిటికీలు మూసి ఉంచుకుని, వెలుగును ప్రసరింప జేయలేదని సూర్యుని నిందిస్తే తప్పు ఎవరిది?

దంపతులిద్దరు కలకత్తా నుండి వచ్చారు. వారి పిల్లవాడు మాత్రం కలకత్తా స్టేషన్ జన సమూహంలో తప్పిపోయాడు. ఆ తల్లిదండ్రులకు మనసులో ఎంత ఆదుర్దా ఉంటుందో ఊహించుకోవచ్చు. అయినా వారు దృఢమైన గురుభక్తి కలవారగుటచే తమ గురుదేవుణ్ణి ప్రార్థించుకున్నారు. పరమపితను పోలినవారైన తమ గురుదేవులు తన బిడ్డలను సదా కాపాడుతూనే ఉంటాడు. ఏ ఒక్కరూ ఆయన దృష్టి పథం నుండి తప్పిపోజాలరు. ఆందోళనతో కొంతకాలం గడిచిన మీదట ఆ తప్పినపోయిన కుమారుడు కడకు తల్లిదండ్రుల దగ్గరకు చేర్చబడ్డాడు. అప్పుడు ఆ తల్లిదండ్రులు

పొందిన ఆనందం, గురుదేవుని యెడల కృతజ్ఞత ఎట్టిదో ఊహించవచ్చు.

నీకు జన్మనిచ్చినవారెవరైననూ జనన పరంపర నుండి నిన్ను రక్షించ జాలని తల్లిదండ్రులకే నీ యెడల యింత ప్రేమ ఉంటే, జన్మ పరంపర నుండి కూడా నిన్ను రక్షించగల, ఆ గురుదేవునికి గల ప్రేమ ఎంతటిదో ఊహించ గలమా!

భగవానుని నీవు భక్తితో సేవిస్తే, ఆయన నిన్ను మరింత ఎక్కువగా ప్రేమిస్తాడు. నీది దృఢమైన భక్తి కావాలి. ఆయనకు యిష్టమైన పనులే చేస్తూ, యిష్టంకానివి మానివేయాలి. అదే నీవు ఆయన్ను సేవించే పద్ధతి.

ఇక ఆయన నిన్ను ప్రేమించే రీతి ఏమిటంటావా, సకలోపద్రవాల నుండి నిన్ను కాపాడతాడు. అభ్యుదయ నిశ్శ్రేయములు నీకు కలుగులాగున నీకు శరీరారోగ్యమును, మానసిక స్వస్థను కలిగించి, ఉత్తమ భావాలను నీలో ఉద్దీపింపజేస్తాడు. విపత్తుల నుండి నిన్ను తప్పిస్తూ, జీవిత విషమ సమస్యల పరిష్కారానికి నీకు మార్గాలు చూపుతూ కంటికి రెప్పవలె రక్షిస్తాడు.

పగటిపూట నక్షత్రాలు నీవు చూడలేనంత మాత్రాన అవి లేవని చెప్పకూడదు కదా! సూర్యుని వెలుగులో నీ కన్నులు వాటిని చూడలేక పోతున్నాయి. అదే రీతిలో నీ చర్మచక్షువులతో భగవానుని నీవు చూడలేక పోతే, ఆయన లేనేలేడని చెప్పకూడదు. అహంకార మమకార పొరలు, నీ కనులకు కప్పి ఉన్నాయి. ఆ పొరలు కరిగి, ఆయనను నీవు చక్కగా చూడ గలగటానికి ఆయన కొరకే నిరంతరం కన్నీరు కార్చు.

నిప్పుపుల్లలో నిప్పు ఉంది. కాని, అది వాటిని పగలగొడితే బయటకు రాదు. నిప్పుపుల్ల మొనను మందు పూతగల నిప్పుపెట్టె పార్శ్వమునకు ఆనించి గీస్తేనే నిప్పు పుడుతుంది. అలాగే నీ మనస్సుకు భగవన్నామ స్పర్శను కలిగించి ధ్యానం ద్వారా రాపిడి పెట్టినప్పుడే ధ్యానాగ్ని ఆవిర్భవిస్తుంది. భగవానుని నీకు కానరానీయకుండా చేస్తున్న అన్ని పొరలను అగ్ని దహించి వేస్తుంది. అప్పుడు నీకు భగవానుని చక్కగా చూడగలుగుతావు. చూడ గలగటమే కాదు, ఆయనతో ఏకమైపోగలవు కూడా. భగత్కృప మీ యెల్లరిపై చక్కగా ప్రసరించుగాక!!

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

– విజయేశ్వరానంద ప్రసాద్

**శ్రీలలితానంద సరస్వతీస్వామి (గురువుగారు)తో శ్రీబాబు**

"మీకు పునర్జన్మ ఉన్నదంటారా ? లేదంటారా ? "

తన అంతేవాసి అంతరంగంలోని లోతులేమిటో పరీక్షించటానికి సత్య గురుదేవులైన శ్రీ బాబు వేసిన ప్రశ్న యిది.



"పునర్జన్మ ఉన్నదా, లేదా అనే చింత నాకు లేదు. నాకు పునర్జన్మ ఉంటే, నా కోసం మీకు మళ్ళీ అవతారం తప్పదు. ఆ అవసరం ఉందో, లేకుండానే చేసుకుంటారో, అది తమ నిర్ణయమే".

తనదంటూ ఏమీ లేకుండా సర్వ సమర్పణ చేసుకున్న నిజ శిష్య పరమాణువు (శ్రీ లలితానంద సరస్వతీ స్వామి) చెప్పిన జవాబు యిది.

శ్రీ లలితానంద సరస్వతీ స్వామి వారి పూర్వాశ్రమ నామధేయం 'హనుమత్ జయప్రద', ఇంట్లో అందరూ ఆమెను 'హనుమాయమ్మ' అని పిలిచే వారు. ఆమె శ్రీబాబు శ్రీ చరణాలను ఆశ్రయించిన తరువాత, ఆమెను అందరూ గౌరవంతోనూ అభిమానంతోనూ పిలుచుకున్న పేరు 'గురువుగారు', శ్రీ బాబు సామాన్యంగా ఆమెను ' హనుమాయమ్మ' అనే పిలిచే వారు. సరదాగా ' గురువుగారు ! ' అని కూడా పిలుస్తూ వుండేవారు.

గురువుగారి స్వగ్రామం ఒంగోలు. అయిదుగురు అప్ప చెల్లెళ్ళలోనూ ఆవిడ జ్యేష్టురాలు. వివాహం జరిగి, ఒక పుత్రిక కలిగాకే, విధివశాత్తు ఆమెకు వైధవ్యం సంప్రాప్తమైంది. ఉత్తమ సంస్కార బలం చేత ఆమె ఆ అశనిపాతాన్ని ఒక మహదవకాశంగా మలుచుకొని, జన్మరాహిత్య స్థితిని పొందవలెనని నిశ్చయించుకున్నారు. ఆమె పెద తల్లిగారు అపారమైన అద్వైతజ్ఞాన సంపన్నులు. వారు ఒంగోలులో ' లలితాశ్రమము ' అని పేరుగల ఆశ్రమమును స్థాపించి, ఆశ్రమ వ్యవస్థాపక పీఠాధిపతులుగా నిరంతర తత్త్వ చింతనలోనూ ప్రబోధముతోనూ కాలం గడిపేవారు. హనుమాయమ్మగారు వారి వద్ద అత్యంత శ్రద్ధా నిష్ఠలతో అధ్యయనం చేసి, ఉపనిషత్తులు, వివేక చూడామణి, రహస్య త్రయము, ప్రస్థాన త్రయము, శ్రీ సీతారామాంజనేయ సంవాదము, వశిష్ట గీత మొదలైన అద్వైత గ్రంధాలలో విస్తారమైన పాండిత్యం

గడించారు. వారి పెద తల్లిగారి వలెధాటిగా తత్త్వోపన్యాసాలు కూడా చేసేవారు. అంతేగాక శ్రీ కందర్ప శ్రీరాములుగారి పేరుతో విజయవాడలో స్థాపితమైన 'శ్రీరామానంద విద్యా పీఠము' లో, శ్రీరాములుగారి శిష్యబృందమతో తరచుగా సత్సంగ సమావేశములలో పాల్గొనేవారు. తమ పెద తల్లిగారు బ్రహ్మైక్యం పొందిన తరువాత, హనుమాయమ్మగారు లలితాశ్రమ పీఠాధిపతులై, 'శ్రీ లలితానంద సరస్వతీ స్వామి ' అనే ఆశ్రమ నామధేయం పొందారు.

హనుమాయమ్మగారి చివరి చెల్లెలు కుమారి ఇందిరా దేవి గుంటూరు ప్రభుత్వ కళాశాలలో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేసే వారు. 1959 సెప్టెంబర్‌లో వారి పెద తల్లిగారు హఠాన్మరణం పొందిన నాటి రాత్రే యిందిరను ఒక బ్రహ్మరక్షస్సు ఆవేశించింది. ఇందిర రక్త వమనాలతోనూ, ఆయాసంతోనూ విపరీతంగా బాధపడింది. ఎందరి వైద్యులకూ ఆ వ్యాధి లొంగలేదు. గ్రహశాంతులను గూర్చి బాగా తెలిసిన, వారి మేనమామగారిని సంప్రదించగా, అది శారీరక రుగ్మత కాదనీ, గ్రహ బాధ అని, చాలా శక్తివంతులైన శ్రీ నరసింహ ఉపాసకులు గాని శ్రీ కాళీ ఉపాసకులు గాని మాత్రమే ఆ గ్రహ పీడను నివృత్తి చేయగలరనీ వారు చెప్పారు.

గుంటూరులో ఆనందతీర్థ అగ్రహారంలో ప్రసిద్ధ హనుమదుపాసకులైన శ్రీ హనుమద్దాసుగారి వద్దకు ఇందిరను తీసుకొని వెళ్ళి చూపించారు. అది ఒక బ్రహ్మ రక్షస్సు ఆవేశించటం వలన కలిగిన గ్రహ బాధ అని వారు చెప్ప గలిగారు. కొంత తాత్కాలిక వుపశాంతి కూడా వారి వలన కలిగింది. కాని ఇందిరకు మళ్ళీ వ్యాధి పూర్తిగా తిరగ బెట్టింది.

ఒకనాడు గురువుగారు శ్రీ నేలనూతుల విశ్వనాధం గారితో ఇందిర గ్రహ బాధను గురించి మాట్లాడుతున్నారు. విశ్వనాధంగారు కూడ శ్రీరాములుగారి అద్వైత సంప్రదాయానికి చెందిన వారే. వారికి శ్రీ బాబు విషయం తెలుసు. వారు గురువుగారితో "హనుమత్కాళీ వర ప్రసాద బాబుగారని సమర్థులైన కాళీ వుపాసుకులున్నారు. వారిని సంప్రదిస్తే మేలు జరగవచ్చు" అన్నారు. గురువుగారికి ప్రాణం లేచి వచ్చింది. " వారి ఆ చూకీ తెలియజేయండి " అని విశ్వనాధంగారిని అడిగారు. శ్రీ బాబు యితరుల మనస్సులలోని భావాలను గ్రహించగలరని తెలిసిన విశ్వనాధంగారు,యీ వ్యవహారంలో తలదూర్చటం యిష్టం లేకనో ఏమో, "నేనూ ఆనోటా ఆనోటా వారిని గూర్చి వినటమే గాని,వారి ఆచూకీ నాకు తెలియదు. పైగా వారు మనకు అందు బాటులో ఉండేవారు కాదు " అని తప్పించుకున్నారు. గురువుగారు ఎంత బతిమాలినా ప్రయోజనం లేకపోయింది.

-సశేషం

# శ్రీబాబూజీతో, శ్రీమాతాజీతో అనుభవాలు

-పాలూరి వెంకటరమణ

## 1. విశ్వసించు – తరించు

విశ్వాసముతో కూడిన భక్తుడు గురువును, గుణరహితుని గాను, నిరాకారునిగాను ఎల్లప్పుడూ గుర్తించాలి. గురుతత్త్వము అర్థమైన వానికి గురు రూపంతో పని లేదు. అట్టి సాధకుడు నిరాకారంగా విశ్వవ్యాప్తమైన గురుతత్త్వాన్ని గ్రహించగలడు, ఆనందించగలడు. పూజ్యశ్రీ మాతాజీ అనేక పర్యాయాలు యీ సంగతిని వివరించారు.

సద్గురుదేవులు అయిన శ్రీబాబు 'మాతాజీ' రూపంలో మన ఎదురుగానే వున్నారని భక్తులు గ్రహించాలి. ఈ గ్రహింపు రావాలంటే దానికి తగిన శక్తిని, జ్ఞానాన్ని కలుగ చేసేది గురుదేవులే. శ్రీమాతాజీతో, శ్రీబాబుతో ఎందరో భక్తులు ఎన్నెన్నో అనుభవాలను పొందారు. అది గురుశక్తి ప్రభావం. గురుశక్తి అపారమైనది.

నా వయస్సు 82 సం॥ లు. తిండి విషయంలో ఎంత జాగ్రత్తగా వున్నా, ఎంత మంది డాక్టర్లను ఎన్ని మార్లు కలిసినా, ఎన్ని మందులు వాడినా పై బడుతున్న వయస్సు వల్ల కొన్ని శారీరక బాధలు తప్పవు కదా! సుమారుగా ఒక సంవత్సరం నుండి నాకు రోజూ కడుపులో మెలిపెట్టినట్లున్నది. ఆఁ దానిదే ముందిలే, అదే తగ్గిపోతుందిలే అనుకుని కొంతకాలం ఆ బాధను లెక్కచెయ్య లేదు. దాన్ని లెక్క చెయ్యకపోవడంతో, ఆ బాధకు కూడా కోపం వచ్చిందన్నట్లుగా, బాధ ఎక్కువ అయింది. భరించడం కష్టమయింది. శ్రీమాతాజీ అమెరికా వెళ్ళాక, జూన్ 2013లో నేను విజయవాడ వెళ్ళి 'ఎండోస్కోపీ' పరీక్ష చేయుంచుకున్నాను. "ప్రేగులో చిన్న పుండు లాంటిది వుంది. ముందు జాగ్రత్తగా ఆపరేషను చేయించుకుంటే మంచిది" అని డాక్టర్లు, వారి అభిప్రాయం చెప్పారు. కొన్ని మందులు వ్రాసి, ఈలోపు వాడమన్నారు. అవి వాడాను.

షుగర్ వ్యాధి ఉండటంతో, ' ఈ వయస్సులో ఆపరేషను చేయుంచు కోవడం ఎంతవరకు సబబు? ' అని ఆలోచించాను. ఎటూ నిర్ణయుంచుకోలేక పోయాను. చివరికి వేరే నిర్ణయానికి వచ్చాను. శ్రీ మాతాజీ అమెరికా నుండి వచ్చాక, అమ్మకు

చెప్పి, వారు ఎలా చెప్పితే  అలా చేద్దామనుకున్నాను. దానితో ఆపరేషన్ గురించిన ఆలోచనలేక మనస్సుకు ప్రశాంతత కలిగింది.

శ్రీ మాతాజీ అమెరికా నుంచి 21-07-2013న ఆశ్రమానికి తిరిగి వచ్చారు. భక్తులందరూ సాదరంగా, ప్రేమగా, భక్తిపూర్వకంగా ఆహ్వానించారు.  భక్తులను పలుకరించిన మాతాజీ బృందావనానికి వెళ్ళారు.  శ్రీబాబూజీని దర్శించుకుని, పుష్పమాలతో అలంకరించి, నమస్కారం చేసుకుని, శ్రీ మాతాజీ ఆశీనులయ్యారు. భక్తులు శ్రీ మాతాజీకి పాద ప్రక్షాళన చేసి, హారతి ఇచ్చారు. నేను వెళ్ళి, నా బాధ గురించి మాతాజీకి చెప్పుదామనుకున్నాను. కాని, వారు ప్రయాణంచేసి  రావడంతో బడలికగా ఉంటారు కాబట్టి, అనవసరమైన చనువు తీసుకోవడం  మర్యాద కాదు అనుకుని దగ్గరకు వెళ్ళలేదు.  అయినా, మనసులోని ఆలోచనలను గురుదేవులు గ్రహించలేకపోతే కదా!

బృందావనం నుంచి శ్రీమాతాజీ బయటకి రాబోతుండగా నేను శ్రీబాబూజీ పాదుకల సమీపానికి వెళ్ళాను. నన్ను చూసి శ్రీమాతాజీ, "బాబాయిగారూ! ఎలా వున్నారు? మీ ఆరోగ్యం బాగుందా?"  అని ఆప్యాయంగా పలకరించి, తన కుడి చేతితో నా గుండె పైనుంచి పొట్ట అంతా అమితమైన వాత్సల్యంతో నిమిరారు.  నాకేదో వింతలోకంలో  విహరిస్తున్నట్లు, అనిపించింది. అనిర్వచనీయమైన అనుభూతి!

ఆశ్చర్యం! అప్పటివరకు ఉన్న కడుపులోని బాధ ఏమయిందో తెలియదు, పూర్తిగా తొలిగి పోయింది. చెప్పలేని ఆనందం! కృతజ్ఞత  నిండిన మనస్సుతో,  వెనకాలే వారి ఇంటికివెళ్ళి, శ్రీ మాతాజీకి  పాదనమస్కారం చేసుకున్నాను. చల్లని చిరునవ్వుతో ఆశీర్వదించారు

ఆపరేషన్ అవసరం అని సుమారు రెండు నెలల క్రితం  డాక్టర్లు చెప్పారు. కాని, ఇప్పుడు నొప్పి ఉంటే కదా ఆపరేషన్ అవసరం అయ్యేది ! నొప్పి ఎలా పోయింది? అదే గురు శక్తి ప్రభావం!

గురుశక్తికి అసాధ్యమైనది ఏదీ లేదు, తిమ్మిని బమ్మిగా  చేయగలదు. భక్తులు చేయవలసినది, నిష్కల్మషంగా, పరిపూర్ణంగా  విశ్వసించటం మాత్రమే.

" విశ్వసించు ! తరించు !! "

# 2. కలయో వైష్ణవ మాయయో

-రెడ్డి శ్రీదేవి

శ్రీబాబూజీ చేత 'సక్కుబాయి ' అని పిలిపించుకున్న శ్రీమతి కోడూరి సీతారామాంజనేయమ్మగారు మాతల్లి గారు. వారి అమ్మమ్మ 'కోటిపల్లి మామ్మ' గా ఆశ్రమవాసులకు సుపరిచితులైన శ్రీమతి హనుమత్‌వఝల శేషమ్మగారు. ఆశ్రమస్థాపనకు ముందునుండే శేషమ్మగారు శ్రీబాబు పాదాలను ఆశ్రయించారు. వారికి శ్రీబాబు అనేక మార్లు కలలో అనేక విధాలుగా దర్శనమిచ్చారు. ఒకసారి నాలుగు చేతులతో– పుస్తకం, కోదండం,శంఖం, చక్రం ధరించి – దర్శనమిచ్చారు. వారు ' ఆ పుస్తకం ఏమిటి బాబూ, అని అడిగారు. 'త్రిగుణాతీత వస్తు సుధా నిధి ' అని; త్వరలో ఒక ఆశ్రమం ఏర్పాటు జరుగుతుంది. అక్కడికి నేను ఈ నిధినే తీసుకుని వస్తాను. భవిష్యత్తులో ఆ ఆశ్రమం రెండవ అయోధ్యగా భాసిల్లుతుంది, అని శ్రీబాబు చెప్పారు. అటువంటి వారికి మునిమనుమరాలిని కావటం నా పూర్వ పుణ్యంగా భావిస్తున్నాను. చాలా ఆనందం. అక్షరం కూడా పొల్లు పోకుండా 'త్రిగుణా తీత వస్తు సుధా నిధి ' అనే పేరుతోనే నేటికీ భక్తులకు అందుబాటులో ఉన్నది.

నా జీవితంలో మరపురాని, మరచిపోలేని కల ఒకటి మధురాను భూతిగా మిగిలింది. మావారు అప్పట్లో తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి దగ్గర కడియంలో నున్న ఎ. పి. పేపర్ మిల్స్‌లో ఉద్యోగం చేసేవారు. కడియంలోనే కాపురం ఉన్నాము. నేను ఆశ్రమానికి వచ్చినప్పుడు, బాబూజీతో 'కడియం రండి బాబూ ' అని అడిగేదానిని. శ్రీ బాబు, "ఎప్పుడు రావాలో అప్పుడు వస్తా, వస్తే ఏంపెడతావు?" అని అడిగేవారు. 'అదేంటి బాబూ, ఆటైముకు మీరు ఏం కలుగ చేస్తే అదే పెడతాను' అనేదాన్ని.

శ్రీబాబు 1988 లో సిద్ధి పొందడం నా మనస్సు జీర్ణించుకోలేక పోయింది. నాకు చాలా వెలితిగా, బాధగా ఉండేది. భోజనం సయించేది కాదు. బాబు సిద్ధి కార్యక్రమం అయ్యాక కడియం వెళ్ళిపోయాము. నాలుగు రోజులు భోజనం చెయ్యలేదు. కాస్త మజ్జిగ మాత్రం తీసుకొని ఉండేదానిని. నేను భోజనం చెయ్యక పోవడంతో మావారు బాధ పడే వారు, నన్ను బ్రతిమాలే వారు అయినా ఉపయోగం లేదు.

నాకు నీరసంగా ఉండటంతో ఒక రోజున అన్నం, పాలకూర పప్పు మాత్రమే

వండాను. మావారు ఉదయాన్నే ఉద్యోగానికి వెళ్ళారు. తరువాత వారికి క్యారేజి పంపించాను. మిగిలిన అన్నం, పప్పు రెండు గిన్నెలలో ఉన్నాయి. ఉదయం సుమారు 11 గం॥లు అవుతుంది. నేను ధ్యానం చేసుకుంటూ నిద్రలోకి జారుకున్నాను. ఆ నిద్రలో తియ్యని, బంగారు నిధి లాంటి కల! కలలో .... శ్రీబాబు మా ఇంటికి వచ్చారు. నేను లేవబోతున్నాను, "లేవకు, లేవకు! నీరసంగా ఉన్నావు కదా" అని నన్ను వారించారు, శ్రీబాబు వంటింట్లోకి వెళ్ళారు. కంచం స్టాండులోంచి చిన్న కంచం తీసి, గిన్నెలలోని అన్నం, పప్పు తీసి, కంచంలో కలిపి తెచ్చారు బాబు. "లే, లేచి, తిను, "అని బాబు నాకు ఆ అన్నం తినిపించారు. కొద్దిగా తిన్నాను, మహాప్రసాదం ! కల చెదరింది.

ఆనందంతో లేచాను, ఏదో తిన్నట్టుగా పొట్ట నిండుగా ఉంది. ఆకలి, నీరసం అసలు లేవు. ఏమిటీ వింత! కలలో బాబు తినిపించారు! నేను నిజంగానే తిన్నానా! నిజమా, కాదా, చూద్దామనిపించి వంటింట్లోకి వెళ్ళాను, ఆశ్చర్యం! కంచాల స్టాండులో ఉండవలసిన ఆ చిన్న కంచం వంట గది గట్టుమీద ఉంది. అందులో పప్పు కలిపిన అన్నం మెతుకులు కూడా కొద్దిగా ఉన్నాయి. 'ధన్యోస్మి!' 'వస్తే ఏం పెడతావు ' అని అడిగిన దయాసింధు శ్రీ బాబు, కలలో మా ఇంటికి వచ్చి, అన్నం, కూర కలిపి, తను తిని, ఆ మహాప్రసాదాన్ని నాకు తినిపించారు. ఇది ఎంతటి భాగ్యం! ఎంత తపస్సు చేస్తే లభిస్తుంది ఈ భాగ్యం? మహాప్రసాదం తినడంతో, నా నీరసం మటుమాయం! ఇలలోని నా కోర్కెను కలలో తీర్చారు. కలలో తీర్చినా, ఎదురుగా నిజం కనిపిస్తోంది కదా! ఇది కలా, నిజమా? నిజమైన కల !

మా వారు డ్యూటీ నుండి వచ్చాక ఈ సంగతి చెప్పాను. వారు నమ్మలేదు. " నీరసంతో నీకు మతి భ్రమించి ఉంటుంది లే," అని తేలికిగా తీసి పారేశారు. " కాదండి, నిజమే " అని నేను గట్టిగా చెప్పాను. వంటింట్లోకి వెళ్ళి చూశారు. 'నిజమే శ్రీదేవీ, అన్నం,పప్పు చాలా తగ్గాయి కూడా ' అన్నారు. గిన్నెలో మిగిలిన అన్నం, కొద్దిపాటి పప్పు అదే కంచంలో కలుపుకుని, 'ఇది మహాప్రసాదం' అని మావారు కళ్ళకు అద్దుకుని తిన్నారు. నేను ఆ కంచాన్ని జాగ్రత్త పెట్టి, నా కూతురు జయ కాళికి ఇచ్చి, 'ఇది అక్షయ పాత్ర , వెండి కంచం కంటె ఎక్కువ విలువగా చూసుకో జాగ్రత్త ' అని చెప్పాను.

# 3. గురు ఆజ్ఞా పాలన

- దేవరకొండ యల్లయ్య శాస్త్రి (చిన్నారి)

"నమ్ముకున్న వాడికి బంగారు పిచ్చుక, నమ్మకం లేని వాడికి బూడిదే," అని సద్గురు దేవులు శ్రీ బాబూజీ ఎప్పుడూ చెపుతుండేవారు. సద్గురు వాక్కు సత్య వాక్కు, వేద వాక్కు వారి నోటి వెంట ఏ మాట వచ్చినా అది జరుగుతుంది, జరిగి తీరవలసినదే. ' అసాధ్యమేమో ' అని మనకు అనిపించవచ్చును. కాని, వారి వాక్కుకు తిరుగులేదు. అదే వాక్శుద్ధి, వాక్శుద్ధి కలిగిన వారు మహాత్ములు, మహామహితాత్ములు.!

కృష్ణుడు ఒక రోజున అర్జునుడికి హంసను చూపించగా అది హంస గానే కనిపించింది, అది హంస కాదు కాకి, అని కృష్ణ పరమాత్ముడు అనగా అది అర్జునుడికి కాకి వలెనే కనిపించినది. ఆవిషయం అర్జునుడికి ఏమాత్రం వింతగా అనిపించలేదు, ఎందుకంటె పరమాత్ముని లీలలు పూర్తిగాతెలిసినవాడు కనుక, హంస కాకిలా ఎలా కనిపించింది ? ' ఎలా? ఎందుకు? అనే ప్రశ్నలకు ఎంత తరచి చూసినా సమాధానం దొరకదు.

ఆశ్రమ స్థాపనకు ముందు నుంచీ నేను శ్రీ బాబును ఆశ్రయించాను, విశ్వసించాను. అప్పట్లో నేను డ్రామా ట్రూపులతో తబలా ఆర్టిస్టుగా వెళ్ళేవాడిని. అప్పటికి నాకింకా పెళ్ళి కాలేదు, గుడివాడ నివాసి. శ్రీమతి వారణాశి సుబ్బమ్మగారు అనే భక్తురాలు కూడా శ్రీబాబును విశ్వసించారు. బాబూజీ ఎక్కడ ఉన్నా వారి దర్శనార్థమై శ్రీమతి సుబ్బమ్మగారు కూడా కుటుంబ సభ్యులతో వస్తూ ఉండేవారు. ఒక సారి ఉత్సవాలకు వచ్చిన వారితో శ్రీ బాబు నా గురించిన వివరాలు చెప్పి, " మీ అమ్మాయిని యీ అబ్బాయికి ఇచ్చి పెళ్ళి చేస్తారా, " మీ ఇష్టం బాబూ, మీరు ఎలా చెబితే అలా చేస్తాను," అన్నారు ఆవిడ.

ఒక గురు పౌర్ణమినాడు గుంటూరు లో శ్రీ మాజేటి గోపాల్‌గారి ఇంటిలో గురుపూజ, సత్సంగం,నమస్కారాలు అయ్యాయి. శ్రీబాబు నన్ను పిలచి, "శ్రీమతి సుబ్బమ్మగారి అమ్మాయి నీకు తెలుసు కదా! ఆ అమ్మాయిని నీకిచ్చి పెళ్ళి చేద్దామనుకుంటున్నారు, ఏమంటావు? నీకు ఇష్టమేనా? " అని అడిగారు. "మీ

ఇష్టం బాబూ. మీరు ఎలా అంటే అలాగే," అన్నాను నేను. "మరి ఆ అమ్మాయి జుట్టు ముగ్గు బుట్టలాగా మొత్తం తెల్లగా ఉంటుంది కదరా," అన్నారు శ్రీ బాబు. అయినా సరే మీ మాటని జవదాటను బాబూ!" అన్నాను.

శ్రీ బాబు "స్టేజి మీద నటీనటులు డ్రామాలు వేస్తుంటారు. అందరూ ఎర్రగా, బుర్రగా ఉండరు కదా! కాస్త నల్లగా ఉన్నవాళ్ళు ఏం చేస్తారు? నలుపు కనిపించకుండా, రంగులతో బాగా మేకప్ చేసుకుంటారు కదా! అందులో తప్పు లేదు కదా! అలాగే ఈ అమ్మాయి జుట్టుకు కూడా నల్లరంగు వేయిద్దాం, జుట్టు అందంగా ఉంటుంది. పదిమందిలో ఆక్షేపణ ఉండదు" అన్నారు. నేను, "ఫరవాలేదు బాబు, తెల్లజుట్టు అయినా ఫరవాలేదు, నాకు ఇష్టమే, నాకు ఏమీ అభ్యంతరం లేదు. అంతా మీదేభారం" అన్నాను. "వెరీ గుడ్! అయితే ఆవిశ్వాసం అలాగే ఉంచుకో. ఏమాత్రం చెదరనీయకు. అయినా ఫరవాలేదులే త్వరలోనే అమ్మాయి జుట్టు నల్ల బడి పోతుందిలే," అన్నారు శ్రీ బాబు. నేను బాబుకు మనసారా పాదనమస్కారం చేసుకున్నాను. అంతకంటె ఏమి చేయగలను! బాబూజీ ఆజ్ఞతో, వారి పురమాయింపుతోనే గుంటూరులో శ్రీపాండుగారి ఇంటిలో తాంబూలాలు పుచ్చుకోవడం జరిగింది.

శ్రీబాబూజీ ఆశీస్సులతో, వారి సమక్షంలో మా పెళ్ళి గుండుగొలనులో జరిగింది. నాభార్య జుట్టు నల్లబడాలని నేను గాని, ఆమె గాని అనుకోలేదు. జుట్టు రంగు మాకు ఒక సమస్యగా ఏమీ అనిపించలేదు..

సుమారు సంవత్సరం – సంవత్సరంన్నర నాటికి ఆమె తలలో ఒక్కటైనా తెల్ల వెంట్రుక లేదు. జుట్టు మొత్తం నల్లబడింది. ఎవరో మంత్రించినట్టుగా జుట్టు నిగనిగలాడింది. ప్రాపంచికంగా ఆలోచిస్తే ఇది సాధ్యమా? కానే కాదు! కాని అసాధ్యమైనటువంటిది సాధ్యమయింది ఎలా? ***అదే*** గురు మహిమ! ***గురువాక్కు మహిమ!!*** వారి లీలా సాగరంలో ఇది ఒక చిన్న బిందువు మాత్రమే.

జై గురుదేవ్ !!!

# 4. గురు కృప

– రజని U.S.A

శ్రీ బాబూజీ యెప్పుడూ మనతోనే ఉన్నారు. మేము రాలై నుండి మినియా పోలీస్‌కు బయలుదేరినప్పుడు,మినియా పోలీస్ విమానాశ్రయంలో సెక్యూరిటి చెక్ పోస్టు వద్ద నా బంగారు గాజు పోగొట్టు కొన్నాను. ఫ్లైటుకు 10 నిమిషాల వ్యవధి మాత్రమే వుండటంవలన, సమంగా వెదకలేక పోయాను.పోనీలే, అదంతా మనమంచికే జరిగిందనుకొన్నాను. దానిక్కూడ యేదోకారణం వున్నదేమో అనుకొన్నాను. దీక్ష తర్వాత నేను మినియా పోలీస్‌కు తిరిగి వస్తున్నాను. రాలై నుండి ఎట్లాంటా, ఎయిర్ పోర్టులో 4 గం॥ వేచియుండవలసి వచ్చింది. ఇంతలో మినియా పోలీస్ ఎయిరు పోర్టు నుండి నా బంగారు గాజు కనపడ్డదని ఫోను కాలు వచ్చింది.నన్ను వచ్చి బ్యాంగిల్ తీసుకు వెళ్ళ మన్నారు. నాకత్యంత ఆశ్చర్యమయింది. ఈ సంఘటన శ్రీబాబూజీ యెప్పుడూ మన వెంటనే వుంటారని ఋజువు చేస్తున్నది. అంతా స్వామి వారి ఆశీర్వాదమే.

అట్లాంటా యైరు పోర్టులో వేచి వుండటములో మా అమ్మాయి లాస్య బాగా చిరాకుగా ఉన్నది. మాటికట్సు, సీట్లు నంబర్లు ఎకానమి క్లాసు నెంబర్లు 12 ఎ,బి,సి గా నిర్ధారణ అయింది. కాని ఫ్లైటులో కి చేరగానే మా టికెట్లు బిజినెస్ క్లాసులో నెంబర్లుగా 1 ఎ,బి,సి గా ప్రింటయి వున్నవి. మేమాశ్చర్య పడ్డాము. బహుశా బిజినస్ క్లాసులో సీట్లు ఖాళీగా వుండటము వలన మమ్మల్నక్కడకు మార్చారని అభిప్రాయ పడ్డాము. తీరా చూస్తే ఫ్లైటంతా నిండుగా వున్నది. శ్రీబాబూజీ మహరాజ్ మహిమ మరొక మాటు ఋజువైంది. నేను 4 నెలల పసిపాపతో ప్రయాణం చేస్తున్నాను కాబట్టి, సౌకర్యంగా వుండటానికి స్వామివారు అనుగ్రహంతో అలా చేసారనిపించింది. అడుగడుగునా, గురుదేవుని మహిమ యిలా వ్యక్త మవుతున్నది గదా! అని ఆనందించాము.

# 5. అమ్మే బాబు - బాబే అమ్మ

-రఘు

అమ్మా! 28-04-2012 న నాకు మీ దర్శన భాగ్యం లభించింది. అది నిజంగా అత్యంతాశ్చర్యం! నేనేమి చూస్తున్నానన్నది నిర్ణయించు కోటానికి, మరల, మరల రెండు మారులుదృష్టి నిలిపిచూచాను. సందేహం లేదు. మూడు పర్యాయములు మీ దివ్య రూపాన్ని దర్శించాను.

ఆ రోజు, బీదరు నుండి నాస్నేహితుడు కుటుంబముతో విజయవాడ వచ్చి దుర్గా మాత దర్శనానికి, కనకదుర్గాలయమునకు వెళ్ళాము. అవును. అక్కడ మీ దర్శనమే లభించింది. నా నేత్రములు నన్ను మోసంచేయ లేదు. ఒకటికి మూడు పర్యాయములు, దుర్గామాతలో మిమ్మల్నే దర్శించానమ్మా! ఇది నిక్కము, మీదర్శన భాగ్యము ప్రసాదించి, ఆశీస్సులనందజేసి నందుకు ధన్యవాదాలు.

***అగ్నిలో ప్రేల్చిన పిండం పితృదేవతలకు ఎలా చేరుతుందని? నీ అనుమానం. కాని చేరుతుంది.***

***నీకు తలనొప్పి వచ్చింది. డాక్టరు దగ్గరకు వెళ్ళావు. ఆయన మాత్ర యిచ్చి, 'తలనొప్పి పోతుంది మాత్రవేసుకో' అన్నాడు. నొప్పి తలకైతే మాత్ర కడుపులో వేస్తే తలనొప్పి ఎలా పోతుంది?***

***ఒకటే ఉదాహరణ. ఎండు మిరపకాయి ముక్కు దగ్గర పెడితే ఘాటు నీ ఒక్కడికే తెలుస్తుంది. రోటిలో వేసి దంచితే, పదిమందికీ వ్యాపిస్తుంది. నిప్పులో కాల్చితే నాలుగు యిళ్ళవాళ్ళకూ ఘాటు వ్యాపిస్తుంది.***

***అలాగే అగ్ని ద్వారా సూక్ష్మరూపం చెందిన వస్తువు, వస్తు రూపంలో కాక, శక్తి రూపంలో దేవతలకు చేరుతుంది.***

# 6. గురు కృపా మహిమ

– కృష్ణU.S.A

అర్జంటీనాలో నాకిచ్చిన, అసైన్ మెంటు చాలా క్లిష్టమైనది. అనుకొన్న దానికంటె, యెక్కువ ఏకాగ్రతతో నిర్వహించటంతో, ప్రార్ధనకు కొంచెం సమయం కూడా కేటాయించలేక పోయాను. హెూటల్లో టేబులుపై సద్గురు బాబూజీ ఫోటో పెట్టుకొని, నమస్కరించి, కొద్ది క్షణాలు మౌన ప్రార్ధనచేసి హడావుడిగా, అన్ని సర్దుకొని, రూమ్ ఖాళీ చేశాను.

సాయంకాలం 4గం ॥ సమయంలో హెూటల్లో, నేనేదో మరచి పోయానని, నాకొక కవరు తెచ్చిచ్చారు. అది తెరచి చూచేటప్పటికి నేను సంభ్రమాశ్చర్యములతో ఉక్కిరి బిక్కిరైనాను. అందులో హెూటల్లో నేను పరధ్యానంగా మరచి పోయిన సద్గురు దేవుని ఫొటో ఉన్నది.

నేనున్నది " విల్లా రెజజీనా " యనే చిన్న టౌను. అక్కడ వారు స్పానిష్ భాష మాత్రమే మాట్లాడతారు. వారికి నేను పూర్తిగా అపరిచితుడను. అక్కడ నేను రాత్రి 10 గం॥ నుండి ఉదయం 8 గం ॥ వరకు మాత్రమే ఉన్నాను. హెూటలు యాజమాన్యం, గురు మహరాజ్ ఫొటోను నాకెలా పంపగలిగారు?

ఇది కేవలం శ్రీగురుదేవుని అద్భుత చర్య. ఇది నిజంగా అద్భుతమైన, ఆనందకరమైన సంఘటనని అప్పుడు నాకనిపించింది. నేనజాగ్రత్తగా అతి ముఖ్యమైన విషయాన్ని విస్మరించినా, సద్గురు దేవుడు తనబిడ్డల నెప్పుడూ మర్చి పోరు.

స్వామి మరలా నాదగ్గరకు వచ్చి."నీ కర్తవ్యనిర్వహణ గురించి, ఏమీ చింతించ వద్దు. నాపై దృష్టి నిలిపి, కర్తవ్యాన్ని నిర్వర్తిస్తే, అన్నీ సవ్యంగా చూచుకొనే బాధ్యత నాది సుమా!" అని అభయ మిచ్చినట్లనిపించింది. ఆహా! గురుకృపా మహిమ యెంత గొప్పది!

అమ్మా! సాధనలో పురోగ మించేటట్లు ఆశీర్వదించి, దయుంచి నేను చేసిన తప్పిదాన్ని మన్నించండి. జైగురుదేవ్!!

# 7. భక్త హృదయాంతర్వర్తి శ్రీబాబు

సమర్థ సద్గురు నాథులు పరమ గురువులు అయిన శ్రీకాళీ ప్రసాద దేవులు, తమ బిడ్డలను ఏరీతిగా కాపాడుకొనేవారో నా ఈ చిన్న అనుభవం తెలుపుకుంటున్నాను. అది 1961 సం॥లో వల్లభాపురం కృష్ణాష్టమి ఉత్సవాలు జరుగుతున్నాయి. మేమంతా 20 మంది భక్తులము శ్రీబాబుతో అక్కడకి వెళ్ళాము. ప్రతి రోజు రెండు పూటలా ప్రార్ధనాధికాలు ఉండేవి. శ్రీబాబు అనుష్ఠానానంతరం తీర్థ ప్రసాద వినియోగం ఉండేవి. శ్రీబాబు బోధామృతం మాకు వీనుల విందుగా ఉండేది.

తిరిగి రాత్రి భోజనానంతరం డాబాపై కొంచెంసేపు సంకీర్తన, ప్రవచనం జరిగేవి. రెండు మూడు రోజులుగా "హేకృష్ణా ముకుందా మురారి" అనే పాండురంగ మహాత్యంలోని పాటను శ్రీహరి గారి సుశీలక్కతో పాడించి దానిపై కృష్ణతత్వం, కృష్ణుని బాల్యలీలలు చెప్పి మమ్ముందరిని కడుపుబ్బ నవ్విస్తున్నారు శ్రీగురుదేవులు.

ఆ రోజు రాత్రికూడా సంకీర్తన మొదలుపెట్టే సమయానికి తిరిగి ఆకీర్తనలోని "కస్తూరీ తిలకం" అనే శ్లోకాన్ని అక్కడ సంకీర్తన చేసే ముఖ్యమైన వారినందరిని ఒక్కొక్కరిగా పాడించారు. అదేమి చిత్రమో మరి రోజూ పాడేవారందరూ ఎవ్వరూ పాడలేకపోయారు. అప్పుడు నా వయస్సు 10సం॥లు. ఇంకా సంకీర్తన చెయ్యటం, హార్మోనియం వాయించటం రాదు. శ్రీబాబు చేరువలో ఉన్న నన్ను తన పాదంతో తట్టారు. నన్ను పద్యం అందుకోమని. నాకు అ మూడు రోజులుగా వినటమేగాని అంతకు ముందు రాదు. సరే! శ్రీబాబు ఆజ్ఞతో నేను పాడటం మొదలు పెట్టాను. పద్యం చివరి పాదం "గోపస్త్రీ పరివేష్టితో " అనేది బాగా తారా స్థాయిలో ఉంటుంది. ఆ స్థాయికి నేను అందుకొనేసరికి శ్రీబాబు గట్టిగా "ఊఁ" అన్నారు. అదేమి చిత్రమో పాడుతూ ఉన్న నా గొంతు నుండి విచిత్రమయిన శబ్దం వచ్చిపాడలేకపోయాను. చిన్నతనం! గురుదేవుల వద్ద ఎలా ప్రవర్తించాలి

అని తెలియనితనంతో స్వతంత్రంగా 'ఎందుకు బాబు మీరు అలా అన్నారు?' అందుకే నేను పాడలేక పోయాను. అని చనువుగా మాట్లాడాను.

దానికి బాబు పకపకా నవ్వుతూ నావీపు తట్టి, తమ బోధ ప్రారంభించారు. తరువాత ఆ సంఘటనపై అక్కడే ఉన్న మానాన్న మిగతా పెద్దలు శ్రీబాబు బోధ మననం చేసుకుంటూ, తన బిడ్డలను శ్రీబాబు ఎలా కాపాడుకుంటారో, ఏ విధంగా రక్షణ చేస్తారో  అనుకున్నాను. 'సంకల్పం మనస్సులో కలిగినంతనే 'నేను పాడుతున్నాను కదా' అనే  అహం  నాలో పెరిగి నన్ను పాడుచేస్తుందేమో? యీ సంకల్పం నాలో బీజ రూపంతో ఉండగానే దానిని తుంచి వేసి, ఏ రీతిగా జగద్గురు దేవుడు శ్రీకృష్ణ భగవానుడు ఎలా తన శిష్యుడైన అర్జునుణ్ణి కాపాడాడో, ఎలా శ్రీసమర్ధరామ దాసస్వామి తన శిష్యుడైన శివాజీ మహారాజును కాపాడాడో, అట్లే నా గురుదేవులు శ్రీబాబూజీ మహరాజ్ ఎక్కడ నాలో అహం పెరిగి నేను పతనమవుతానో అని ఈరీతిగా నన్ను కాపాడి నన్ను ప్రకాశింప చేస్తున్నారు" అని గ్రహించాను. ఈ రీతిగా సమర్ధ సద్గురు దేవులు తమ శిష్యులపై త్రిగుణాల, అరిషడ్వర్గాల, ప్రభావం  పడకుండా  కాపాడుతుంటారు.

శ్రీ గురుదేవులు  తన యొక్క సర్వజ్ఞత్వము, సర్వవ్యాపకత్వము, తెలియజేసే అటువంటిదే మరొక సంఘటన నాజీవితంలో జరిగినది. అది 1963వ సంవత్సరం. రాజమండ్రిలో అమ్మ జయంతులు జరుగుతున్న సమయం.  అనుకోకుండా  నాకు డెంగ్యూ జ్వరం ఉన్నపళంగా  5 రోజులు మూసిన కన్ను తెరవకుండా ముంచుకొచ్చింది. ఈ జ్వరం ప్రాణాంతకమైనది. శ్రీ బాబుకు కబురుజేస్తే, 'విరోచనము అయితే తగ్గిపోతుంది' అని కబురు పెట్టారు.

డా॥ శేషగిరి తాతయ్యగారు,  మానాన్న తమకు తెలిసిన  అన్నిరకముల మందులు వైద్యాలు జేసినా లాభం లేకపోయింది. అప్పుడు శ్రీబాబు 6 వ రోజు రెండు చిన్న మాత్రలు పొట్లంగట్టి పంపించారు. ఆసాయింత్రానికి విరోచనమై జ్వరం తగ్గి పోయింది.

అప్పుడు సత్సంగం రాత్రి 7గం॥ నుండి జరిగేది. అందరూ నన్ను వదలి సత్సంగానికి వెళుతూవుంటే  ఏమైనా సరే నన్ను ఎత్తుకుని అయినా సరే తీసుకుని

వెళ్ళాల్సిందే. ఏమైనా ఈరోజు శ్రీ బాబుకు నేను నమస్కారం చేసుకు తీరవలసిందే, అని పేచీ పెట్టాను. ఇక చేసేదేమీలేక నన్ను తీసుకు వెళ్ళారు. క్యూలో బాబుకు 10 మంది దూరంలో వుండగా నన్ను వెళ్ళి సంకీర్తన చెయ్యమని శ్రీ బాబు సైగ చేసారు. కాని నేను సంకీర్తన చేసే స్థితిలో లేను. నా కాళ్ళు చేతులు వణికి పోతున్నాయి. నోరు పిడచగట్టుకు పోతోంది. నీరసంతో కళ్ళు తిరుగుతున్నాయి. నేను తలెత్తి శ్రీ బాబును చూడకుండా నమస్కారానికి ముందుకు కదిలాను. శ్రీ బాబు తన దగ్గరదాకా రానిచ్చి, నేను పాదాలపై తల వంచుతుండగానే, నాతల తనచేతితో పైకెత్తి సంకీర్తన దగ్గరకు వెళ్ళమని సైగ చేసారు. అయినా నాకు శక్తి లేక నేను కదలలేదు. పైగా సంకీర్తన జరిగేచోటు ఎక్కడో మధ్యలో ఉంది.

బాబు అలాగే ప్రక్కనున్న వారితో నన్ను తీసుకువెళ్ళి అక్కడ కూర్చోబెట్టమని చెప్పగా, ప్రక్కనే వున్న డా॥ శేషగిరిరావుగారు, మరొకరు నారెండు రెక్కలు పట్టుకుని తీసుకువెళ్ళి అక్కడ కూలేశారు. నేను మౌనంగా అలాగే కూర్చుంటే, హార్మోని పెట్టె నాదగ్గరకు జరిపించి పాడమని సైగ చేస్తే, నేను మౌనంగా అలాగే కూర్చుంటే, మానాన్న నావీపు పై ఒక్కటి చరిచి నారెండు చేతులెత్తి పెట్టెపై పెట్టగా, నేను పెద్ద దుఃఖంతో నీరసంగా తలెత్తి బాబును ఒక్కసారి చూచాను. తీక్షణంగా నన్నే చూస్తున్న శ్రీ గురుదేవుల దృష్టితో నా కనులు మూసుకున్నానో, తెరచివుంచానో, పెదవులు కదపానో, లేదో, కూడా తెలియదు. తిరిగి 2 గం॥ తరువాత బాబు జై జై కాళీమాతకు జై అనే నినాదంతో నాకు తిరిగి స్పృహ తెలిసింది. మరి ఆరెండు గం॥ లు పాడింది "నేనా? కాదు. బాబే!" అందుకు ప్రత్యక్ష సాక్షిని నేనే, పిడచ గట్టుకు పోయిన నోటితో మాటే రాని నేను 2 గం॥ కాలం ఏశక్తితో పాడగలిగాను?

నేను మాత్రం పాడలేదు. అది నా అనుభవం. సర్వవ్యాపకులైన గురుదేవులు నాలో వుండి ఈలీల చేశారు. దున్నపోతుచేత వేదం చదివించ గలిగిన స్వామి, ఏశక్తి లేని నాతో పాడించటం, ఆయన సర్వవ్యాపకత్వం, సర్వశక్తిమత్వం. ఏనిమిషంలో పడుకోబెడతాడో, ఎప్పుడు లేపుతాడో, అది స్వామి లీల, నిరంతరం తన బిడ్డలను ప్రకాశింపజేస్తూ, తనకేమీ తెలియనట్లుగా సంచరిస్తూ ఉండటం ఆనటన సూత్రధారికే చెల్లు!

– మీ కాళీమా

# 8. ప్రభూ! నీదు మహిమ తెలియగ వశమా!

- కామేశ్వరీ ప్రసాద

ఓం గురుబ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః

గురు స్సాక్షాత్పరబ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః

అనే ఈ శ్లోకం చెప్పించి, దీని అనుభవం తెలుసుకుంటే చాలు అని యిదివరలో తుని జయింతులలో శ్రీబాబూజీ మహరాజ్ చెప్పారు. ఈ సందర్భంలో నా హృదయంలో పదిల పరచుకొన్న కొన్ని అనుభవాలను వారి అనుజ్ఞగా భావించి తెలియజేస్తున్నాను. సంగీతం మాస్టారు మంచిరాజు సత్యనారాయణ గారితోనూ, నాతోనూ త్యాగరాజ కృతి పాడించారు. అదేమిటంటే...

"మనసు నిల్ప శక్తి లేకపోతే, మరుల గంట విరుల పూజ ఏమి చేయు సోమిదమ్మ సొగసుగాంఢ్ర కోరితే సోమయాజి స్వర్గార్హుడేనా? కామక్రోధుడు తప మొనర్చిన కాచి రక్షించునా త్యాగరాజనుత" అని పాడించారు గురుదేవులు. వారు ఏది చెప్పినా మన గురించేగా!

"మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" అని అమృతబిందూపనిషత్తు చెబుతోందికదా. మనసు పరమాత్మయందు నిలవకపోతే ఎన్ని పూజలు, ఎన్ని పూలు, పండ్లు తెచ్చి పూజించినా లాభం లేదుకదా అని అంటే .......

శ్రీబాబు యిలా చెప్పారు "ఇప్పుడు నీవు ఇక్కడే ఉన్నావు అనుకో, వేరే చోట ఆలోచిస్తే? నేను చెప్పింది నీకు తెలుసా? ఇది విచారణ చెయ్యి" అన్నారు. ఇంకా కామక్రోధుడు తపమొనర్చిన కాచి రక్షించునా? అంటే మనకి యీ కామక్రోధాలే అడ్డు. ఎందుకని? అవి యీ ప్రపంచ వాసనలకి తీసుకు వెడతాయి. వాటివలన నీవెవరివో నీకు తెలియక నీలో ఉన్న పరమాత్మను మరచి విషయవాసనలో పడిపోతావు. కనుక నిన్ను గురించి విచారించు. జ్ఞానం పంచి యిస్తున్నాను పిచ్చివాళ్ళలారా తెలుసుకోండి అని హెచ్చరిక చేసి మనకు జ్ఞానభిక్ష పెట్టి నా బిడ్డలు యీ జ్ఞానం

అనుభవపూర్వకంగా తెలుసుకుని ప్రకాశించాలి” అని శ్రీబాబు అనేక విధాలుగా చెప్పారు.

కొన్ని సంవత్సరాల క్రితం అంటే శ్రీబాబూజీ ముంజవరపు కొట్టులో శ్రీ శివరాత్రి ఉత్సవాలు జరిగే రోజుల్లో, శ్రీగురుదేవులు భీమవరం నుండి ముంజవరపుకొట్టు వెడుతూ నన్ను ప్రయాణం అవమని చెప్పలేదు. అందుకని నేను వెళ్ళలేదు. కాని రేపు శివరాత్రి అనగా మంగరాజుమామ్మ కుమారుడు గోపాల్‌ను శ్రీబాబు పంపించి, ‘ఆ రాత్రి 12గం.ల లోపు కామేశ్వరిని యిక్కడికి తీసుకురా’ అని చెప్పి పంపారు. గోపాల్ సాయంత్రం ఆరుగంటలకు వచ్చి బయలుదేర దీశాడు.

భీమవరం నుంచి కోడేరు అనే ఊరు వెళ్ళేసరికి రాత్రి 10గం. అయింది. అక్కడ నుంచి గోదావరి బల్లకట్టు మీద అవతల ఒడ్డుకు చేరాలి. అక్కడ నడిపే పల్లెవాళ్ళు అంతా యిళ్ళకు వెళ్ళిపోయారు. ఎలాగో ఒకడు వచ్చి యీ బల్లకట్టు లాగటం ప్రారంభించే సరికి ఎవరో ఒకాయన సైకిల్ మీద వచ్చి ‘ఆపండి! నేను కూడా వస్తున్నాను’ అని కేక వేశాడు.

ఎలాగో అవతలి ఒడ్డుకు చేరాము. ఇంకా 4 కి.మీ నడవాలి అక్కడి నుంచి. ఎంతో నిశీధమైన ఆ చీకటిలో నడక ప్రారంభించాము. అది ఇసుక పర్ర, కాళ్ళకి నుసములు కుడుతున్నాయి. అడుగు పడటం లేదు. పైగా నాతో మా అమ్మాయి 4సంవత్సరాలు. అది నడవదు. ఏడుపు. ఎత్తుకుని నడవలేకుండా ఉన్నాను.

మా అవస్థ చూసి, ఆ వచ్చిన వ్యక్తి, సైకిల్ మీద నా చేతిలోని బ్యాగ్, మా అమ్మాయిని ఎక్కించుకుని నాతో బయలుదేరాడు. గోపాల్ ‘ఎవరినీ నమ్మకూడదు బ్యాగ్ ఎందుకు యిచ్చారు?’ ఎలాగో యింత దూరం నడిచాము. అక్కడ మళ్ళీ గోదావరి దాటి వెళ్ళాలి.’ అన్నాడు.

నన్ను దాటిస్తున్న గోపాల్‌ని ఆ సైకిల్ మీద వచ్చిన వ్యక్తి అన్నాడు ‘నువ్వు తీసుకు వెళ్ళేదారిలో సుడిగుండాలు ఉన్నాయి. ఈ తల్లీ పిల్ల దక్కరు. ఆగు! ఆమెను నేను దాటిస్తాను. ఈ సాగరం దాటించటం నాకు అలవాటే. నీకేమి అనుభవం ఉంది?’ అని అతను ఆవలి ఒడ్డుకు దాటించాడు.

"నీవు దాటలేక కాదులే రామయ్య తండ్రీ! నను దాటింపగ వచ్చావు రామయ్య తండ్రీ! అనే గుహుని వాక్యం గుర్తుకు వచ్చింది. అప్పుడు నా మనసులో యిలా అనిపించింది. 'యీ వచ్చిన అతను కేవలం శ్రీబాబే! వేరే ఎవరో కాదు' అనుకున్నాను. నాతో మాట్లాడుతూ 'గోదావరి గట్టు వెనుక ఈత తుప్పల్లో మా యిల్లు  ఉంది, నీవు వస్తే తీసుకు వెడతాను' అని అతను ఆ పక్కకు వెళ్ళి మాయం అయ్యాడు.

ఈ విషయంలో కేవలం బాబే యిలా వచ్చారని నిర్ధారణ అయింది నాకు. నేను నడవలేని పరిస్థితుల్లో ఎలుగెత్తి గజేంద్రుడు కేకవేసినట్లు నేను కూడా మొరపెట్టుకున్నా శ్రీబాబుని. లావొక్కింతయు లేదు ధైర్యంబు విలోలంబయ్యె ప్రాణంబుల్ ఠావుల్ తప్పె, మూర్ఛ వచ్చె, తనువుఁడస్సె శ్రమంబయెడన్ నీవే తప్ప నితః బెరుంగన్. మన్నింబదగన్ రావే ఈశ్వర కావవే వరద సంరంక్షించు భద్రాత్మకా.

అని పిలువగా రక్షించినట్లు శ్రీబాబు నన్ను కటాక్షించారు. గురు వాక్యం ఊరికే పోతుందా మరి. సరిగ్గా రాత్రి 12గం.లకు చేరుకున్నాము. వెళ్ళగానే శ్రీబాబు దర్శనం అయింది. బాధంతా వెళ్ళబోసుకుని శ్రీవారి పాదాలకు అంకితం అయ్యాను. 'మరి శివరాత్రికి నీవు రావాలి. నీవు రాలేకపోతే ఎలా? ఈ ఒక్క అనుభవం గుర్తుంచుకో' అన్నారు.

భ్రమర కీటక న్యాయం

గొంగళీపురుగువంటి మనసుని భ్రమరమనే గురుదేవులు దీనిని ప్రపంచ భ్రాంతిలో పడనీయక ఝుంకరిస్తూ ఇది పదిమందిలాకాక, తనలా అవ్వాలని అజ్ఞానమనే నిద్రలో నుండి లేపి, తన బిడ్డ తనంతవాడు కావాలని అనేక పరీక్షలు పెట్టి, అనుభవాన్నిచ్చి, ఆనందాన్ని కలుగజేసే శ్రీగురుదేవుల బాధ యింతా అంతా కాదు. తామర పుష్పం బురదలోనే ఉంది. ఆ నీటిలో ఎన్నో జీవులుంటాయి. కప్పలు పురుగులు అనేకంగా ఉన్నా, అవి ఆ పుష్పం యొక్క మకరందాన్ని పొందలేవు.

కాని ఎక్కడో, ఏ చెట్లలోనో ఉన్నటు వంటి షట్పద ఆ తామర పుష్పంలో ఉన్న మకరందాన్ని పూవు చెదరకుండా తీసుకుని యితరులకు పంచినట్లుగా

గురుకటాక్షముతో మనకు కూడా మహాత్ములు గురుదేవులు మనకు పంచి మీరు కూడా ఆ జ్ఞాన మకరందాన్ని పొందండి అంటున్నారు. అన్ని చోట్ల యిది లభ్యమయ్యేది కాదు. అటువంటి షట్పద మనం అవ్వాలంటే మనలోని కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములు, శమ దమాది షట్క సంపత్తిగా మారినప్పుడు మనం దానిని పొందగలం. తన ప్రభువు అటువంటి మకరందాన్నే కదా యిష్టపడేది.

పద కమలము, హస్త కమలము, హృదయ కమలము, ముఖ కమలము అని వర్ణించుకుంటాం. ఆ కమలము నందుద్భవించినదే కనుక లక్ష్మీదేవిని నారాయణుని హృదయ కమలంలో వుంచుకున్నాడు. ఒకప్పుడు శ్రీబాబు "మా అమ్మడుని సీతాకోక చిలుకను చేస్తాను" అన్నారు శ్రీమాతాజీవారిని ఉద్దేశించి. మనము కూడా అలా మారాలంటే మనలో ఉన్న గుణాలు సహజంగా మారాలి. అందుకే సహజ సమరసం సద్గురుం తం నమామి – అని గురుగీత చెప్పింది.

మేమందరం శ్రీబాబుతో కలసి కొవ్వూరు గోదావరి స్నానానికి వెళ్ళాం. అక్కడ మోకాటిలోతు నీళ్ళున్నాయి. చాల హాయిగా స్నానాలు చేస్తున్నాము. శ్రీ స్వామికి రుద్రాభిషేకం చేస్తున్నాము. నన్ను సంకీర్తన చేయమన్నారు. నాతోపాటు అందరూ సంకీర్తన చేస్తూండగా నీటి ప్రమాణం పెరిగింది. బాబు 'సంకీర్తన ఆపవద్దు' అన్నారు. ఆ రోజు పూర్ణిమ. పెద్ద పెద్ద కెరటాలతో గోదావరి తల్లి ప్రళయంగా వస్తోంది. అందరూ శ్రీగురు పాదాలు పట్టుకుని 'ఓం బాబు' అని స్మరణ చేస్తున్నాము. 'ఒక్కసారి అందరూ కళ్ళు మూసుకోండి" అన్నారు. మళ్ళీ 'తెరవండి' అనేలోగా మేము మునిగినప్పుడు నీరెంత ఉందో అంతే ఉంది. అందరిని ఆశ్చర్య చకితులను చేసింది. శ్రీబాబు మా అందరితో "ఇప్పుడీ ప్రవాహం పొంగినట్లు, మాయ క్షణంలో వస్తుంది. ఏదీ కీర్తన అందుకో" అన్నారు వెంటనే.

నాకు తోచింది పాడాను. "ప్రభూ! నీదు మహిమ తెలియగ వశమా అభవ బహునటనా విభవ. ప్రకృతి నీవె పురుషుడ నీవె అద్వైత బోధా అమృతాత్మనీవే. పరమాత్మ నీవే జీవాత్మ నీవే ఏకో నారాయణుడవు నీవే" –

ప్రకృతి పురుషుల కలయికే పూర్ణత్వం అవుతుంది. అదే అద్వైతం. అది తెలిసిన వాడే అమృతత్వాన్ని పొందుతాడు. ఇక్కడ జీవాత్మ పరమాత్మల కలయిక ఒకే స్వరూపం. ఆయనే ఏకో నారాయణుడు. ఈ భావాలను ఎల్లపుడు స్మరించుకో' అన్నారు శ్రీబాబు. మాయలో మునిగిన మానవుని గతికూడా ఇంతే అన్నారు.

గీతలో "మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే" ఈ ప్రవాహంలో మునిగినట్లు ఎవరైతే తెలుసుకుని నన్ను స్మరిస్తారో వారికి నా మాయ అంటదు. వారే తరిస్తారు అని చెప్పాడు. కేవలం నారాయణ స్వరూపులే సద్గురుదేవులు అని అనుభవం చాటిచెప్పింది. అటువంటి అనుభవం తెచ్చుకుని శేషజీవితం గడుపుతూ ఆ ప్రభువులో లీనం కావటమే నా ముఖ్య కర్తవ్యం.

ఒక తిరుగలి ఉంది. దానిలో రెండు రాళ్ళు ఉన్నాయి. ఒకటి ఎప్పుడు తిరిగేది. ఎప్పుడూ తిరగనది. పై రాయి చరము. క్రింద స్థిరము. ఈ రెండు వున్నప్పుడే పని జరిగేది. స్థిరమైన యిరుసు, చరమైన చక్రము రెండూ వుంటేనే బండి కదులుతుంది. అలాగే ప్రపంచ వ్యవహారం సాగిపోయే అందుకు స్థిరమైన పురుషుడు, చరమైన ప్రకృతి రెండూ అవసరం.

శుద్ధ సచ్చిదానంద స్వరూపుడై ఉండి కూడా జీవుడు దృశ్య ప్రకృతి తాదాత్మ్యంతో ప్రకృతే అయ్యాడు. దేహాభిమానియై జీవ భావం పొంది, జన్మ మరణ రూప సంసారానికి గురియైనాడు. తన స్వరూపాన్ని తాను గుర్తిస్తే తానే స్వయంగా పరమాత్మ.

కీర్తి నాశించి కొందరు లోక సేవ చేస్తారు. వాడు చేసే సేవ, గొఱ్ఱెకు కసాయివాడు చేసే సేవ.

# 9. భవరోగ వైద్యులు బాబు

- బి. లక్ష్మీ కామేశ్వర్

1966వ సం॥లో మాకు పాప పుట్టింది. పది నెలల వయస్సు దాకా పిల్ల తాగిన పాలు తాగినట్లు కక్కేసేది. బాగా నీరసించిపోయి, జ్వరం, ఆయాసం, అలాగ అనారోగ్యంతో బాధపడుతుండేది. మేము ఎంత మంది డాక్టర్లను మార్చినా దానికి పాలు యిమిడేవి కావు. అప్పుడు మా ప్రక్కన వున్న ఫార్మసిస్ట్‌గారి భార్య, మిల్క్ ఆఫ్ మెగ్నీషియా యివ్వండి. విరోచనం అయి ఆకలి కలిగి పాలు యిముడుతాయి అని చెప్పింది. నేను యిచ్చేసరికి అది పడక చాలా కంగారు అయింది.

అప్పుడు నేను మనసులో భగవంతుడి మీద పెట్టి శ్రీబాబు దగ్గరకి తీసుకువెడితే నయమవుతుందేమోనని శ్రీబాబు ఫొటో దగ్గరకి వెళ్ళి 'బాబూ! నా పెద్ద బిడ్డను రక్షించినట్లు, దీనిని కూడా రక్షించండి. మీరు తప్ప నాకు ఇంకెవరు దిక్కు?' అని బాధపడి, మా అమ్మకు గుంటూరు ఉత్తరం వ్రాశాను. పిల్ల అనారోగ్యం సంగతి శ్రీబాబుకు చెప్పి, ఆయన రమ్మనమంటే వస్తాము అని. ఉత్తరం అందగానే మా అమ్మ పాండుగారింట్లో శ్రీబాబు దగ్గరకి వెళ్ళి మధ్యాహ్నం తీర్థం తీసుకుని స్వామితో అన్ని విషయాలు చెప్పాలని మా అబ్బాయిని తీసుకుని వెళ్ళింది. శ్రీబాబు తీర్థం యిచ్చాక, మా అమ్మ యింకేవో విషయాలు మాట్లాడి, నేను వ్రాసిన ఉత్తరం సంగతి మర్చిపోయి, సెలవు తీసుకుని గుమ్మం దగ్గరకు రాగానే, శ్రీబాబు "అమ్మా! తాడేపల్లి గూడెంలో పిల్లలు కులాసాగా ఉన్నారా?" అని గుర్తు చేశారు. అప్పుడు మా అమ్మ 'బాబూ! అసలు సంగతి మర్చిపోయాను. మా అమ్మాయి దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది' అనగానే "అదేనమ్మా! మీరు చెబుతారని నేనూ ఆగాను. మీరు మర్చిపోయినా, వీడు మరచిపోడుకదా' అని వివరాలు అన్నీ అడిగి, యిక్కడకు తీసుకు రావద్దని చెప్పి, శ్రీబాబు వెంటనే రాజమండ్రిలో అనాస ఆదినారాయణ వద్దకు తీసుకువెళ్ళి 'నేను పంపించాన'ని చెప్పి ఆయన ఏం చెబితే అది చేయండి. మందు అయ్యాక నాకు చెప్పండి. పాపకు వచ్చిన

భయం లేదు. నేను ఉన్నాను. మీ పిల్లలకు ధైర్యం చెబుతూ ఉత్తరం వ్రాయండి" అన్నారు.

వెంటనే మా అమ్మ అన్ని వివరాలతో బాబు చెప్పినవన్నీ వుత్తరం వ్రాసింది. ఆ ఉత్తరం చదివి మేము వెంటనే రాజమండ్రి తీసుకువెడదామని నిర్ణయించుకున్నాముగాని నెలాఖరురోజులు అవటం వలన ఆర్థిక విషయం యిబ్బందుల వల్ల కొద్దిరోజులు అగి వెడదామనుకున్నాం. కాని శ్రీబాబు వెంటనే తీసుకురమ్మనమని చెప్పారు. ఎలా అని తర్జనభర్జన పడుతూ శ్రీబాబు మీద భారం వేసి, మీరే మాకు దారి చూపాలని ఆలోచిస్తూ రెండు మూడు రోజులు గడిపాము. ఒకరోజు రామారావుగారని మా వారి స్నేహితులు ఒకరు 'నేను అర్జంటుగా ఊరుకెడుతున్నాను. వారం రోజులదాకా రాను. నా రూమ్‌లో డబ్బు వుంచటం మంచిది కాదు. కనుక నా సొమ్ము మీ దగ్గర ఉంచండి" అని డబ్బు యిచ్చి వెళ్ళారు. అది చూసి శ్రీబాబు ఆయన ద్వారా మనకు మార్గం చూపించారని సంతోషించి, ఆ సొమ్ము తీసుకుని డాక్టరు దగ్గరకి వెళ్ళి వచ్చాక, ఆ మిత్రుడి డబ్బు వాపసు యివ్వచ్చని తలచి, రాజమండ్రి బయలుదేరి వెళ్ళాము.

అక్కడి వాతావరణమంతా చూశాక ఎంతో పెద్ద డాక్టర్లకి చూపించినా తగ్గనిది, యీ మామూలు మనిషివల్ల ఏం తగ్గుతుంది? ఈయన ఏం చేస్తారు? శ్రీబాబు ఎందుకు యీయన దగ్గరకు పంపారు? అని ఆలోచిస్తూ మమ్మల్ని రమ్మని పిలవగానే వెళ్ళి, పాపను చూపించాము. ఆయన వెంటనే 'పిల్లకు జబ్బు బాగా ముదిరింది. గోదావరిలో పారవేయక పోయావు' అన్నారు. మేము చాలా బాధపడి ఆయనకు నమస్కారంచేసి, శ్రీబాబు పంపితే మీ దగ్గరకు వచ్చాం. ఆయన మీకు యీ విషయం చెప్పమన్నారు" అని మేము చెప్పగానే, వెంటనే ఆయన 'బాబు పంపారా! అయితే నేను వ్యాధికి మందు యిస్తాను. నయం అయ్యాక నువ్వు నాకేమిస్తావు?' అని మా వారిని అడిగారు. అప్పుడు మా వారు 'మీరేమి కోరితే అదే యిస్తాను' అని బదులు చెప్పారు. 'జత గ్లాస్కో పంచలు యివ్వు. మందు తీసుకు వెళ్ళండి.

సుస్తీ ఎక్కువ అయినా మందు ఆపవద్దు. ఏం భయం లేదు. బాబు చూసుకుంటారు' అని ధైర్యం చెప్పి మందు యిచ్చి మమ్మల్ని పంపించారు.

ఆ తరువాత పాపని సుమారు ఐదు వారాలు మందు యిచ్చాక ఎక్కువ అయినా మేము యింక ఎవరికీ చూపక బాబుని స్మరిస్తూ మందు అలాగే వాడాము. చివరికి ఆ మందు ఆపాక శ్రీబాబుకు చెబితే 'యిప్పుడు కొత్త కుండ (పిడత)లో దంపుడు బియ్యం వేసి అన్నం వండి, చారు, మజ్జిగవేసి పెట్టండి చాలు' అని చెప్పారు. అలా చేశాక, ఐదు ఆరు నెలలు అయ్యేసరికి, వాంతులుతగ్గి బరువు పెరిగింది పాప.

భవరోగ వైద్యులు అయిన శ్రీబాబు ఆయుర్వేద ధన్వంతరి డాక్టర్లకు కూడా అంతుపట్టని రోగం నయం చేసి, మాకు శాంతిని, ఆనందాన్ని ప్రసాదించారు. ఇప్పుడు పాప పెద్దదయి, గృహిణి అయి, ఆస్ట్రేలియాలో వుంది. అంతా బాబు కృప!!

**శ్రీరామతీర్థ స్వామి సన్యసించిన చాలా కాలానికి కలుసుకున్న ఆయన భార్య "అయ్యో! ఇన్నాళ్ళు మీకు సేవ చేసిన నన్ను మరచిపోయారా?" అని వ్యాకుల పడింది.**

**"సాధ్వీ! మరచింది లేదు, తలచినది లేదు. నా కంటె నీవు వేరుగా ఉంటే కదా మరవటం. తలవటం. అనన్యం కాబట్టి మరచేది లేదు. ఆత్మ స్వరూపం కనుక తలచేది లేదు. నీవు ఇప్పుడు అడిగినట్లు నా చెవి నన్నొక నాడు అడిగిందనుకో. 'స్వామీ! మీకు నేను ఎంతో ఉపకరిస్తాను. నన్ను మీరు స్మరిస్తుంటారా?' అని. అప్పుడు నేనేమి చెప్పాలి? నా కంటె అది వేరై ఉంటే కదా! స్మరించటం, విస్మరించటం అనేవి!**

# 10. ఫలించిన ఆవేదన

- తనికెళ్ళ వేణు

జగన్మాత స్వరూపులు శ్రీబాబు నా చిన్నతనంలో అంటే సుమారు నాకు 5 లేక 6 స॥లు వయస్సులో పోతునూరులో మా యింటికి రావటం జరిగింది. డా॥లంక శేషగిరిరావుగారు, మా నాన్నగారు (పరిమి సుబ్రహ్మణ్య భాగవతార్)గారు, మంచి స్నేహితులు. గుండుగొలనులో శేషగిరిరావుగారిని కలవటం, వారు పోతునూరు కారులో మా యింటికి రావటం తరచుగా జరిగేది. ఎన్నో ఆధ్యాత్మిక విషయాలు, వైద్యాన్ని గురించి, భారత, భాగవతాల గురించి, వారు ఇద్దరు చర్చించుకునే వారు. అనుకోకుండా భక్తిని గురించి మాట్లాడుకుంటుంటే నేను ఆసక్తిగా వింటూ ఉండేదాన్ని.

తరువాత శేషగిరిరావుగారి ద్వారానే మా నాన్నగారు శ్రీబాబును కలుసుకోవటం జరిగింది. మా నాన్నగారి కోరిక మేరకు మా అందరికీ శ్రీబాబు దర్శన భాగ్యం లభించింది. అప్పటి నుంచి తరచుగా శ్రీబాబు మా యింటికి రావటం, వారితోపాటు భక్తులు శ్రీరాఘవరావు తాతగారు యింకా మరికొంతమంది భక్తులు వచ్చేవారు. శ్రీబాబు బోధ వింటూ అందరూ ఎంతో ఆనందించేవారు. నాన్నగారిచేత జగన్మాతమీద కీర్తనలు వ్రాయించి, నా చేత ఎన్నోసార్లు పాడించుకునే వారు. నాకు ఎంతో సంతోషంగా ఉండేది. మళ్ళా ఎప్పుడు వస్తారా? అని ఎదురు చూసేవాళ్ళం.

అలా ఉండగా రాఘవరావు తాతయ్యగారు వారింటికి రమ్మనమని శ్రీబాబును కోరగా, వారింట్లో పూజా పీఠం ఉంచి, తీర్థ ప్రసాదలు యిస్తూ, బోధను అందించేవారు. మా యింట్లో నాన్నగారు, అమ్మ కూడా పూజలు చేస్తూ ఉండటంతో, పూజకు కావలసినవి సర్దటం, అమర్చటం లాంటి చిన్నచిన్న పనులు చేస్తూ ఉండేదాన్ని. బాబు తాతయ్యగారింట్లో పూజా పీఠం పెట్టినప్పటి నుంచి పూజకు కావలసినవి ఎలా సర్దాలో నేర్పించి, ఆ సేవను అనుగ్రహించారు.

"బాబు అంటే ఎవరనుకున్నావు? శ్రీజగన్మాత స్వరూపము, మనందరిని ఉద్ధరించు మహనీయ మూర్తి, యిటువంటి సద్గురు మూర్తి

దొరకటం ఎన్నో జన్మల పుణ్యఫలం!" అని నాన్నగారు ఎప్పుడూ చెబుతూ వుండేవారు.

అలా సేవ చేసుకుంటున్నప్పుడు, శ్రీబాబు పూజ గదిలోకి వెళ్ళగానే, అమ్మను స్తుతిస్తూ (మాణిక్యవీణా ముపలాలయంతీ) అనే శ్లోకాలు చదివేవారు. మేము బయట నామం చేస్తూ ఉండేవాళ్ళం. పూజ గది నుండి ఏవో మాటలు వినిపిస్తుండేవి. ఆసక్తిగా వింటుండే దాన్ని . కానీ బాబుతో మాట్లాడాలంటే భయం. ఏది చెబితే అది చెయ్యటం తప్ప. తెలుసుకోవాలని కుతూహలం. నెమ్మదిగా ధైర్యం తెచ్చుకుని 'బాబూ!' అన్నాను. "ఏమిటి?" అన్నారు బాబు. భయంతో చెప్పలేక పోయాను. "ఫరవాలేదు. చెప్పు" అన్నారు. 'బాబూ! నాకు అమ్మ దర్శనం చేసుకోవాలని ఉంది. నేను ఎలా చేసుకోగలను? మీరు ఏం చెబితే అది చేస్తాను' అన్నాను.

"నేను నిన్నుఒకటి అడుగుతాను, సమాధానం చెప్పు' అన్నారు. 'అలాగే బాబూ!' అన్నాను. "నీ యింటి తలుపులు వేసి ఉన్నాయనుకో ఏం చేస్తావు?" అన్నారు బాబు. 'తలుపు తీయమని పిలుస్తాను' అన్నాను. "ఎవరూ తలుపు తీయలేదనుకో అప్పుడు ఏం చేస్తావు?" అన్నారు బాబు. 'గట్టిగా తలుపు తట్టి, ఇంకా గట్టిగా పిలుస్తాను. అప్పుడు కూడా తీయకపోతే, అమ్మా! తలుపు తీయవే అని గట్టిగా ఏడుస్తాను' అన్నాను.

"బిడ్డ అంత ఆవేదనతో పిలిస్తే ఏతల్లి అయినా రాకుండా ఉంటుందా? వచ్చి ఎంతో ప్రేమతో లాలించి ఊరడిస్తుంది కదా. అలాగే జగన్మాత మనందరినీ ఎంతో కరుణతో ఆదరించి, తన బిడ్డలకు ఎప్పుడు ఏది కావాలో అది అందిస్తుంది. నీవు చిన్నపిల్లవు కదా. పెద్దయ్యాక ముందు ముందు అన్నీ తెలుస్తాయి" అన్నారు శ్రీబాబు.

తరువాత శ్రీబాబు తరచుగా పోతునూరు వచ్చి ఉంటూ తన బిడ్డలందరకూ బోధనందిస్తూ సంకీర్తన చేయిస్తూ ఉండేవారు. శ్రీబాబు ఉన్నన్ని రోజులూ, గుండుగొలను నుండి శ్రీహరిగారు, బందా తాతయ్యగారు యింకా ఎంతోమంది భక్తులు వచ్చి, రాత్రి పూజ తరువాత తీర్థ ప్రసాదాలు తీసుకుని వెడుతుండేవారు.

ఈలోగా గుండుగొలనులో 1952, 53 సం॥లో మాతాజీగారి యింట్లో నవరాత్రుళ్ళు జరిగాయి. మేమంతా పోతునూరు నుండి వెళ్ళి తీర్థ ప్రసాదాలు తీసుకుని వస్తుండేవాళ్ళం. అప్పట్లోనే రాఘవ తాతయ్య పోతునూరులోనే నవరాత్రుళ్ళు జరిపించమని కోరగా, శ్రీబాబు అనుగ్రహించారు.

నవరాత్రుళ్ళు జరపటానికి 10రోజులు ముందుగానే వచ్చారు శ్రీబాబు. కార్యక్రమాలు ఎలా జరపాలో, ఏమేమి అమర్చుకోవాలో అన్నీ అందరికీ చెప్పారు. అందరం కలిసి ఎంతో బాగా జరుపుకోవాలని ఆనందం, ఎలా నిర్వహిస్తామో అని కంగారు. సరే! ఆ రోజే అమ్మ నవరాత్రులు మొదలు, విశ్వనాథం మామయ్య ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. శ్రీబాబు, నేను, యింకొక భక్తుడు లక్ష్మీ నారాయణ కలిసి మందిరం అలంకారం చేస్తున్నాము.

శ్రీబాబు "వేణూ! అమ్మమ్మను అడిగి ఒక కొత్తచీర తీసుకురా. అలంకారానికి వెనుక వైపు కడదాం" అన్నారు. నేను లోపలికి వెళ్ళి అమ్మమ్మను చీర అడిగితే, 'అయ్యో! కొత్తచీర లేదే! తెలియలేదు. లేకపోతే తెప్పించి ఉంచేదాన్ని' అన్నది నాతో. నేను యీ విషయం బాబుతో చెప్పి, 'బాబూ! నా దగ్గర ఉంది తీసుకురానా?' అన్నాను. "అయితే త్వరగా వెళ్ళి తీసుకురా" అన్నారు బాబు. నేను వెంటనే మా యింటికి వెళ్ళి చీర తీసుకు వచ్చాను. ఇంతలో అమ్మమ్మ వచ్చి 'అయ్యో! మరచిపోయాను బాబూ యింట్లో ఉన్న సంగతి' అని కొత్త చీర తెచ్చి యిచ్చింది.

"వేణు తెచ్చిందికదా! అది ఉండనీయమ్మా. ఇంకో అకేషన్‌కి పనికి వస్తుంది" అన్నారు బాబు. 'కాదు బాబు. గుర్తులేదు నాకు. ఇదే కట్టండి' అన్నారావిడ. "సరేనమ్మా! ముందు నీ చీరే కట్టి, పైన వేణు చీర కడతాను. పసుపు కుంకుమలు అన్నీ పడతాయి కదా." అన్నారు శ్రీబాబు. అలాగే చేశారు. నాకూ నా చీర కట్టడంతో ఎంతో సంతోషం అయింది. నవరాత్రి మహోత్సవాలు ఎంతో వైభవంగా జరిగాయి.

భక్తులంతా వెళ్ళిపోయారు. మరునాడు ఉదయం నేను పూజకు

సర్దుదామని అమ్మ గదిలోకి వెళ్ళాను. అఖండం నుండి ప్రక్క మామిడి ఆకులు అంటుకొని మందిరంపై వరకు మండుతోంది. అది చూసి నాకు చాలా భయం వేసి, నమస్కారం చేసుకుని, శ్రీబాబు దగ్గరకు వచ్చాను. ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. అయినా నెమ్మదిగా 'బాబూ!' అని పిలిచాను. "ఏమిటి అలా ఉన్నావు?" అన్నారు. నేను భయం భయంగా 'బాబూ! మందిరం దగ్గర ఆకులు అంటుకుని మందిరం పై వరకు మండుతోంది. మీకు చెబుదామని వచ్చాను' అన్నాను.

"అలాగా ఉండు వస్తున్నా" అని కిటికీలో నుంచి చూసి "ముఖం కడుక్కొని స్నానం చేస్తాను ఏర్పాటు చెయ్యి" అన్నారు. నేను త్వర త్వరగా వెడుతూ 'అయ్యో! అంత మండిపోతోంది. ఏమవుతుందో' అనుకుని, మళ్ళా నాలో నేనే 'బాబు భగవంతుడు కదా, అన్నీ ఆయనే చూసుకుంటారు' అని అనుకుంటూ పనులు మాత్రం చేస్తూ స్నానానికి ఏర్పాటు చేస్తున్నా, చెప్పలేనంత కంగారుగా ఉంది. సరే శ్రీబాబు వచ్చేవరకు ఎదురు చూస్తూ, పంచభూతములు భగవంతుని ఆధ్వర్యంలోనే ఉంటాయి కదా!' అని నమస్కారం చేసుకుంటూ కూర్చున్నాను. శ్రీబాబు రాగానే పట్టుబట్టలు ధరించి "పద" అన్నారు. భయం భయంగానే బాబు వెనకాలే అమ్మగదిలోకి వెళ్ళాను.

ఇదివరకు ఎంతవరకు మండుతోందో అలాగే ఉంది. 'అమ్మయ్య!' అనుకుంటూ మనసులోనే బాబుకు నమస్కరించాను. బాబు "వేణూ! రెండు పళ్ళాలు తీసుకురా, శుభ్రం చేద్దాం" అన్నారు. నేను తిరిగి వచ్చేసరికి మంటంతా పూర్తిగా తగ్గిఉంది. ఒకొక్కటీ బాబు తీసియిస్తుంటే అన్నీ తీసుకెళ్ళి అవతల ఉంచాను. ఇంత జరిగినా ఆశ్చర్యం! పూజాపీఠం చెక్కు చెదరలేదు. చివరలో అమ్మమ్మ యిచ్చిన చీర, నా చీర కూడా తీశాము. నా చీర మాత్రం అలాగే ఉంది. కానీ, అమ్మమ్మ చీర మాత్రం నాలుగైదు చోట్ల కాలింది.

"అయ్యో! అమ్మా! నీవు యిచ్చిన చీర పనికిరాకుండా అయింది. ఇలా జరుగుతుందని నేను అనుకోలేదు" అన్నారు బాబు. 'ఇదంతా మీరు చూపిన లీల. నేను చీర వెంటనే యివ్వలేకపోయాను కదా నన్ను క్షమించండి.

ఇలా నాకు తెలియచేశారు' అంటూ మా అమ్మమ్మ నమస్కారం చేసుకొంది.

శ్రీబాబు చిరునవ్వు నవ్వుకొంటూ, "వేణూ! అంతా శుభ్రం చెయ్యి" అని చెప్పి లోపలకు వెళ్ళారు.

మనం చెప్పుకొన్న అద్భుతాలు శ్రీబాబు సర్వసమర్థతకు ప్రత్యక్ష నిదర్శనాలు. అగ్నికి ఆధారభూతమైన, అనంతశక్తి స్వరూపిణి జగన్మాతను అగ్ని ఏమిచేయగలదు?

ప్రారబ్ధం అనుభవం వల్లనే నశిస్తుంది. అది విడచిన బాణం వంటిది అంటారు. కాని అది నిజం కాదు. ఆగామి సంచిత ప్రారబ్ధాలు ఒకటే.

ఒక ఆసామికి ముగ్గురు భార్యలు. ఆయన చనిపోతే యిద్దరు విధవ అయితే, ఒకరు సదవగా మిగులుతారా? ఒకప్పుడు గర్భవతియైన భార్యకు పునిస్త్రీ లక్షణాలు తొలగించరు. అయినా ఆమె యితరుల దృష్టికి సదవగా తోచినా, స్వీయ దృష్టికి విధవే.

చిత్తానికి 1. క్షిప్త, 2. మూఢ, 3. విక్షిప్త, 4. ఏకాగ్రత, 5. నిరుద్ధాలని ఐదు భూమికలున్నాయి.

1. రాగద్వేషమైన చంచలచిత్తాన్ని క్షిప్తం అంటారు.

2. నిద్ర, కునికిపాట్లు, బద్ధకంతో కూడిన చిత్తం మూఢం.

3. విషయ సమాసక్తమైన అప్పుడప్పుడు ధ్యానమగ్నమయ్యే చిత్తాన్ని విక్షిప్తం అంటారు.

4. తైలధారవలె ఒకే విషయంపై నిలిచే చిత్తస్థితి ఏకాగ్రం. ఇది అర్జునునిలో ఉంది. దీనినే సంప్రజ్ఞ సమాధి స్థితి అంటారు. ఇందులో ధ్యేయాకార వృత్తి ఉంటుంది.

5. ఆ ధ్యేయాకార వృత్తి కూడా నిరోధింపబడితే నిరుద్ధము లేక నిరోధావస్థ అంటారు. ఆ సంప్రజ్ఞ సమాధి ఇదే. దీనిని ధర్మ మేఘము అని యోగశాస్త్రమంటుంది.

# శ్రీసద్గురుదేవులు ప్రసాదించిన కీర్తన

మమకారములో పడకుమురా మాధవుని తలపరా జీవా॥

1. భార్యాపుత్రుల బంధుమిత్రుల
మమకారములూ మాయలేరా
మరువకురా మాధవుని పదములు
మదిలో సదా నిలుపరా ॥మమ॥

2, ఇది నాది అది నాదని
విర్రవీగెదవు ఏదీ నీదీ కాదురా
నేను నాది దూరమైనపుడు
నీవు నీవుగా నిలచెదవురా
ఇది నిజమురా ఇదే సత్యమురా ॥మమ॥

3. కామ క్రోధ మద లోభ మోహములు
కానరాక నిను కబళించునురా
కానలేవురా సత్యమార్గమును
గురు చరణములే నిను రక్షించును ॥మమ॥

**సర్వేశ్వరుడు సర్వాంతర్యామి అనే సత్యాన్ని శిష్యులు గ్రహించారో లేదో అని పరీక్షపెట్టి తెల్చుకోవాలని గురువు ఒకడు నిశ్చయించుకుని అందరికీ తలా ఒక మామిడి పండు యిచ్చి, ఎవరూ లేని ప్రదేశానికి వెళ్ళి తినమని పంపాడు. ఎవరిదారివారు వెళ్ళి తమ పండు తిని తిరిగి వచ్చారు. ఒక్కడు తప్ప. "నీవు పండు తినకుండా ఎందుకు తిరిగి వచ్చావు?" అని గురువు ప్రశ్నించాడు.**

**"నిత్యుడు, సర్వమయుడు అయిన సర్వేశ్వరుడు లేని తావు కనిపించ లేదు. అందుకని పండు తినకుండా వచ్చేశాను" అని జవాబు యిచ్చాడు.**

# మందార మకరందాలు

- వి.యస్.ఆర్. శర్మ

శ్రీబాబుతో ఒకాయన మాట్లాడుతూ తనకు తెలిసిన ఒక సాధకుని గురించి ఇలా చెప్పారు. "నేను చాలా నియమాలకు, నిష్టలకు సాధనా మార్గాలకు ఓర్చి చాలాకాలం కఠిన సాధన చేసి భగవంతుని సాధించకున్నాను అని చెప్తూ ఉంటారు బాబు !" అని ఇలాగ ఆయన చెప్తూండగానే మధ్యలో శ్రీబాబు అందుకుని " అలాగ చెప్పటంలో సంపూర్ణ సత్యం లేదు. ఎందుకంటే నీవు ఏ పని చెయ్యాలన్నా భగవంతుడు నీకు నాలుగు ఉపకరణాలు ఇచ్చాడు. అవి మనస్సు, బుద్ధి, చిత్త, అహంకారం, ధ్యానంలో కూర్చున్న తరువాత భావ సమాధిస్థితికి చేరుకునేటప్పటికి అవి నాలుగు లక్ష్యార్థంలో లయించి పోతాయి. అలాగ లయించిన తరువాత గాని భావసమాధి కలుగదు.

ఇక ఆపై నీవు ప్రయాణం చెయ్యడానికి ప్రయత్నించటానికి నీకు ఏం సాధనాలు మిగిలి ఉన్నాయి ? ఏమి లేవు. భావ సమాధికి చేరితే భగవంతుని తలుపులు తట్టినట్లే. అక్కడి వరకు వెళ్ళి నువ్వు ఆయన దయకోసం నిరీక్షించాల్సిన బాధ్యత నీ మీద ఉంది. నీ ఆవేదన ఎంత తీవ్రంగా వుంటే అంత త్వరగా భగవానుడు " అయ్యో! నా బిడ్డ నా దయ కోసం తీవ్ర ఆవేదనతో తపిస్తున్నాడే " అని దయతలచి, తనంతట తానే దిగి వచ్చి తానేమిటో తానే తెలియ చెప్పుకుంటాడు. ఆది ఆయన కృపవల్లే సాధ్యంగాని వేరు మార్గం లేదు.

భావ సమాధికి చేరగానే అక్కడ నీకు, భగవంతునికి మధ్య నువ్వు జన్మ జన్మలనించి ఆర్జించుకున్న వాసనలు గాఢాంధకారమైన చీకటిగా అడ్డుగా ఉంటాయి దానిని ఎలాగ దాటుతావు? అది దాటితే నిజ సమాధి ప్రాప్తిస్తుంది. వాసనా రహితమైతేగాని వాసుదేవుని దర్శనమవదు. ఆ వాసనలు భగవానుని కృపవలనగాని రహితం కావు. ఇది సంపూర్ణ సత్యం అని సెలవిచ్చారు.

ఒకసారి సమర్థ సద్గురుమూర్తి శ్రీ బాబుతో సముద్ర స్నానానికి చీరాల వెళ్ళాము. వెడుతూ ఉండగానే ఒక పెద్ద కెరటం శ్రీ బాబు దివ్య చరణార విందాలదాకా వచ్చి వెళ్ళి పోయింది. అది చూసి ఒక భక్తుడు " బాబూ! మామగారు చాలా హుషారుగా వున్నారు, ఆయనకి అల్లుణ్ణి చూసేసరికి కొండంత ఆనందమైంది " అన్నాడు. వెంటనే శ్రీబాబు "అలాగ కాదయ్యా మనవళ్ళని చూసే సరికి ఆయనకి ఆనందం పొంగి

పోయింది" అన్నారు. తన మీద ఉంచు కోకుండా. లోకంలో ప్రజలకి కన్న బిడ్డలకన్నా, వాళ్ళ కన్న సంతానం మనుమలంటే ముద్దెక్కువ అని వాడుక ఉంది గదా! అల్లుడైనా తనకన్నా అల్లుడి సంతానం మనమల్ని చూసి మురిసిపోయారట సాగరరాజు" అని ఛలోక్తి గా అన్నారు శ్రీ బాబు.

మరొకమారు 1971 సం॥ లో శ్రీ బాబూజీతో తిరుమలలో పాతాళగంగ వద్దకు వెళ్ళాము. ఒక చోట ఒక బండరాయిమీద స్వామి ఆసీనులు అయినారు. చుట్టూ భక్త బృందం నిలబడి ఉన్నారు. దగ్గరిలో ఉన్న ఒకరిని పిలిచి కారులో ఉన్న తినుబండారాలను తెమ్మన్నారు. అవి ప్రసాదంగా అందరికీ పంచిపెట్ట సాగారు.

అల్లంత దూరాన గొడ్లు కాసుకుంటున్న ఒక కుర్రాడు నిలబడి ఇది చూస్తున్నాడు. శ్రీ బాబు దృష్టి వానిపై పడింది. వెంటనే "ఒరే నాన్నా! ఇలా రారా" అని పిలిచారు ప్రసాదం పెడదామని, వాడు బిడియపడి రాలేదు, రెండోసారి ప్రసాదం పంచుతూ మళ్ళీ వాడిని " ఒరే తమ్ముడూ! ఇలా రారా!" అని మళ్ళీ పిలిచారు.అయినా సరే వాడు కదలలేదు. మూడోసారి ప్రసాదం పెడుతున్న శ్రీ బాబు గట్టిగా వాడిని "ఒరే బామ్మరిదీ ఇటురా" అని కేక వేశారు. శ్రీబాబు పిలిచిన వరసలకి అందరము గట్టిగా నవ్వేసాము. అప్పుడు శ్రీ గురుదేవులు "ఇన్ని వరసలతో పిలిచినా వాడు ఒక్కడే కదా! అలాగే రూపాలు నామాలు అనంతాలైనా ఉన్నది ఒకటే సత్యవస్తువు కదా! " అని తమ అనుగ్రహ భాషణలో " ఈ సత్యం మీరు గ్రహించాలనే నా తపనయ్యా" అన్నారు.

భగవంతుని లీలలు మౌనంగా ఆనందించాలనుకుంటే అవి అలాగ వుండనివ్వవు. ఆ ఆనందం అందరితో పంచుకునే వరకు ఊరుకోవు. ఇది పరమ సత్యం.

అశ్రు తర్పణము

శ్రీబాబూజీ చిరకాల భక్తులైన శీతేపల్లి రాజశ్రీ (వఠెం లక్ష్మణశాస్త్రిగారి మూడవ కుమార్తె) 13-10-2013 ఆదివారం శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 46 సంవత్సరాలు.

సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరుగాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# అక్షర సుమాంజలి

–డా॥ వారణాసి రామకృష్ణ శతావధాని

1. ఆధ్యాత్మిక కళాహంసీం, నమామి, విదుషీమణిం,
హనుమత్కాళికా ప్రసాద్, బాబు సద్గురు సేవినీమ్.

2. రాజయోగమహారాజ్ఞీం, చంద్రకాళీ ప్రసాదినీం,
ప్రణామి, భారతీదేవీం, బృందావన నివాసినీమ్.

3. పూజ్యశ్రీవరయోగినీం, గురుమణిం, కాళీప్రసాదాత్మికాం,
శ్రీకాళీచరణాబ్జసేవిత మహాబృందావనీకల్పకాం,
విశ్వవ్యాపితకీర్తిరత్నమకుటాం, వాణీవిపంచీశ్రుతిం
శ్రీకాళీవరచంద్రమాతృరమణీం,వందే, జగత్స్వామినీమ్.

4. అల, కృష్ణాతటినీవిహారి, నరసింహస్వామి, కొల్వున్న-కో
వెల దూరమ్మున నున్న, 'నంబురు పురిన్' – వేదాంతవిద్యాశ్రమం
బలరున్, నిత్యము, భక్తయాత్రికులు, మాతాశీః కృపం, బొందుచు
జ్జ్వలకైవల్యమహాప్రసంగసుధ, లాస్వాదింత్రు, ధన్యాత్ములై.

5. అది, కాళీవన సుందరాశ్రమము పుష్పాకీర్ణసౌగంధ్యస
మ్మదమందానిలబంధురమ్ము, పికముల్, మాధుర్యగీతమ్ములన్
ముద మిచ్చున్, గుడులున్ బడుల్, మహితబాబూజ్ఞానసౌధమ్ము-మో
క్షదమై, యొప్పు 'సమర్థసద్గురుల' – విశ్వవ్యాప్తసందేశముల్.

6. గురుపాదాంబుజయుగ్మ, మార్తజన సంక్షోభమ్ములం, బాపు; దు
ర్భరమోహాబ్ధిఁ దరింపఁజేయును; గన ద్రాఘిష్ఠనావం బలెం;
బరిరక్షించును, సత్యధర్మకరుణా ప్రజ్ఞాన సంస్కారముం;
బరమార్ధ, మ్మెటిఁగించు, మోక్షపదసోపానమ్ముగా, భక్తులన్

7. గురుశుశ్రూషయె, వేదసమ్మతము; భక్తుల్, శిష్యులుం, జంద్ర స
ద్గురుకాళీకరుణా ప్రసాదజననీస్తోత్రమ్ములం గాని, సుం
దరపాదార్చనచేతఁ గాని, శుభబోధాపూర్వసత్సంగ ని
ర్భరపీయూషదిముఁ ద్రావిగాని, గురుసేవం జేయఁగా, ధన్యులున్

8. శ్రీమాతాగురురాజ్ఞి, బాబుమహితాశీర్వాద లబ్ధప్రభా
ప్రామాణ్యోన్నత సంస్కృతాంధ్ర విదుషీరత్నమ్ము ; వాగ్దేవి, కా
ళీమంజీరరవార్ద్రచిత్త, జనతాక్లేశమ్ములం, బాపుచున్
శ్రీమోక్షోన్నతవాక్ప్రసంగ సుషమాక్షేమమ్ముఁ, గల్పించెడిన్.

9. ఘనముగ, నతిథుల కాశ్రమ
మున, షడ్రుచు, లొప్ప, రాజభోజన, మిడి, నే
తినిఁ, గొసరి కొసరి, వేయుచు,
దినిపించు – నచటి జనుల విధిని, మెచ్చవలెన్.

10. ఒకసారి, క్రతువుల యుత్సవ, మొప్పును
నొకతూరి, శ్రుతిఘోష, లొలయుచుండు,
నొకపటి, విద్యార్థులకు, బహుమతు లిచ్చు
సాంస్కృతిక కళాప్రసాదశోభ,
ఒకనాఁడు, సత్సంగ, మొకవేళ, దానధ
ర్మాచరణోత్తమ హర్షగోష్ఠి,
ఒకతడవ జరుగు, నుత్సాహ సంగీత
సాహితీ మధుర ప్రసంగ సభలు,
అమలకాళీమహోద్యాన, మందు, బాబు
సద్గురూత్తమాశ్రమము, విశ్వప్రసిద్ధ
దేవతామందిరములు, కాళీవరప్ర
సాదచంద్రమాతృరమణీ సదన, మమరు.

11. వర"సమర్థ సద్గురు" మాసపత్రిక, పర
మార్థము, లొసఁగుఁ, బ్రజలకు, నద్భుతముగ ;
భారతీయవేదాంత కావ్యప్రసంగ
ములను, గథలను, గవితల, స్ఫూర్తినిచ్చు.

12. ఖండఖండాంతరముల, నఖండకీర్తి
సాగ; శ్రీచంద్రకాళీప్రసాదమాతృ

యోగినీదేవి, వేదసమున్నతముగఁ
బ్రజల కొసఁగును, జ్ఞానమ్ము వాణివోలె.

13. ద్వారమునందు, స్వాగతముఁ బల్కుదు, రాశ్రమభక్తు, నెప్పుడుం
జేరిన యాత్రికావళికిఁ జిర్నగ వొప్పఁగఁ ; బిమ్మటన్. మహో
దారముగాగ, భుక్తినిడి, ధార్మికచర్చ లొనర్చి, స్వామినీ
గౌరవ దర్శనమ్మున, సుఖమ్మును, శాంతినిఁ గల్గఁజేయరే?

14. బాబు మందిరము, ప్రశాంతభాసురమ్ము ;
పరమదేవతామందిర ప్రాంగణములు,
వసతి గృహములు, నీరముల్, పాకశాల,
పాఠశాలయుఁ, బత్రిక, స్వాగతించు

కవిరాజవిరాజితము ః

ప్రణతులు, సద్గురుభాసురభారతభారతి! యోగిని! రాజితస
ద్గుణఖని! మాతృక! కోమలభార్గవి! గూఢరమామణి! దోహలరూ
పిణి! మహిమోన్నత! విశ్వవికాసిని! వేదవిచారిణి! ప్రేమవిభూ
షిణి! జయరూపిణి! శ్రీశివరాగిణి! శ్రీమృదుభాషిణి! శిష్టఘృణీ!!

మంగళమహాశ్రీః

మంగళము, మాతకు, సుమంగళము బాబునకు, మంగళము రామునకు, న్నిత్యన్మంగళము, ధూర్జటికి, మంగళము కాళికకు, మంగళము నాగపతికిన్, సన్మంగళము, భారతికి, మంగళము లక్ష్మికిని, మంగళము భక్తులకు, శ్రీశ్రీ మంగళము, భారతసమర్థఘన సద్గురుని మాసకృతి – మంగళమహాశ్రీ.

**ఆత్మసాక్షాత్కారము కావాలంటే సాధనను ఆచరించి తీరాలి. కాని పరిపూర్ణ శ్రద్ధ ఉంటే, స్వల్ప సాధన అయినా చాలు.**

– శ్రీరామకృష్ణ పరమహంస

# వందనములివె ముల్లోక వందితునకు

– విజయేశ్వరానంద ప్రసాద్

సీ॥ యెడద లోతుల నుండి నడయాడి వచ్చి, నా
సమ్ముఖమ్మున నిల్చు సద్గురునకు।
ప్రాణమై, మానమై, భావమై, పలికించి,
నడిపించు నా ప్రాణ నాయకునకు।
కదలకే తానుండి, కనిపించు జగమెల్ల
కదిలించునట్టి జగద్గురునకు।
అణువులోనణువై, మహత్తుకే మహితుడై
రాజిల్లు గురుపరబ్రహ్మమునకు।

తే॥గీ ఘనతమిస్ర మూలాజ్ఞాన దినకరునకు।
చటుల భవరోగహరణ భిషగ్వరునకు।
పదసమాశ్రిత రక్షణ పండితునకు।
వందనములివె। ముల్లోక వందితునకు॥

సీ॥ పంచరంగులమీది చాంచల్యమణగునే
నీ మూర్తిపై దృష్టి నిలువగాక?
పసలేని రుచులపై వ్యసనంబు మానునే
రసన సంకీర్తన వ్యసిత గాక?
శబ్దజాలారణ్య సంచారమాగునే
నీ కథాకర్ణన నిరతి గాక?
కరయుగళ మకార్య కరణమ్ము విడచునే
నీ పాదసేవన నియతి గాక?

ఆ॥వె॥ ధరణి రుచుల మరగి మరలని నామది
మరలగలదె నీదు కరుణగాక?
దీనబంధు వీవు। దీనముఖ్యుడ నేను
దయనుజూప తప్పదయ్య నీకు ॥

సీ॥ ననుజేర నడయాడు నా పాలి దైవమా
నిను జేర్చు నడకలు నేర్పుమయ్య।
నీ చిరు దరహాస రోచిర్విభూతిలో
నిన్నెరుంగు తెలివి నీయుమయ్య।
కురియు వెన్నెలలలో, గురురాజ చంద్రమా
నీ రూపు గను చూపునీయుమయ్య।
అభయ హస్తోద్గార ప్రభలలో నీ కృపా
విభవమ్ము గను వెరవీయుమయ్య।

ఆ॥వె॥ నిన్ను దప్ప నన్య మెన్నడు నొల్లని
చిత్తశుద్ధి గలుగ జేయుమయ్య।
నిండు కరుణ తోడ నీ లోన జేరిచి
నన్ను మనుపు మయ్య నాధ నాధ ॥

సీ॥ ఈ చరాచర సృష్టి కేలిక యెవ్వడు?
నిగమ త్రయమ్ము వర్ణించు నెవని?
బ్రహ్మంబు రూపింప బడెడు నెవ్వని చేత?
కైమోడ్పు వెవ్వనికై ఘటిల్లు?
అన్య మొండును గల్గ దరయ నెవ్వని కంటె?
లోకంబు వెవ్వనిలో నడంగు?
సదసత్తులును రెండు సత్యమెవ్వని యందు?

'హే గురూత్తమ!' యందు రెవని బుధులు?

తే॥గీ॥ అట్టి గురుని యందవిభక్తమైన భక్తి
నిశ్చలము, నిరంతర మతి నిర్మలమ్ము।
నిరుపమము నిర్వికల్పమై నెగడుగాక!
నా మనంబున శ్రీ గురునాధు కరుణ ॥

సీ॥ నరక బాధలనైన చెరగని చిరునవ్వు
ప్రహ్లాదునకు సిద్ధ పరచె నేది?
ప్రళయమందైన లోబడని నిశ్చయ బుద్ధి
ధృవకుమారునకు నందించె నేది?
అవసాన మందైన నలయని గురు దీక్ష
శబరి తల్లికి సుప్రసాద మేది?
తుది క్షణంబున గజేంద్రునకు బుద్ధి నొసంగి
నిన్ను బాడెడు తెల్వి నిచ్చె నేది?

తే॥గీ॥ అట్టి యవ్యాజమౌ నీ దయా రసంబు
చిన్న చినుకైన నా పయి చిందనిమ్ము
నిన్ను దక్క వేరొల్లని నిశ్చయమ్ము
హృదయబాబూ! చలించు నా మదికి నిమ్ము ॥

అఖిల లోకానీకమ్ము నాకృతి దాల్చునే
చతురాస్యు కడగంటి సైగ జేసి।
పదునాల్గు భువనముల్ పదిలమై నిలుచునే
కమలనాభు నగణ్య కరుణం జేసి
సృష్టి సమస్తమ్ము నష్టమై పోవునే

ఫాలనేత్రుని దృష్టి పడగ జేసి
పరతత్వ మెల్లను కరతలామలకమౌ
నే గురుబ్రహ్మ మీక్షింపజేసి

తే॥గీ॥ అట్టి బ్రహ్మయు, విష్ణువునగుచు, నాపు
రారివౌచు సాక్షాత్పరబ్రహ్మవైన
పరమ గురుదేవ నీ పద పంకజమ్ము
నా కనన్య శరణ్యమౌగాక సతము ॥

***గ్రీకు దేశంలో ఒక వేదాంతి ఉండేవాడు. అతను బానిస అవటం చేత చేసిన ప్రతి చిన్న అపరాధానికి కఠినంగా శిక్షించేవారు రోము అధికారులు. ప్రతిరోజూ అతనికి దెబ్బలు తినటం తప్పేది కాదు.***

***పెద్ద తప్పేమీ చేయక పోయినా యజమాని నిర్దయగా బాదటం వలన అతని కాలు విరిగి పోయింది. స్నేహితుడు ఒకడు దూరం నుంచి చాలా కాలానికి వచ్చి, ఎలా కుంటివాడివి అయ్యావు? అని అడిగాడు.***

***ఆ వేదాంతి చాల విలక్షణమైన జవాబిచ్చాడు. "నేను కుంటివాడిని కాదు, నా కాలు మాత్రమే కుంటిది" . బాహ్య శరీరానికి, ఆత్మకు సంబంధం లేదనే స్థితికి అతడు చేరుకున్నాడు.***

# శ్రీ గురు తత్త్వము – శ్రీగురు ఉపాసన

– శ్రీ రామతారక పరబ్రహ్మ ప్రసాద్

మన భారతీయ సంస్కృతిలో అతి ఉన్నత స్థానము, పరమ సత్యమును అనుభవ పూర్వకంగా తెలుసుకుని, ఆశ్రితులను అనుగ్రహించు సద్గురు దేవులకే యివ్వబడినది. సృష్టి స్థితి లయకారకులనబడిన బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు మూలకారణమైన పరబ్రహ్మమే పరమ గురుతత్త్వమనియు, గురువుకంటె అధికమైనది ఏదియూ లేదు, అనునది శివహరి విధి శాశనమనియు, శ్రీగీత ప్రవచనము.

గురుగీతలోని గురుధ్యాన శ్లోకములు, ముఖ్యముగా "బ్రహ్మానందం పరమ సుఖదం" (111 శ్లో॥, ) "యస్యాంతం, నాది మధ్యం"... (324 శ్లో)మొదలగునవి, గురువు, బ్రహ్మానందుడు, పరమసుఖ ప్రదుడు, కేవల జ్ఞాన స్వరూపుడు. ద్వందాతీతుడు, అద్వితీయుడు, నిత్యుడు, సర్వశరేంద్రియ బుద్ధ్యాదులకు అతీతుడైన సాక్షిమాత్రుడు భావాతీతుడు. త్రిగుణరహితుడు, ఆదిమధ్యాంత రహితుడు, జాతినీతికులగోత్రాతీతుడు, స్త్రీపుంస నపుంసకాది భేద రహితుడు, ఆకారవికార జనన మరణాది అవస్థలు లేనివాడు, సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, అపరిమితుడు, పరిపూర్ణుడు అని వర్ణించి యున్నవి. అందువలన గురువు అనగా పరబ్రహ్మ – పరమాత్మ తత్త్వ అనుభవ స్వరూపుడని స్పష్టమగుచున్నది.

శంకర భగవత్పాదులవారు కూడా "కో గురుః?" (గురువు అనగా ఎవరు?) అను ప్రశ్నకు "అధిగీతా తత్త్వజ్ఞః, శిష్యోద్ధరణాయ ఉద్యతః సతతం" (తత్త్వ జ్ఞానమును అధిగమించి యుండి, శిష్యులను ఉన్నత స్థితికి చేర్చుటకు ఎల్లపుడూ ప్రయత్నించువాడు) అని సమాధానము చెప్పియున్నారు. తాను బ్రహ్మ స్థితిలో ఉండుటయేకాక, ఆశ్రితులను కూడా బ్రహ్మీభూతులను చేయువాడు కావుననే గురుదేవుడు అనబడినాడు. సాధన స్థితిలో ఉన్నవాడు గురుదేవుని ఆశ్రయించవలసిన లఘుస్థితిలో ఉన్నవాడు కావున గురు భావమును పొందుట అహంకారమగును. అహంకారము ఉన్నంతవరకు గురువు కాజాలాడు. గురుగీత గురువునకు ఉండవలసిన లక్షణములు, ఉండకూడని లక్షణములు తెలియజేయుచూ, లోకములో గురువులుగా భావింపబడువారిలో, శిష్య చిత్తాపహారులు, విత్తాపహారులు, బాధక గురువులు, బోధకగురువులు అనేక రకముల

వారు ఉన్నారనియు, బుద్ధిమంతులగు సద్గురువులనే గురువునే ఆశ్రయింపవలెనని హెచ్చరించినది.

ప్రాథమిక, సాధారణ స్థితులలో ఉన్న సాధకులు, సిద్ధపురుషులైన గురుదేవులను ఆశ్రయించలేకపోయినను, ఉత్తమ స్థితిలో ఉన్న సాధకుల సాంగత్యమును సంపాదించు కొనినచో, వారి ద్వారా క్రమముగ సద్గురు సమాశ్రయమును పొందగలుగుదురు. సాధన యందు శ్రద్ధగలవారు, సత్త్వవర్తన, సాధనకు ఉపకరించని వస్తువులను, భావములను, అభ్యాసములను విడిచిపెట్టుట, తన విధులను సరిగా నిర్వర్తించుట, నియమ బద్ధమైన నిత్య జీవితము, నియమిత సమయములకు ప్రార్థన, పూజ, పారాయణాదులు చేయుట, యితరులను నిందించుటగాని, విమర్శించుటకాని చేయకుండుట, కాలము వ్యర్థము చేయకుండుట, సాధనకు ఉపయోగించు భావములు, కార్యములు కలిగిఉండుట మొదలగు సాత్విక నియమములను పాటించుచున్నచో, వారికి సజ్జన సాంగత్యము ద్వారా తగిన కాలమున సద్గురుని ఆశ్రయము లభించుట దైవనిర్ణయము.

భగవంతుని యందు ఎట్టి భక్తి కలిగి ఉండవలెనో, అట్టి భావమునే శ్రీగురు భగవానుని యందు కలిగి ఉండు సాధకునకు, సద్గురుదేవుని అనుగ్రహ ప్రసాదము వలన సత్వ సిద్ధి కలిగి, సత్యమునందు నిష్ఠ కలుగును. ప్రశాంతి ఆనందస్ఫూర్తి కలుగునని ఉపనిషత్ నిర్వచనము. జగద్గురువైన శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన 1. "సర్వేషు కాలేషు మామనుస్మరః యుద్ధ్యచ" , 2. "మయ్యేవ మన ఆధస్స్వ" , 3."మయి బుద్ధిం నివేశయ", 4. "అతః ఊర్ధ్వం మయి ఏవ నివసిష్యసి" అను ముఖ్య సూత్రములను మరువక ఆచరించుచున్నచో సద్గురు కృప లభించి, జన్మ సఫలమగును.

శ్రీగురుదేవుడు పరబ్రహ్మ - పరమాత్మయే అని తెలిసినచో ఆ మహాత్ముని అనుగ్రహము సంపాదించుటకు చేయు విశేష ప్రయత్నమే ఉపాసనగా పరిణమించును. నిరాకార నిర్గుణుడైన పరమాత్మ ఉపాసకులను అనుగ్రహించుటకు రూపమును కల్పించుకుని, ప్రత్యక్షమగునని 'ఉత్తరగీతా' వాక్యము. "జ్ఞానాదేవహి కైవల్యమ్" అని ఉపనిషత్ బోధ కావున ఆత్మజ్ఞానము వలన మాత్రమే ముక్తి లభించును. అట్టి జ్ఞానము సద్గురు కృప వలననే లభించును. ("ముక్తిమూలం గురోఃకృపా" - శ్రీగురుగీతా) కావున గురుకృపను సాధించుటకు గురువు ఉపాసనయే ఉత్తమ మార్గము. అందువలననే

"నిరాలంబోపనిషత్" ఎవరిని ఉపాసించవలెను? అను ప్రశ్నకు "సర్వశరీరస్థ చైతన్యః బ్రహ్మాప్రాపకః గురురుపాస్యః".

"సర్వశరీరములలో ఉన్న చైతన్య పరబ్రహ్మమును తానుగా అనుభవమును పొందుచు 'గురువు'ను ఉపాసించవలెను" అని సమాధానము చెప్పినది. ఉపాసించుట అనగా, అత్యంత సమీపమున ఉండుట - అనగా, ఐక్యమగుటకు తగినంతగా త్రికరణములతో సన్నిహితమగుట. దీనిని సాధించుటకే గురుగీత "గురుమూర్తిం స్మరేన్నిత్యం, గురోర్నామ సదా జపేత్, గురోరాజ్ఞాం ప్రకుర్వీత, గురోరన్యం న భావయేత్". ("గురుమూర్తిని నిరంతరము స్మరించవలెను. గురునామమును సదా జపించవలెను. గురుని ఆజ్ఞను పరమముగా చేయవలెను. గురునికంటె వేరుగా ఏదియూ లేదు భావములోనికి రానీయకూడదు. అని సంగ్రహముగా బోధించినది.

శ్రీకాళీ వనాశ్రమము (నంబూరు)వారు ప్రచురించిన శ్రీగురుగీతలో శ్రీగురు తత్త్వము - శ్రీగురు ఉపాసనా విధానములు చక్కగా వివరింపబడి యున్నవి. ఆ గ్రంథము ఒక గురూపాసకునిచే శ్రీగురుదేవుని బోధలననుసరించి, వ్యాఖ్యానము చేయబడినది కావున, శ్రీగురు తత్త్వము, శ్రీగురూపాసనములను గురించిన అనేక విశేషములను విశదీకరించుచున్నది. జిజ్ఞాసువులు పరిశీలింపగలరు.

శ్రీ గురూపాసనకు ముందుగా తన గురుదేవునియందు అతడు పరబ్రహ్మ పరమాత్మయే అనెడి భావము దృఢముగా ఉండవలెను. అనగా గురుతత్త్వము, పరమాత్మ తత్త్వము - పరబ్రహ్మ తత్త్వము ఒక్కటే, అంతకు మించిన తత్త్వము వేరుగా ఏదియును లేదు. ("నాస్తితత్త్వం గురోః పరం") అని నిశ్చితాభిప్రాయము ఏర్పడవలెను.

నామ, రూప, గుణ, క్రియాదులను బట్టి వ్యక్తిగా భాసించినను, ఏ మాత్రమూ - వ్యక్తి భావ భ్రాంతిని పొందక, "అప్రత్యక్షో మహాదేవః సర్వేషాం ఆత్మమాయయా, ప్రత్యక్షో గురురూపేణ వర్తతే భక్తి (ముక్తి) సిద్ధయే" (నిర్గుణ నిరాకారుడైన మహాదేవుడు తన మాయచేతనే ఆశ్రితులను భక్తి, ముక్తి సిద్ధింప జేయుటకు గురు స్వరూపముతో ప్రత్యక్షముగా ప్రవర్తించుచున్నాడు.) అనెడి దృఢ భావ భక్తి జ్ఞానములను కలిగి వుండవలెను. ఇట్టి దృఢత్వము కలుగుటకే శ్రీకృష్ణపరమాత్మ చెప్పిన శ్రీగురుగీత చెప్పిన ముఖ్యసూత్రములు నిరంతరముగా స్మరించుచూ ఆచరింపదగి యున్నవి.

"నీ సరియగు లక్ష్యమొక్కటియె చాలును సాధనలెల్లకూర్చు 'ను' అని ఒక సద్గురు భక్తుని అనుభవసార వచనము. ఏకలవ్యుని సాధనావిధానమిట్టిదే. విశ్వసించిన గురుదేవుడు ఎట్లున్ననూ నీ దృఢ భక్తి భావము 'పరమాత్మ' అనియే కావున అనుగ్రహము పరమాత్మ నుండియే లభించును.

ఇది గురు (శివ) తత్త్వ శాసనము. ఇట్టి దృఢ నిశ్చయము ఉన్నచో దాని వెంటనే (ఏకలవ్యుని వలెనే) గురుదేవునకు సర్వసమర్పణము చేయుగుణము ఏర్పడును. అట్టి త్యాగము వలనే అమృతత్త్వ పరమార్థము లభించును. "జ్ఞానాదేవతు కైవల్యం" (జ్ఞానం వలన మాత్రమే ముక్తి) అని చెప్పిన ఉపనిషత్ వాక్యమును అతిక్రమించి, "జ్ఞానం వినా (అపి) ముక్తి పథం లభతే గురుభక్తితః" (జ్ఞానము లేకపోయినను గురుభక్తి వలన ముక్తి కలుగును) అనెడి 'గురుగీత' వాక్యము పరమేశ్వరుని చేత ప్రవచింపబడినది. శ్రీగురు భక్తి ప్రభావమింత ప్రబలమైనది. కావుననే ఉపనిషత్ "గురురుపాస్యః" అని చెప్పినది.

ఏ వ్యక్త (క్తి) రూపమునందైనను, "గురుభావము" దృఢమగు వరకు, యిష్ట దైవమునే గురుభావముతో, దృఢ భక్తితో సేవింప వచ్చును. అది అవసరార్థ, కార్యార్థ భక్తిగా ఉన్నచో, పరమార్థ, పరమసుఖ, పరమశాంతి, పరమానందము లభింప జాలదు. పిండి కొలదియే రొట్టె అన్నట్లుగా భక్తియొక్క స్థితిని బట్టియే ఫలముండును.

అందువలలనే ఫలము కోరకుండా, సత్కర్మ చేయుమనియు, ఫలము కోరి చేసినను చివరకు ఫలమును కృష్ణార్పణము చేయుమనియు, భగవద్గీత బోధించినది. కావున అవసరార్థ గురుభక్తితో ప్రారంభించిననూ, క్రమముగ నిష్కామ గురుభక్తిగా మారి, క్రమక్రమముగా గురూపాసనగా పరిణమించి, శ్రీగురు పరాభక్తిగా పరిపక్వం చెంది, గురుతత్త్వజ్ఞానులై పరమశాంతిని, పరమానందమును అనుభవించువారు కాగలరని, శ్రీగురుదేవుల ఆశీర్వచన పూర్వక ప్రబోధము.

ఓం తత్సత్! శ్రీగురు శ్శరణమ్! ఓం

గత సంచిక తరువాయి

-రమణ ప్రసాద్

# విష్ణు  కథలు

## శ్రీరమణ మహర్షి

మృత్యు అనుభవంతో వెంకట్రామన్ జీవితం పూర్తిగా మారిపోయింది. వైరాగ్యం అతన్ని వరించింది. ఒక నూతన శక్తి ఆవిర్భవించింది. అదే పరాభక్తి. ఆ భక్తి మాధుర్యన్ని శ్రీ రమణుడే ఇలా వర్ణిస్తున్నారు."

సమస్త ధరామండలం జలప్రళయంలో మునిగి పోతుంటే పరమేశ్వరుడు ఒక చిన్న భూభాగాన్ని త్రిశూలంతో ఎత్తి పెట్టాడు ఆ ఊరే 'తిరుచ్చుళి' (సంస్కృతంలో త్రిశూలపురం).

ఈ నిర్వచనానికి శ్రీ కావ్యకంఠుడు ఉప్పొంగిపోయి తన గురుమూర్తికి "భగవాన్ శ్రీ రమణ మహర్షి' అని పేరు పెట్టాడు. శ్రీ గణపతి మునికి గల వేలాది శిష్యులు శ్రీరమణుని శిష్యులయ్యారు.

అలగమ్మ కుమారుని తో ఉండటానికి వచ్చేసింది. ఆమె సనాతన ఆచారవంతురాలు. శ్రీ రమణుడు ఆమె ఆచారపు పట్టుదలలన్నిటినీ వదలించారు. 1922 మే 19న ఆమెకు అవసానకాలం సమీపించినది అని గ్రహించిన శ్రీరమణుడు తన హస్తాలను ఆమె హృదయం పైనా శిరస్సు పైనా ఉంచి ఉదయం 8గంటలనుండి రాత్రి 8గంటల వరకు అలా కూర్చున్నారు. చెయ్యి తీసివేసి హమ్మయ్య అంటూ 'నా హస్తాల ద్వారా నా శక్తిని అమ్మలో ప్రవేశపెట్టాను. అమ్మ ప్రారబ్దానికి నా శక్తికి పెద్ద యుద్ధం జరిగింది. అమ్మ భవిష్యత్తులో అనుభవించవలసిన అనేక జన్మల ప్రారబ్ధాన్ని ఈ పరిమితి కాలం లోనే అనుభవింప చేశాను అలా ప్రారబ్ధ సంచితాలు నిశ్శేషమయ్యాయి. అమ్మ మోక్షస్థితిని పొందింది. ఇంతటి బ్రహ్మాండమైన శక్తి పాతాన్ని గతంలో ఎవరూ చేసి వుండలేదు. గురువు మార్గాన్ని చూపగలడు కాని మోక్షాన్ని అనుగ్రహించ లేడని కొందరు వాదిస్తారు. అది నిజం కాదు.' అని శ్రీరమణుడు వెంటనే "ఇక మనం భోజనం చేయవచ్చు" అని అజ్ఞాపించారు. శవం ఉండగానే భోజనం

చేశారు. అమ్మను కొండ పాదంలో సమాధి చేశారు. తరువాత ఈ సమాధి పైననే మాతృభూతేశ్వరాలయం' నిర్మించారు. ఇదే నేటి రమణాశ్రమంగా వర్ధిల్లుతోంది.

శ్రీరమణ భగవాన్ సమాధి నిష్టులై ఉంటారు. ఆ సన్నిధిలో శాంతి సౌరభం పరిమళిస్తూ ఉంటుంది. శ్రీఅరవిందులు శ్రీరమణులను శాంతి ప్రభవు(Prince of Peace) అని అభివర్ణించారు. శ్రీరమణుని సన్నిధిలో సందేహాత్ముని హృదయంలోనే సమాధానం స్ఫురిస్తుంది. చిత్రంగా అడగని ప్రశ్నకు చెప్పడుండానే సమాధానాలు వస్తాయి.

ఆత్మ స్వరూపుడైన శ్రీ రమణుడు ప్రేమపూర్ణుడు. శ్రీరమణుని ప్రేమవాహిని సమస్త చరాచరాన్ని మనిషి, జంతువు, చెట్టు, రాయి అని భేదం లేకుండా, సమస్తాన్ని ముంచెత్తుతుంది.

శ్రీరమణుని దివ్యలోచనములు తేజోపూర్ణములు. ఆ కనుల నుండి కరుణలహరి నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. ఈ రహస్యాన్ని శ్రీరమణులే ఒకసారి విప్పి చెప్పారు. నేను దీక్ష ఇవ్వటం లేదు అంటున్నారు. నేను ఇస్తూనే వున్నాను వీక్షణ దీక్ష. దీక్ష పొందిన వారికి ఈ సంగతి తెలియక పోవచ్చును.

– సశేషం

### అశ్రుకణం

శ్రీబాబుజీ చిరకాల భక్తులు, భీమవరం వాస్తవ్యులు అయిన శ్రీమతి మానేపల్లి నాగవెంకట రత్నమాల (భీమవరం గుప్తాగారి ధర్మపత్ని) 22-11-13 మంగళవారం నాడు శ్రీసద్గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 52 సం॥లు.

శ్రీసద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి బంధు మిత్రులకు, కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL